అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 29-4-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 119

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు వెల : 6.50

ప్రజాస్వామ్య విధ్వంసం

బీజేపీ నియంతృత్వ విధానాలు ప్రమాదకరం.. : శరద్ పవార్



ముంబయి : బీజేపీ నియంతృత్వంతో వ్యవహరిస్తూ.. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోందని ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ ధ్వజమెత్తారు. ఆదివారం బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో భాగమైన పూణెలోని సస్వాద్ తహసీల్‌లో నిర్వహించిన ప్రచారంలో శరద్ పవార్ మాట్లాడారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు గతంలో ఎన్నికల కంటే భిన్నంగా ఉన్నాయని, ఏ ...13లో



నవాబులు.. సుల్తానుల అరాచకాలపై మౌనమా..!

కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు ప్రమాదకరం : ప్రధాని మోడీ

బళ్లారి : కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు దేశానికి, కర్నాటకకు ప్రమాదకరమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. కర్నాటకలోని బళ్లారి, బెళగావి తదితర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ రాజకీయ లబ్ధికోసం ఎంతకైనా తెగిస్తుందని, నిషేధానికి గురైన పీఎఫ్ఐ కొమ్ముకాస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ యువరాజు రాజులు, మహారాజులను అవమానించారని, నవాబులు, నిజాంలు, సుల్తానుల అరాచకాలపై మౌనంగా ఉన్నారని అన్నారు. ఓటు బ్యాంకును దృష్టిలో ...13లో

బిలియనీర్లకే ప్రయోజనం

బీజేపీ, బీజేడీ కలిసే ఖనిజ సంపద లూటీ : రాహుల్‌గాంధీ

భువనేశ్వర్ : ఒడిశాలో విడివిడిగా పోటీ చేస్తున్నప్పటికీ బీజేపీ, బీజేడీ కలిసే ఉన్నాయని రాహుల్‌గాంధీ విమర్శించారు. కేంద్రపాడ లోక్‌సభ నియోజకవర్గంలోని సాలిపూర్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. మోడీ, నవీన్ పట్నాయక్ చేతులు కలిపి కొంతమంది బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చారని విమర్శించారు. రాష్ట్రాన్ని అదానీకి అప్పగించారని అన్నారు. రాష్ట్రంలో బీజేడీ, బీజేపీ భారీ కుంభకోణాలకు పాల్పడ్డాయని అన్నారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులు ప్రజల ఆస్తులేనని, రూ.9 లక్షల కోట్ల ఖనిజ సంపదను దోచుకున్నారని విమర్శించారు.

రూ.20 వేల కోట్ల మేర భూములు లాక్కున్నారని, రూ.15 వేల కోట్ల ప్లాంటేషన్ కుంభకోణం జరిగిందని చెప్పారు. పేదలు, రైతుల కోసం పనిచేసే కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



తెలంగాణలో మోడీకి ఓట్లడిగే హక్కు లేదు

విభజన హామీలను అమలుచేసింది లేదు..



- దేవుని పేరుతో కాకుండా అభివృద్ధిపై ఓట్లడిగే దమ్ము బీజేపీకి ఉందా..?
- ప్రజలను మభ్యపెడుతున్న కేసీఆర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్బీనగర్

రాష్ట్రానికి వచ్చి ఓట్లు అడిగే అర్హత ప్రధాని మోడీకి లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హైదరాబాద్ వనస్థలిపురం రైతు బజార్ వద్ద, అల్వాల్ సర్కిల్ కైకుర్ వద్ద కార్నర్ మీటింగ్‌ల్లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మోడీ ఏ మొఖం పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణకు రావాల్సిన బయ్యారం ఉక్కు స్టీల్, రైల్వే కోచ్, ఐటీఐ ఆర్ కంపెనీ, పాలమూరు ఎత్తిపోతల పథకం ఎందుకు ఇవ్వలేదన్నారు. ఓబీసీ, ఎస్సీ ఎస్టీ బీసీల రిజర్వేషన్లను బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తుందని, మోడీ రిజర్వేషన్లపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. బీజేపీ మతం, దేవుని పేరుతో ఓట్లు అడుగుతోందని, దమ్ముంటే అభివృద్ధి పేరుతో ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. బీజేపీ పుట్టకముందే తెలంగాణలో శ్రీరామ నవమి జరుపుకున్నారని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్ర చేస్తూ ప్రజలను మభ్యపెట్టడానికి ...13లో

ఆత్మరక్షణలో బీజేపీ

రిజర్వేషన్లను రద్దు చేయబోమని పదేపదే వివరణలు

- రాజ్యాంగాన్ని మార్చబోమంటూ వేడుకోలు
- ఓబీసీ ఓటు బ్యాంకుకు గండి పడుతుందని ఆందోళన



న్యూఢిల్లీ : బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చబోదని, రిజర్వేషన్లను రద్దు చేయబోదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇటీవలే చెప్పారు. పార్టీపై ముప్పేట దాడి పెరగడంతో ఆయనతో పాటు పలువురు బీజేపీ నేతలు డిఫెన్స్‌లో పడి పదేపదే వివరణలు ఇచ్చుకుంటున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఉండబోవని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శతో బీజేపీ ఆత్మరక్షణలో పడిపోయింది. ఈ నెల 25న 'ది హిందూ' పత్రిక ప్రతినిధితో రాజ్‌నాథ్ మాట్లాడుతూ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు. 'రిజర్వేషన్లకు స్వస్తి చెప్పే ప్రసక్తే లేదు. రిజర్వేషన్లు అవసరమని నేను గట్టిగా నమ్ముతున్నాను. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చాల్సిన అవసరమున్నదని కూడా మేము ...13లో

ఓట్లు రాలవేమోనని...

2009 ఎన్నికల్లో ఓబీసీ ఓట్లలో బీజేపీ 17 శాతం వాటాను పొందింది. 2019 నాటికి అది 47 శాతానికి పెరిగింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తే ఓబీసీ ఓటు బ్యాంకుకు గండి పడుతుంది. అందుకే రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచన ఏదీ లేదని బీజేపీ నేతలు ముక్తాయింపు ఇస్తున్నారు.

వివాదానికి ఆద్యుడు ఆయనే

రాజ్యాంగాన్ని మార్చాలంటే 400కు పైగా స్థానాలు పొందాల్సి ఉంటుందని బీజేపీ నేతలు నిన్న మొన్నటి వరకూ చెబుతూనే ఉన్నారు. అయితే ఇప్పుడు వారి నుంచి ఆ మాటే రావడం లేదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మద్దతుదారుల్లో నిరసన వ్యక్తం కావడమే దీనికి కారణం. అసలు ఈ వివాదానికంతటికీ కారణం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మెన్ వివేక్ దేవ్‌రాయ్. గత సంవత్సరం ఆగస్టు 14న ఆయన ఓ వార్తాపత్రికలో వ్యాసం రాస్తూ నూతన రాజ్యాంగం ప్రస్తావన తీసుకొచ్చారు. దీనిపై వివాదం చెలరేగడంతో ప్రధాని ఆర్థిక సలహా మండలి వివరణ ఇచ్చుకుంది. రాజ్యాంగాన్ని మార్చాలన్నది ఆయన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పింది. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

దేవ్‌రాయ్ బాటలో హెగ్డే

సాక్షాత్తూ మోడీ నియమించిన వ్యక్తే రాజ్యాంగాన్ని మార్చాలని సూచించడం వివాదాస్పదమైంది. అది కొనసాగుతుండగానే ఈ ఏడాది మార్చి 11న కర్నాటకకు చెందిన బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే ఓ ప్రకటన చేస్తూ రాజ్యాంగాన్ని మార్చడానికే 400 సీట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. హెగ్డే సంఘ్‌కు సన్నిహితుడు. అధికారి అయిన దేవ్‌రాయ్‌తో పాటు సంఘ్ వ్యక్తి హెగ్డే కూడా రాజ్యాంగాన్ని మార్చాలని అభిప్రాయపడిన నేపథ్యంలో అందుకు బీజేపీ ఆమోదముద్ర ఉందన్న విషయం బహిర్గతమైంది. దాంతో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు హెగ్డేకు బీజేపీ టిక్కెట్ ఇవ్వలేదు. కానీ ఆయన ప్రసంగ వీడియో మాత్రం సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతోంది.

బరిలోనే సీపీఐ(ఎం)

స్వతంత్ర రాజకీయ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం

- మతోన్మాద బీజేపీ ఓటమే ప్రధాన లక్ష్యం
- భువనగిరి మినహా 16 స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు : తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బరిలో సీపీఐ(ఎం)ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గం పిలుపునిచ్చింది. స్వతంత్ర రాజకీయ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించినట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంహెచ్ భవన్‌లో టి జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. భువనగిరిలో తమ అభ్యర్థిని బరిలో నిలపడంతో పాటు.. మిగిలిన 16 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను బలపర్చాలని నిర్ణయించామని తమ్మినేని తెలిపారు. బీజేపీని ఓడించే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ఆ మేరకు భువనగిరిలో సీపీఐ(ఎం)ను, మిగిలిన స్థానాల్లో ఇండియా బ్లాక్‌లో భాగస్వామి అయిన కాంగ్రెస్‌ను గెలిపించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాపితంగా బీజేపీ మతోన్మాద శక్తుల ఓటమి కోసం పార్టీ నిర్వహిస్తున్న రాజకీయ ప్రచారం గురించి సమావేశం సమీక్షించిందని పేర్కొన్నారు. దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, బీజేపీ చేసిన అన్యాయాలను ఎండగట్టే కృషిని ఉధృతం చేయాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఈ కృషికి తోడ్పడేందుకు, పార్టీ స్వతంత్ర రాజకీయ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి మహమ్మద్ జహంగీర్‌ను గెలిపించుకోవాలని కోరారు.



డబ్బు, మందు పంచకుండా నాతో పోటీకి సిద్ధమా ?

- నా దగ్గర, మా పార్టీ దగ్గర పైసల్లేవు, పోరాడే శక్తి ఉంది : సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ 14లో

అయినా.. తీరు మారలేదు

ఈసీ నుంచి నోటీసు అందినా అవే వక్రభాష్యాలు

- మాజీ ప్రధాని మన్మోహన్ వ్యాఖ్యలను వల్లెవేస్తూ తప్పుడు అర్థాలు
- బీజేపీ అగ్రనాయకుల వ్యవహారశైలిపై వస్తున్న వ్యతిరేకత
- మోడీ 'మతపరమైన' ప్రచార మార్గంలోనే స్టార్ క్యాంపెయినర్లు
- నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, యోగి ప్రసంగాల్లో స్పష్టం

వివరాలు 3లో

గుజరాత్‌లో రూ.600 కోట్ల డ్రగ్స్ పట్టివేత

- 14 మంది పాకిస్థానీయుల అరెస్టు
- ఎన్నికలకు ముందు సరఫరా వెనుక రాజకీయ హస్తం..!



వివరాలు 13లో

గోదావరిని తరలిస్తున్న మోడీ

బీజేపీకి 200 సీట్లు కూడా వచ్చేట్టు లేవు

- కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి మోసపోయిండ్రు..
- హంగ్ వస్తే మనమే కీలకం
- బీఆర్ఎస్‌ను గెలిపించాలి.. : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

"ప్రధాని నరేంద్ర మోడీ గోదావరి జలాలను కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఇస్తాన్నంటుండు.. మన చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి నోరు మూసుకొని ఉన్నడు.. బీజేపీకి దేశవ్యాప్తంగా ఈ ఎన్నికల్లో 200 సీట్లు కూడా వచ్చేట్టు లేవు.. దేశంలో హంగ్ వస్తే మనమిక్కడ గెలిచే 14 సీట్లతో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది" అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఆదివారం హన్మకొండ చౌరస్తాలో జరిగిన బస్సుయాత్రలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ఆకాంక్షలు ...13లో

నామినేషన్ల ఉపసంహరణకు నేడే చివరి రోజు

- ఇండిపెండెంట్లను బరిలోంచి తప్పించేందుకు ప్రధాన పార్టీల యత్నాలు
- సోమవారం రాత్రి వరకు వెల్లడి కానున్న తుది జాబితా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లోక్‌సభ నామినేషన్ల ఉపసంహరణకు నేటితో గడువు ముగియనుంది. పరిశీలన అనంతరం 625 మంది అభ్యర్థులకు చెందిన 1,060 నామినేషన్ సెట్లను అనుమతించారు. మొత్తం 17 నియోజక వర్గాలకు గాను 7 స్థానాల్లో 40 మందికి పైగా పోటీలో ఉన్నారు. మెదక్‌లో అత్యధికంగా 53 మంది, ఆ తర్వాత భువనగిరి 51,పెద్దపల్లి 49, వరంగల్ 48, సికింద్రాబాద్, చేవెళ్లలో 46, ఖమ్మంలో ...13లో



చిరుత ఉన్నది..జాగ్రత్త

శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిసరాల్లో సంచారం

- అప్రమత్తమైన అధికారులు.. బోన్ల ఏర్పాటు.. నిరంతర నిఘా



నవతెలంగాణ- శంషాబాద్

అడవుల్లో సంచారించాల్సిన జంతువులు జనజీవనం మధ్యకు వచ్చేస్తున్నాయి. పచ్చటి అడవులు కాస్త కనుమరుగవుతున్నాయి. ఇప్పటి వరకు పక్క రాష్ట్రాల్లో జనావాసాల మధ్యన జంతువులు సంచరిస్తున్నాయని వినేవాళ్లం. ఇపుడు మన రాష్ట్రంలోనూ అలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాజాగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లోకి నల్ల చిరుత పులి (పాంథర్) ...13లో

విందు.. పసందు..

ఓటర్లను ఆకట్టుకుంటున్న నేతలు

- ఎన్నికలవేళ గంప గుత్తగా ఓట్లకు గాలం
- పోటాపోటీగా అభ్యర్థుల ప్రత్యేక సమావేశాలు..
- ఖరీదైన మద్యం, విందుతో రోజూ మజా
- మల్కాజిగిరిలో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రత్యేక నజర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలోనే అతి పెద్ద పార్లమెంట్ నియోజకవర్గం మల్కాజిగిరి. ఈ సెగ్మెంట్‌లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడగడం అంత ఈజీ కాదు. నామినేషన్ల ఘట్టం ముగిసి పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో ఓటర్లను మరింత త్వరగా ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఆయా పార్టీల నేతలు ప్రచారంలో ఫుల్ బిజీ అయిపోయారు. ఈసారి ఎలాగైనా విజయం సాధించాలని సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఈ నేపథ్యంలో ఓట్లు తమకు గంపగుత్తగా పడేలా చూసుకుంటున్నారు. ముఖ్య నాయకులతోపాటు ద్వితీయ శ్రేణి లీడర్లను సైతం ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు శాయశక్తులా కృషి చేస్తున్నారు. ఉదయమంతా ప్రచారం చేస్తూ.. సాయంత్రం తమ ముఖ్య అనుచరులు, నేతలను విందులతో పసందు చేస్తున్నారు. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులైన ఈటల రాజేందర్, పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తమదైన శైలిలో ప్రచార రంగంలోకి దిగారు. ఎలాగోలా ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు కుల, మత, ఉద్యోగ, కాలనీ, కార్మిక ఇలా రకరకాల సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

సంఘాలతో మమేకం..

వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు గంపగుత్తగా ఓటర్లను వలలో వేసుకునేందుకు కుల సంఘాలు, రకరకాల యూనియన్లు, కాలనీల ప్రెసిడెంట్లతో ప్రత్యేకంగా సమావేశాలు జరుపుతున్నారు. ఎమ్మార్పీఎస్, మాజీ సైనికులు, విశ్వకర్మల ఆత్మీయ సమ్మేళనం, కాలనీ అసోసియేషన్లు, సెటిలర్లు, రెడ్డి సంఘం, ...13లో

లోక్‌సభ కాగానే స్థానిక సమరం..

- ఈ వేడిని ఇలాగే కొనసాగించాలని సీఎం నిర్ణయం
- పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇప్పటికే ఆదేశాలు
- అధికారుల కసరత్తులు షురూ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికలు కాగానే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయా..? అందుకనుగుణంగా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారా..? అంటే అవుననే అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలవటం ద్వారా వచ్చిన జోష్, ప్రస్తుత లోక్‌సభ ఎలక్షన్లలో అత్యధిక సీట్లలో గెలుస్తామనే విశ్వాసం... వెరసి అధికార పార్టీ, రాబోయే ఎన్నికలన్నింటిలో ఇదే హవాను కొనసాగించాలని భావిస్తోంది. తద్వారా కార్యకర్తలు, నాయకుల్లో నూతనోత్సాహాన్ని ప్రోది చేయటంతోపాటు కాంగ్రెస్‌కు మరిన్ని జవసత్వాలు వచ్చే విధంగా పరిస్థితిని తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఎన్నికలన్నీ వరసగా అయిపోతే ఆ తర్వాత పాలనపై పట్టు సాధించవచ్చంటూ ఆయన ఇటీవల తన సన్నిహితులతో చెప్పినట్టు సమాచారం. ఆ రకంగా ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి మాదిరిగా తాను కూడా హస్తం పార్టీలో ఒక పెద్ద లీడర్‌గా నిలవాలన్నది ఆయన వ్యూహంగా కనబడుతున్నది. ఈ క్రమంలోనే పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా కాంగ్రెస్ ఆధిపత్యాన్ని కొనసాగించాలని ఆయన భావిస్తున్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికలు కాగానే లోకల్ బాడీ ఎన్నికలను నిర్వహించాలంటూ సీఎం ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో పంచాయతీ పాలకవర్గాల కాలపరిమితి గత ఫిబ్రవరి ఒకటితో ముగిసింది. గ్రామాల్లో ఇప్పుడు ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. అంటే పాలకవర్గాలు లేక ఇప్పటికే మూణ్నెల్లు గడిచిందన్నమాట. లోక్‌సభ ఎన్నికలు ముగిసి, ఫలితాలు రావాలంటే జూన్ మొదటి వారం వరకూ వేచి చూడాల్సిందే. ఆ రకంగా మరో రెండు నెలలు, మొత్తంగా ఐదు నెలలపాటు పాలకవర్గాలు లేకుండానే పంచాయతీలు కొనసాగనున్నాయి. ఎంపీటీసీలు, జడ్పీటీసీల కాలపరిమితి కూడా వచ్చే జూన్ మూడుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎంపీ ఎన్నికలైన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం చేయొద్దని సర్కారు ఆదేశించింది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం సంబంధిత కార్యాచరణను చేపట్టిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్ హయాంలో తండాలను పంచాయతీలుగా మార్చారు. వాటితోపాటు కొన్ని శివారు ప్రాంతాలను కూడా పంచాయతీలుగా ఏర్పాటు చేశారు.

ఈ నేపథ్యంలో పాత వాటితోపాటు కొత్తవాటి జాబితా, ఓటర్లు, పోలింగ్ బూత్‌ల సంఖ్య తదితరాంశాలను తాజా పరచాలంటూ ఎన్నికల సంఘం జిల్లాల అధికారులకు సూచించినట్టు సమాచారం. మరోవైపు నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కూడా త్వరలోనే ఎన్నికల జరగనుంది. ఆ స్థానంలో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన పల్లా రాజేశ్వరరెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం విదితమే. అందువల్ల అక్కడ ఉప ఎన్నిక జరగబోతున్నది. ఇటు స్థానిక సమరం, అటు ఎమ్మెల్సీ సమరం... ఈ రకంగా లోక్‌సభ ఎన్నికల తర్వాత కూడా రాష్ట్రంలో ఎలక్షన్ ఫీవర్ కొనసాగనుందన్నమాట.

కల్వకుంట్ల కాదు...అబద్ధాల కేసీఆర్

- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ఎద్దేవా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్ తన ఇంటి పేరు కల్వకుంట్ల బదులుగా అబద్దాల కేసీఆర్ అని రాసుకోవాలంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అబద్దాల ప్రొఫెసర్ కేసీఆర్ అని విమర్శించారు. ఆయన బాధ కరెంట్ గురించి కాదనీ, అధికారం కోసమని అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో కేసీఆర్ భోజనం చేసేటప్పుడు మూడు సార్లు కరెంట్ పోయిందని చెబితే ఎవరూ నమ్మబోరని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఎట్లా జీవిస్తున్నారంటూ కేసీఆర్ ఎప్పుడైనా అడిగారా? అని నిలదీశారు. ప్రతిపక్షంలోకి వచ్చాకే ప్రజలు గుర్తొచ్చారా? అని ప్రశ్నించారు.

ప్రవేశ పరీక్షకు 87.79శాతం హాజరు

- బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్షకు 87.79 శాతం విద్యార్థులు హాజరయ్యారని టీజీఆర్‌డీసీ సెట్ కన్వీనర్, తెలంగాణ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఆయా డిగ్రీ కళాశాలల్లో కోర్సుల ప్రవేశ పరీక్ష కోసం 18,989 దరఖాస్తులు రాగా పరీక్షకు 16,564 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కోర్సుల ప్రవేశ పరీక్షను 64 కేంద్రాల్లో, బీసీ గురుకుల జూనియర్ కాలేజీలో సీట్ల ప్రవేశ పరీక్షను 208 కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించినట్టు తెలిపారు. బీసీ గురుకుల జూనియర్ కాలేజీల సీట్ల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 88.02శాతం విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో సీట్ల కోసం 47,463 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 41,775 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మోడీ ప్రసంగాలు

- దేశాన్ని విధ్వంసం వైపు తీసుకెళ్తున్న బీజేపీ: ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్



నెల్లూరు : ఈ ఎన్నికల ప్రచారంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆయన మంత్రి వర్గంలోని మంత్రులు మతవిద్వేషాలను రెచ్చగొట్టేవిధంగా ప్రసంగాలు చేస్తున్నారని, దీనిని ప్రజలు క్షమించరని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు. భారతదేశం శతాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్యం ప్రస్తుతం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో 'నేటి భారతం- సవాళ్లు' అన్న అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సుకు డాక్టరు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టరు బి రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ముఖ్యవక్తగా పరకాల మాట్లాడుతూ గడిచిన పదేండ్లుగా దేశ ఆర్థిక వ్యవస్థ, మన రాజ్యాంగ విలువలు, విధ్వంసానికి గురయ్యాయని, ప్రభుత్వం, అధికార పక్షం దేశాన్ని విధ్వంసంవైపు తీసుకెళ్తున్నాయని వివరించారు. మణిపూర్ ప్రాంతంలో విధ్వంసం జరిగితే మనకేంటి అనుకోవడం సరికాదన్నారు. అక్కడ జరుగుతున్న మారణకాండ, మారణహోమం మిగిలిన రాష్ట్రాలలో జరిగేటటువంటి అతిపెద్ద ప్రమాదం దేశంలో పొంచి ఉందన్నారు. దేశంలో నిరుద్యోగం ప్రబలిపోయిందని, ధరలు అదుపులో లేవన్నారు. అధికార పార్టీకి ఓట్లు వేసి తిరిగి అధికారాన్ని కట్టబెడితే దేశం సంక్షోభంలో పడుతుందన్నారు. ప్రధాన మంత్రి బయట మాట్లాడటం కాదు.. ఆగస్టు 15న ఏకంగా ఎర్రకోట మీదకు ఎక్కి ఇటువంటి పిలుపునిచ్చే ప్రమాదం ఉందని పిలుపునిచ్చారు.

దేశానికి ఇండియా వేదికే ప్రత్యామ్నాయం

- వైసీపీ టీడీపీలతో రాష్ట్రానికి హోదా రాదు
- మోడీతో జగన్, బాబు ట్రయాంగిల్ లవ్ స్టోరీ : న్యాయ్ యాత్ర సభల్లో వైఎస్.షర్మిల విమర్శ



విశాఖ : దేశానికి బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి పనికిరాదని, ఇండియా వేదికనే సరైన ప్రత్యామ్నాయమని ఏపీసీసీ అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. మోడీతో చంద్రబాబు పొత్తు, జగన్ తొత్తు అని... వీరు ముగ్గురిదీ ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీతో చంద్రబాబు ప్రత్యక్షంగా, జగన్ పరోక్షంగా జతకట్టి వారి స్వప్రయోజనాల కోసం ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శిం చారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు, యువతకు ఉపాధి కల్పనకు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చేందుకు ఇండియా వేదికలోని కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎపి న్యాయ్ యాత్రలో భాగంగా విశాఖ జిల్లా అక్కయ్యపాలెంలోనూ, శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోనూ ఆదివారం జరిగిన బహిరంగ సభల్లో ఆమె మాట్లాడారు.జగన్ గత ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినవేవీ అమలు చేయలేదన్నారు. 42 నీటి పారుదల ప్రాజెక్టులను నవరత్నాల్లో పెట్టి ఏ ఒక్కటీ అమలు చేయలేదని వివరించారు. మద్యనిషేధం హామీని తుంగలో తొక్కారన్నారు. రాష్ట్రంలో మూడు రాజధానులని చెప్పి విశాఖలో కూడా రాజధాని పెట్టలేక పోయారని విమర్శించారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనలో చంద్రబాబు, జగన్ ఇద్దరూ విఫలమయ్యారన్నారు. గంగవరం పోర్టును ప్రభుత్వంలో కలిసేలా వైఎస్.రాజశేఖరరెడ్డి అగ్రిమెంట్ చేస్తే, ఆయన కొడుకైన జగన్... అదానీకి అమ్మేయడం దారుణమన్నారు. విశాఖ ఎంపీగా 2019లో గెలిచిన వైసీపీ వ్యక్తి భూకబ్జాలతో ఎంపీ పదవిని భ్రష్టు పట్టించారని విమర్శించారు. విశాఖ ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న సత్యారెడ్డిని గెలిపిస్తే ఇక్కడి ప్రజల తరుపున పార్లమెంట్‌లో గళం వినిపిస్తారని తెలిపారు.

మళ్లీ మోసగించడానికే...

- టీడీపీ, బీజేపీ, జనసేనపై బహిరంగ సభల్లో ఏపీ సీఎం వైఎస్ జగన్ విమర్శ



విజయవాడ : మళ్లీ ముగ్గురూ జతకట్టి ప్రజలను మోసం చేయడానికి ముందుకొస్తున్నారని చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోడీని ఉద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ప్రజలకు మంచి జరగాలంటే బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిని ఓడించాలని, వైసీపీని గెలిపించాలని కోరారు. అనంతపురం జిల్లా తాడిపత్రి, తిరుపతి జిల్లా వెంకటగిరి, నెల్లూరు జిల్లా కందుకూరులో ఆదివారం జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. రైతుల, మహిళా సంఘాల రుణాలు మాఫీ చేస్తామనే హామీతోపాటు అనేక హామీలను బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి గతంలో ఇచ్చిందన్నారు. వాటిలో ఏ ఒక్క హామీనైనా ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పుడు ఇవే పార్టీలు కూటమిగా ఏర్పడి సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ అనేక హామీలు ఇస్తూ ప్రజలను మళ్లీ మోసగించాలని చూస్తున్నాయని విమర్శించారు. తాము ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలు అమలు చేశామని,. ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను చేర్చామని వివరించారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చా మన్నారు. సంక్షేమ పథకాలతో ఈ ఐదేళ్లలో రూ.2.70 లక్షల కోట్లను నేరుగా ప్రజలకు నగదు బదిలీ రూపంలో అందజేశామని తెలిపారు. వాలంటీర్ వ్యవస్థ ఉండాలన్నా, సచివాలయ వ్యవస్థ ఉండాలన్నా వైసిపిని మరోమారు గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. అవినీతి రహితంగా పరిపాలన సాగిందని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలు దోచుకున్నాయని విమర్శించారు. చంద్రబాబు 14 ఏండ్ల పరిపాలనలో చెప్పుకోదగ్గ పథకం ఒక్కటైనా ఉందా? అని ప్రశ్నించారు.అమలుకు వీలుకాని హామీలతో చంద్రబాబు ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. చంద్రబాబుని అధికారం లోకి తీసుకురావడానికి కొన్ని శక్తులు పనిచేస్తున్నాయన్నారు. ప్రజలకు మేలు చేసేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలు ఆ శక్తులకు నచ్చడం లేదని దుయ్యబట్టారు.

కులగణన అంటే మోడీకి వణుకు

- మాజీ ఎంపీ వి హనుమంతరావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తమ పార్టీ కులగణన చేపడతామంటే ప్రధాని మోడీకి వణుకు మొదలైందని కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఏడాదికి ఒకరు ప్రధాని అవుతారంటూ ఆయన మాట్లాడం సిగ్గుచేటన్నారు. ఆదివారం హైదరాబా ద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదేండ్ల మోడీ పాలనలో అయోధ్యలో గుడికట్టడం తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతున్న బీజేపీని ఓడించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీలకు న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.


సాహస బాలుడిని అభినందించిన సీఎం రేవంత్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అగ్ని ప్రమాదంలో ఆరుగురిని కాపాడిన 15 ఏండ్ల బాలుడు సాయిచరణ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి సాయిచరణ్ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ తీసుకొచ్చారు. ఈనెల 26న హైదరాబాద్ శివారులోని ఓ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదం నుంచి ఆ బాలుడు ఆరుగురిని కాపాడారని సీఎం గుర్తు చేశారు. ఇటీవలే బాలుడు పదో తరగతి పూర్తి చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండల కేంద్రానికి చెందిన సాయిచరణ్ సాహసాన్ని ఈ సందర్భంగా సీఎం అభినందించారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న తయారీదారులు

- పలు ఔషధ ఉత్పత్తులను సీజ్ చేసిన డీసీఏ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కణితులు, పక్షవాతం, మూత్రపిండాల్లో రాళ్లను కరిగించడం, జ్వరం తగ్గించడం, కీళ్ల నొప్పులు తగ్గించడం వంటి తప్పుడు ప్రకటనలు చేస్తూ అమ్ముతున్న పలు ఔషధ ఉత్పత్తులను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్, రాజస్థాన్‌తో పాటు హైదరాబాద్‌లో ప్రయివేటు ఫార్మాస్యుటికల్స్ తయారు చేస్తున్న నాలుగు రకాల ఆయుర్వేద ఔషధాలు ఖదిర్ రిష్తా, స్టోనిల్ 24 టాబ్లెట్స్, ఎకంజ్వీర్ రాస్, సింహాడీ గుగ్గులు, ఆయుర్ ఫలా నీమ్ లీఫ్ పౌండర్, డిక్లోడస్ ఫోర్ట్ టాబ్లెట్స్‌ను ఖమ్మం, బాచుపల్లి, మెదక్ తూప్రాన్, సికింద్రాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో గుర్తించి సీజ్ చేశారు. వీటిపై విచారించి చట్టపరమైన చర్యలను తీసుకోనున్నారు.

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం, బీరంగూడలో ఒక మెడికల్ షాప్‌లో ముపిమ అయింట్‌మెంట్ (5 గ్రాములు) రూ.189 ఎంఆర్పీకి అమ్ముతున్నట్టు లేబర్ ద్వారా నిర్ధారించారు. దీనిని రూ.101.45 మించకుండా అమ్మాల్సి ఉంది. దీనిని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కీసర, మాత్రేయ్ ఫార్మాస్యూటికల్స్ మార్కెటింగ్ చేస్తున్నది. లైసెన్స్ లేకుండా ఔషధాలను నిల్వ ఉంచిన నకిలీలకు చెందిన ముడు క్లినిక్ లపై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.71,300 విలువైన ఔషధాలను సీజ్ చేశారు. మేడ్చల్ మండలం ఎల్లంపేట్ గ్రామంలో కావ్యశ్రీ క్లినిక్, వికారాబాద్ జిల్లా, మోమిన్‌పేట్ గ్రామం మార్కెట్ రోడ్‌లోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్, రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం, నందర్ ఖాన్‌పేట్ గ్రామంలో సహస్ర చౌహాన్ ఫస్ట్ సెంటర్‌లు దాడులు చేసిన వాటిలో ఉన్నాయి.

అయినా.. తీరు మారలేదు

- ఈసీ నుంచి నోటీసు అందినా అవే వక్రభాష్యాలు
- మాజీ ప్రధాని మన్మోహన్ వ్యాఖ్యలను వల్లెవేస్తూ తప్పుడు అర్థాలు
- బీజేపీ అగ్రనాయకుల వ్యవహారశైలిపై వస్తున్న వ్యతిరేకత
- మోడీ 'మతపరమైన' ప్రచార మార్గంలోనే స్టార్ క్యాంపెయినర్లు
- నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, యోగి ప్రసంగాల్లో స్పష్టం





న్యూఢిల్లీ: భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) నోటీసు అందినప్పటికీ.. బీజేపీ స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్న ఆ పార్టీ అగ్రనాయకుల తీరులో మాత్రం మార్పు రావటం లేదు. ముస్లింలకు కాంగ్రెస్ సంపదను తిరిగి పంచుతుందని ఆరోపిస్తూ ప్రధాని మోడీ బహిరంగంగా మతపరమైన వ్యాఖ్యలను చేసిన విషయం విదితమే. ఆ పార్టీ అధ్యక్షుడు జె.పి నడ్డాతో సహా బీజేపీ ఇతర స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు ప్రధాని వ్యాఖ్యలను ప్రతిధ్వనిస్తున్నారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఎక్కడా దేశంలో సంపద పునర్విభజన గురించి ప్రస్తావించలేదు. ఉద్యోగాలు, రిజర్వేషన్లు, సచార్ కమిటీ నివేదిక అమలు, ట్రిపుల్ తలాక్‌ను తిరిగి తీసుకురావటంలోనూ ముస్లింల గురించి ప్రత్యేకంగా మాట్లాడలేదు. అయితే, ఈసీఐ నుంచి నోటీసు అందినప్పటికీ.. బీజేపీ స్టార్ క్యాంపెయినర్లు తప్పుదోవ పట్టించే వాదనలను చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. "ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ల హక్కులను లాక్కొని ముస్లింలకు ఇవ్వాలవని కాంగ్రెస్ కోరుకుంటున్నది" అని మోడీ మతపరమైన వ్యాఖ్యలను ప్రతిధ్వనించేలా జె.పి నడ్డా రెండ్రోజుల క్రితం మాట్లాడారు. "ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కులను లాక్కొని ముస్లింలకు ఇవ్వటమే కాంగ్రెస్, ఇండియా కూటమి రహస్య అజెండా. దేశంలోని వనరులపై తొలి హక్కు ముస్లింలకే ఉందని కాంగ్రెస్ చెప్తున్నది. అయితే వనరులపై మొదటి హక్కు ఈ దేశంలోని పేదలదేనని ప్రధాని మోడీ అన్నారు" అని ఆయన అన్నారు.

మోడీలాగే.. నడ్డా కూడా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రసంగాన్ని తప్పుదారి పట్టించారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

రాజస్థాన్‌లోని బనస్వరాలో జరిగిన ర్యాలీలో మోడీ తొలిసారిగా వ్యాఖ్యలు చేసిన మూడు రోజుల తర్వాత ఎన్నికల సంఘం బీజేపీ, కాంగ్రెస్‌ల స్టార్‌క్యాంపెయినర్ల మోడల్ ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) ఉల్లంఘనలకు వ్యతిరేకంగా పార్టీ అధ్యక్షులు నడ్డా, మల్లికార్జున్ ఖర్గేలను ఉద్దేశించి లేఖలను పంపింది. ఆ లేఖలు ఉల్లంఘించిన వారి పేర్లను మాత్రం పేర్కొనలేదు.

ఈ నెల 21న బన్స్వారాలో.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ర్యాలీకి హాజరైన వారి తల్లులు, సోదరీమణుల సంపదను "చొరబాటుదారులు", "ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి" పంపిణీ చేస్తుందని ఒక వర్గం వారిని టార్గెట్ చేస్తూ మోడీ అన్నారు. ఆ తర్వాత జరిగిన ర్యాలీల్లోనూ ఆయన ఇలాంటి వ్యాఖ్యలే చేయటం గమనార్హం. ఈ ప్రసంగం దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు కారణమైంది. గ్లోబల్ ప్రెస్‌లో అపూర్వమైన ద్వేషపూరిత ప్రసంగంగా ఇది అభివర్ణించబడింది.

నడ్డా మాత్రమే కాదు.. అమిత్ షా, రాజ్‌నాథ్‌తో సహా బీజేపీ ఇతర స్టార్ క్యాంపెయినర్లు అప్పటి నుంచి మోడీ మతపరమైన విద్వేష వ్యాఖ్యలను ప్రతిధ్వనిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇటీవల యూపీలోని దాద్రీలో జరిగిన ర్యాలీలో రాజ్‌నాథ్ కూడా మన్మోహన్ ప్రసంగాన్ని ప్రస్తావించారని చెప్పారు. "2006లో, జాతీయ రక్షణ మండలి సమావేశంలో దేశ వనరులపై మొదటి హక్కు మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలదేనని అన్నారు. దేశ వనరులు ప్రతి ఒక్కరికీ చెందుతాయి. ప్రధాని ఈ విషయం చెప్పినప్పుడు వారు (ప్రతిపక్షాలు) హంగామా (రక్కస్) చేస్తున్నారు"అని ఆయన అన్నారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని బెమెతరలో జరిగిన ర్యాలీలో.. ముస్లిం వ్యక్తిగత చట్టాలను తీసుకు వస్తామనీ, దేశాన్ని "షరియా చట్టం" ప్రకారం నడుపుతామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్నదని అమిత్ షా ఆరోపించారు. "కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను జాగ్రత్తగా చదవండి. మళ్లీ వ్యక్తిగత చట్టాలు తీసుకువస్తామని ఆ పార్టీ చెప్పింది. ముస్లిం వ్యక్తిగత చట్టాలను తీసుకొచ్చి ఏం చేయాలనుకుంటున్నారు? షరియా చట్టం ప్రకారం ఈ దేశం నడుస్తుందా? మీరు ట్రిపుల్ తలాక్‌ను వెనక్కి తీసుకురాగలరా? కాంగ్రెస్ పార్టీ ముస్లిం లీగ్ అజెండాను తీసుకుంటున్నది. కానీ రాహుల్ బాబా మిమ్మల్ని ప్రజలు ఎన్నుకోరు. ట్రిపుల్ తలాక్‌ను వెనక్కి తీసుకురారు. సీఏఏ, ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370లను తాకలేరు" అని అమిత్ షా అన్నారు. అదే రోజు జరిగిన మరో ర్యాలీలోనూ ఆయన ఆ వాదనను మళ్లీ వినిపించటం గమనార్హం.

యూపీలోని ఇటావాలో శనివారం జరిగిన ర్యాలీలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)లు ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తాయని ఆదిత్యనాథ్ ఊహాజనిత ఆరోపణలు చేశారు. "వెనుకబడిన కులాలకు 27 శాతం రిజర్వేషన్లలో వారు ముస్లింలను చేర్చుతారు. మీరు దీన్ని అంగీకరిస్తారా? భారత్‌లో మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండవచ్చా? మత ప్రాతిపదికన రిజర్వేషన్లను అంబేద్కర్ వ్యతిరేకించారనీ, ఇప్పుడు దేశాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తున్నారు" అని యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రజలు తమకు నచ్చినవి తినకుండా ఆపకూడదని సూచించడం ద్వారా ఆవులను వధించడాన్ని సూచిస్తున్నదనీ, అది విశ్వాసాలతో ఆడుకోవటమేనని ఆయన అన్నారు. బీజేపీ నాయకుల వ్యాఖ్యలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నదనీ, ఇది ఇలాగే కొనసాగితే ఎన్నికల్లో ఆ పార్టీకే నష్టమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

రాజీనామా వెనుక..?

ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ పదవికిఅర్విందర్‌సింగ్ గుడ్‌బై



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ యూనిట్ అధ్యక్షుడు అర్విందర్‌సింగ్ లవ్లీ తన పదవికి ఆదివారం రాజీనామా చేశారు. తాను ఏ రాజకీయ పార్టీలో చేరడం లేదని తెలిపారు. తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తన రాజీనామా లేఖను పంపినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీతో భాగస్వామ్యానికి తాను వ్యతిరేకమని చెప్పారు. ముగ్గురు లోక్‌సభ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఢిల్లీ కాంగ్రెస్ కమిటీ అభిప్రాయాలను పార్టీ హైకమాండ్ తిరస్కరించి, ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను కాంగ్రెస్ ఈశాన్య ఢిల్లీ అభ్యర్థి కన్హయ్య కుమార్ బహిరంగంగా ప్రశంసించడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ఢిల్లీ యూనిట్ అధ్యక్షుడిగా లవ్లీ 2023 ఆగస్టు నుంచి బాధ్యతల్లో ఉన్నారు.

అయితే దీని వెనుక కమలం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.





సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించండి

- ప్రజా సమస్యలు గాలికొదిలేసిన మోడీ, మమత సర్కార్లు : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్

కోల్‌కతా: సీపీఐ(ఎం) అభ్యర్థి సుజన్ చక్రవర్తిని గెలిపించాలని కోరుతూ.. ఆదివారం రోడ్ షో నిర్వహించారు. పార్టీ పతాకాలు పట్టుకుని ప్రదర్శన చేశారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ అగ్రభాగాన నిలిచి.. పార్టీ శ్రేణులను ఉత్తేజపర్చారు. సీపీఐ(ఎం)తరపున బరిలో నిలిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

మోడీ, మమతా సర్కార్లు ప్రజాసమస్యలను గాలికొదిలేశాయని కరత్ ఆరోపించారు. ప్రజల పక్షాన నిలిచే వారికే ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు.

అమేథీలో నామినేషన్ దాఖలు చేసిన స్మృతి ఇరానీ

లక్నో : కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఉత్తరప్రదేశ్ అమేథీ లోక్‌సభ స్థానానికి ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసేముందు ఆమె అయోధ్యలోని రామ్‌లల్లాను దర్శించుకున్నారు. ఆ తర్వాత నియోజకవర్గానికి వెళ్లి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అమేథీలో మే 20వ తేదీన ఐదో దశలో ఓటింగ్ జరగనుంది. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం నాడు (ఏప్రిల్ 26) ప్రారంభమైంది. మే 3 నామినేషన్‌లకు చివరి తేది. ఇదిలా ఉండగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఇప్పటివరకు అమేథీలో పోటీ చేసేందుకు అభ్యర్థిని ప్రకటించలేదు. అమేథీ నియోజకవర్గం కాంగ్రెస్‌కి కంచుకోటగా ఉండేది. కానీ 2019లో అమేథీ స్థానంలో పోటీ చేసిన రాహుల్ గాంధీని స్మృతి ఇరానీ ఓడించారు. ఈ ఎన్నికల్లో ఇక్కడ గెలవాలని గట్టిగా ప్రయత్నిస్తోంది. మళ్లీ ఇక్కడి నుంచి రాహుల్‌నే బరిలో నిలిపేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ రాయబరేలి స్థానానికి కూడా ఇప్పటివరకూ అభ్యర్థిని ప్రకటించలేదు.

మణిపూర్‌లో మరోసారి రీపోలింగ్

ఇంఫాల్ : మణిపూర్‌లో మరోసారి రీపోలింగ్ జరగనుంది. ఔటర్ మణిపూర్ పార్లమెంట్ నియోజక వర్గంలోని ఆరు పోలింగ్ స్టేషన్లలో ఈ నెల 30వ తేదీన రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. రెండో విడతలో భాగంగా ఈ నెల 26న జరిగిన పోలింగ్ సందర్భంగా ఈ ఆరు పోలింగ్ కేంద్రాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఉఖ్రుల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని నాలుగు పోలింగ్ స్టేషన్‌లు, ఉఖ్రుల్‌లోని చింగై అసెంబ్లీ సీటు, సేనాపతిలోని కరోంగ్‌లలో ఒక్కో స్థానంలో ఏప్రిల్ 30న రీపోలింగ్ నిర్వహిస్తా మని, రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ ఝా తెలిపారు. కాగా మొదటి విడత ఎన్నికల్లో ఇన్నర్ మణిపూర్ లోకసభ పోలింగ్‌లో కూడా రీపోలింగ్ జరిగింది. ఎన్నికల సంద ర్భంగా కాల్పులు, పోలింగ్ కేంద్రాలపై దాడులు జరగడంతో 11 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 22న రీపోలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

భారత్‌ని వీడిన దేవెగౌడ మనవడు

బెంగళూరు : భారత మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నికల సమయాన దేశం విడిచి పారిపోయారు. ఇప్పుడు కర్నాటకలో ఈ అంశమే హాట్ టాపిక్‌గా మారింది. గతంలో దేవెగౌడ పలు మార్లు గెలిచిన, కంచుకోట అయిన హసన్ లోక్‌సభ స్థానం నుంచి రేవణ్ణ ఈ సారి పోటీకి దిగారు. అయితే ఇటీవల ఆయనపై అసభ్యకర వీడియోలు ప్రచారంలో కొచ్చాయి. దీంతో ఈ వీడియోలపై కర్నాటక సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వం దర్యాప్తు కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ని (సిట్) ఏర్పాటు చేయనున్నట్లు శనివారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రేవణ్ణ ఆదివారం ఉదయం బెంగళూరు నుంచి జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు బయల్దేరి వెళ్లడం గమనార్హం.

"జైల్ కా జవాబ్ ఓట్‌సే" పాటకు బ్రేక్

ఆప్ 'ప్రచారం' పై ఈసీ నిషేధం

- ఆ నిర్ణయాన్ని తప్పుపట్టిన మంత్రి అతిషి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం "జైల్ కా జవాబ్ ఓట్ సే" అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ రూపొందించిన పాటను కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) నిషేధించింది. ఈ నిర్ణయాన్ని ఆప్ తప్పుపట్టింది. ఎన్నికల సంఘం ఆశ్రితపక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించింది. "ప్రతిపక్ష నేతలపై దాడులకు ఈడీ, సీబీఐలను బీజేపీ ఉపయోగించుకుంటే వాళ్లను ఈసీ నివారించలేదు. తప్పుడు అరెస్టులు చోటుచేసుకున్నాయంటూ ప్రచారంలో ఎవరైనా మాట్లాడితే మాత్రం ఎన్నికల సంఘం దానిని ఒక సమస్యగా చూస్తోంది. నియంతృత్వ ప్రభుత్వం లక్ష్యమిది" అని ఆప్ నేత అతిషి విమర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మద్దతుగా 'వాక్ ఫర్ కేజ్రీవాల్' పేరుతో పాదయాత్రతో ఆప్ ప్రచారం నిర్వహించింది. ఢిల్లీలోని సీఆర్ పార్క్ నుంచి ఈ పాదయాత్ర సాగింది. 'జైల్ కా జవాబ్ ఓట్ సే' అనే నినాదాలతో కేజ్రీవాల్ ఫోటో, పార్టీ జెండాలతో ఆప్ మద్దతుదారులు ఇందులో పాల్గొన్నారు. ఆప్ మంత్రులు అతిషి, సౌరభ్ భరద్వాజ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కార్పొరేట్ దోపిడీ



- అంతా ప్రయివేటు పరం
- దేశాన్నే వేలం వేస్తున్న మోడీ ప్రభుత్వం
- అనేక రెట్లు పెరిగిన అదానీ, అంబానీ ఆస్తులు
- కార్పొరేట్ కంపెనీలకే రుణమాఫీలు, పన్ను మినహాయింపులు

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ హయాంలో బడా కార్పొరేట్ సంస్థలు దేశాన్ని నిలువునా దోచేస్తున్నాయి. బీజేపీ ప్రభుత్వం ఆ సంస్థలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తూ, రాయితీలు కల్పిస్తూ, రుణాలు మాఫీ చేస్తూ కంటికి రెప్పలా కాపాడుతోంది. మోడీ ప్రాపకం కలిగిన అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు ప్రపంచ సంపన్నుల జాబితాలో చేరిపోయారు. దేశంలో కార్పొరేట్ సంస్థల సామ్రాజ్యం విస్తరిస్తుండడంతో వేలాది చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కుదేలైపోయాయి. పోటీని తట్టుకోలేక దుకాణాలు బంద్ చేశాయి.

ఆస్తులు పెంచుకున్న అదానీ, అంబానీ

మోడీ పాలనలో సామాన్య ప్రజల జీవితాలు దుర్భరమయ్యాయి. అదే సమయంలో పెట్టుబడిదారుల ఆదాయం, ఆస్తులు, సంపద ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. దేశంలో అత్యంత సంపన్నులైన వారి సంఖ్య 56 నుంచి ఏకంగా 169కి పెరిగింది. మోడీ సన్నిహితులైన అంబానీ, అదానీలు దేశంలోని అత్యంత సంపన్నుల జాబితాలో మొదటి రెండు స్థానాలలో చేరిపోయాయి. 2013లో అదానీ ఆస్తుల విలువ రూ.25,792 కోట్లు. 2022 నాటికి అది రూ.7,48,800 కోట్లకు చేరింది. అలాగే 2014లో అంబానీ ఆస్తుల విలువ రూ.1,54,742 కోట్లు. 2022 నాటికి ఆ విలువ రూ.7,54,620 కోట్లకు చేరుకుంది. అంటే దీనర్థం ఆస్తుల విలువ ఈ కాలంలో ఐదు రెట్లు పెరిగిందన్న మాట.

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీతో కార్పొరేట్ల ఒప్పందం

కార్పొరేట్ కంపెనీలు మోడీ ప్రభుత్వాన్ని స్పాన్సర్ చేస్తున్నాయి. అందుకే వాటి ఆస్తుల విలువ అనేక రెట్లు పెరిగింది. వాజ్‌పేయి, అద్వానీలను ప్రధాని మోడీ పక్కన పెట్టి, తన ప్రాభవాన్ని పెంచుకుంటున్న సమయంలోనే అంబానీ పెట్టుబడులు పెరగడం ప్రారంభమైంది. కార్పొరేట్ కంపెనీలు, ఆర్‌ఎస్‌ఎస్ మధ్య ఒప్పందం కుదర్చడంలో మధ్యవర్తిత్వం నెరపిన వారిలో అదానీ ఒకరు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కార్పొరేట్ కంపెనీలకు అపరిమితమైన, ఆంక్షలు లేని స్వేచ్ఛ ఇచ్చారు. అందుకే ఆ కంపెనీలు ఆయనకు బాసటగా నిలిచాయి. జాతి మీద, దాని వనరుల మీద ఆధిపత్యం చెలాయించాలంటే కంపెనీలకు ముందుగా ప్రభుత్వంపై పెత్తనం అవసరం. మోడీని ప్రధానిని చేస్తే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు మద్దతు ఇస్తామని అవి హామీ ఇచ్చాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి, అపరిమిత అధికారాన్ని చెలాయించడానికి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలకు కార్పొరేట్ కంపెనీల సాయం అవసరమైంది. ఆ దిశగా ఓ ఒప్పందం కుదిరింది. ఈ అవకాశవాద ఒప్పందానికి మోడీ ప్రభుత్వం ఓ శాఖగా మారింది.

కాదేదీ ప్రయివేటుకు అనర్హం

మోడీ అధికారంలోకి రాగానే ప్రభుత్వం చేతిలో ఉన్న సర్కారు ఆస్తులన్నింటినీ ప్రయివేటీకరించారు. వాటిని నామమాత్రపు ధరకు ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టారు. లాభాలు ఆర్జిస్తున్న హెచ్‌పీసీఎల్, నార్త్ ఈస్ట్ ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్, తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, కామరాజర్ పోర్ట్, ఎయిర్ ఇండియా తదితర వందలాది కంపెనీలను ప్రయివేటీకరణ పేరిట ప్రయివేటు సంస్థలకు ధారాదత్తం చేశారు. ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్‌ను నాశనం చేసి అంబానీకి చెందిన జియో ఫోన్ కంపెనీకి అవాంఛనీయమైన ప్రయోజనాలు కల్పించారు. చివరికి విమానాశ్రయాలు, రైల్వేలు, రైల్వే లైన్లను సైతం ప్రయివేటీకరించి అమ్మేశారు. ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం కలిగించడానికి, కొందరు కార్పొరేట్ దిగ్గజాలకు లాభాలు ఆర్జించి పెట్టడానికి మోడీ సర్కారు ఇలాంటి చర్యలకు పూనుకుంది తప్ప మరోటి కాదు.

వహ్వా... ఏమి చెబితిరి!

'నేను ఫకీరును. రైల్వే ప్లాట్‌ఫారాలపై టీ అమ్మాను'... ఇది ప్రధాని తరచుగా చెప్పే మాట. ప్రతి వ్యక్తికీ సంతృప్తికరమైన జీవనాన్ని అందించడమే తన ఏకైక లక్ష్యమని ఆయన చెబుతుంటారు. 'సబ్ కా సాత్...సబ్ కా వికాస్' అనేది ఆయన నినాదం.

అమ్మకాలు... ప్రతిఫలంగా ముడుపులు

జాతీయ రహదారులను అభివృద్ధి చేశానని మోడీ ప్రభుత్వం చెప్పుకుంటోంది. అయితే ఇందులో వాస్తవమేమిటి? ఎనిమిది లక్షల కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన 26,700 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల అభివృద్ధి పనులను అదానీ, అంబానీలకు కట్టబెట్టారు. మోడీ హయాంలో 400 రైల్వే స్టేషన్లు, కొంకణ్ రైల్వేలో 741 కిలోమీటర్ల పనులు, 265 రైల్వే గూడ్స్ షెడ్లు, 90 ప్యాసింజర్ రైళ్లు, 25 ప్రధాన విమానాశ్రయాలతో పాటు ఎన్టీపీసీ, ఎన్‌హెచ్‌పీసీ, ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, గ్యాస్ పైప్‌లైన్ అథారిటీ వంటి సంస్థల ఆస్తులు, ఓడరేవులు, ఎఫ్‌సీఐ గిడ్డంగుల్లో 39%, 160 రాతి క్వారీలు, గనులు, 2.86 లక్షల ఓఎఫ్‌సీ కేబుల్స్...ఇవన్నీ ప్రయివేటీకరించి ప్రయివేటు సంస్థలు లేదా కార్పొరేట్ కంపెనీలకు అమ్మేశారు. ప్రతిఫలంగా ఎన్నికల బాండ్ల రూపంలో ముడుపులు దండుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే దేశాన్నే వేలం వేసేశారు.

5

అటవీ భూములనూ వదలలేదు

పేదలకు లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాల్సిన మోడీ సర్కారు దానిని కార్పొరేట్ కంపెనీలకు కేటాయించింది. అభివృద్ధి పేరిట లక్షలాది ఎకరాల భూమిని బలవంతంగా ప్రజల నుంచి సేకరించి ఆ కంపెనీలకు అప్పగించింది. అడవులనే నమ్ముకొని జీవిస్తున్న గిరిపుత్రులను అక్కడే ఖైదీలుగా మార్చేసింది. అటవీ చట్టాలను సవరించి, వారి నివాస ప్రాంతాల చుట్టూ ఫెన్సింగ్ వేసి దిగ్బంధం చేసింది. పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని, పరిశోధనలు చేపడతామని, అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తామని చెప్పి గిరిజనులను ఆయా ప్రాంతాల నుంచి తరిమేసి, కంపెనీలకు అటవీ భూములను ధారాదత్తం చేసింది ఈ మోడీ ప్రభుత్వం.

బడ్జెట్‌నే మించిన పన్ను మాఫీలు, మినహాయింపులు

గత పది సంవత్సరాల కాలంలో పెట్రోల్, డీజిల్‌పై విధించిన సెస్సును పెంచడం, జీఎస్టీ విధించడం వంటి చర్యల కారణంగా ప్రజలపై భారం ఎక్కువైంది. అదే సమయంలో కొందరు కోటీశ్వరులకు 55 లక్షల కోట్ల రూపాయల విలువైన పన్ను మినహాయింపులు లభించాయి. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలపై పన్నులను 33% నుండి 25%కి తగ్గించింది. పాత కంపెనీలు కొత్త పేర్లతో వేర్వేరు రంగాలకు విస్తరించాయి. నూతన కంపెనీలను ప్రోత్సహించే పేరుతో ప్రభుత్వం వీటిపై పన్నును 15%కి తగ్గించింది. ప్రపంచంలో ఏ కంపెనీ ఇంత తక్కువ పన్నులు చెల్లిస్తున్న దాఖలాలు లేవు. గత పది సంవత్సరాల్లో కార్పొరేట్ కంపెనీల కోసం రద్దు చేసిన పన్నులు, ఇచ్చిన మినహాయింపులు దేశ వార్షిక బడ్జెట్‌నే మించిపోయాయి. అంటే మోడీ ప్రభుత్వం ఈ కంపెనీలకు ఓ స్వర్గధామంగా మారింది. అదే సమయంలో సామాన్యులకు నరకం చూపిస్తోంది.

కార్పొరేట్ కంపెనీలకూ రుణమాఫీలు


చాలా మంది ఏమనుకుంటారంటే సంపన్నులు తమ వద్ద ఉన్న ధనాన్ని బ్యాంకుల్లో దాచుకుంటారని, ఆ డబ్బును అవి పేదలకు రుణంగా ఇస్తాయని. వాస్తవానికి బ్యాంకుల్లో డబ్బు డిపాజిట్ చేసేది సాధారణ ప్రజలే. ఇందులో చాలా వరకూ సొమ్మును కంపెనీలకు రుణంగా ఇస్తున్నారు. అయితే ఈ కంపెనీలు రుణాలు చెల్లించకుండా ఎగవేస్తున్న ఘటనలు ఇటీవలి కాలంలో పెరిగిపోయాయి. రుణాలు తిరిగి చెల్లించని కంపెనీల ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి బదులు ప్రభుత్వం రూ.30 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసేసింది.

ఇది కార్పొరేట్ల ప్రభుత్వమే

మోడీకి అదానీ బినామీ అంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ రాష్ట్ర శాసనసభలోనే చెప్పారు. అదానీకి ఉన్నదంతా వాస్తవానికి మోడీదేనని తెలిపారు. అపారమైన ప్రభుత్వ సంపదను అదానీ కంపెనీకి ఎలా బదిలీ చేసింది, విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడల్లా అదానీ కంపెనీకి అన్ని ప్రయోజనాలు అందించాలంటూ మోడీపై ఎలా ఒత్తిడి తెస్తున్నదీ ఆయన వివరించారు. మోడీది కార్పొరేట్ల యొక్క, కార్పొరేట్ల చేత, కార్పొరేట్ల కొరకు నడపబడుతున్న ప్రభుత్వం అన్న కఠోర వాస్తవాన్ని మనం అర్థం చేసుకోవాలి. ప్రజల సంపదను దోచుకునేందుకు, రైతులను అణచివేసేందుకు, కార్మిక శక్తిని పిండుకునేందుకు, పోటీకి అవకాశమే లేకుండా అన్ని రంగాల్లో వ్యాపారంపై గుత్తాధిపత్యం చెలాయించేందుకు ఈ ప్రభుత్వం వ్యాపార కార్పొరేషన్లకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. కొన్ని ఎంపిక చేసిన కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వం మధ్య సంబంధం ఉంది. ఈ ప్రభుత్వం సంపన్నులైన గుజరాత్ మార్వాడీలది.

ఇప్పటికైనా కండ్లు తెరవండి. మేము ఇద్దరం... మాతో ఇద్దరు. ఇద్దరు సంపన్నులైన మార్వాడీలు మరో ఇద్దరితో కలిసి దేశంలో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. వారి ఖజానాలను నింపుకుంటున్నారు. ఈ గొప్ప విలన్లు, ద్రోహులు, వారి తాబేదార్ల వలలో పడి దేశం విలవిలలాడుతోంది.

గిరిజన సంచార తెగలు జాతిపరంగాను, భాషాపరంగాను, సంస్కృతి సాంప్రదాయాలపరంగాను అందరికీ భిన్నంగా వుంటూనే ఆధునిక సమాజంలోని ప్రధాన స్రవంతిలో కలిసిపోయి జీవితాన్ని గడుపుతున్నారు. బంజారాల జీవన శైలి వేరు, ఆహార్యం వేరు, సాంప్రదాయాలు వేరు. వారి ఈ ప్రయాణంలో అనేక అవరోధాలు, కష్టాలు, కన్నీళ్లు వున్నాయి. నాగరికత అనుకునే సమాజంలో గిరిజనుల శ్రమ దోపిడి ఒక వైపైతే గిరిజన మహిళలపై లైంగిక పీడన మరో వైపు ఇంకా కనపడుతూనే వుంది. అలా గిరిజన తెగలకు చెందిన గోర్ బంజారా జీవితాలలోని పలు పార్శ్వాలను కథల ద్వారా వెలుగులోకి తెచ్చిన ఒక చైతన్యవంతమైన ప్రయత్నం 'కేసులా'.



గోర్ బంజారాల జీవితాలకు దర్వణం

'కేసులా' శీర్షికతో, 'గోర్ బంజారా' ఉపశీర్షికతో కథల సంపుటిని ప్రొ॥సూర్యా ధనంజయ్, రమేష్ కార్తీక్ నాయక్ సంపాదకత్వంలో తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురించింది. ప్రధాన సంపాదకుడిగా జూలూరు గౌరీశంకర్ వ్యవహరించారు. సాధారణంగా మనం పిలుచుకునే మోదుగు పూలను గిరిజన భాషలో 'కేసులా'గా వ్యవహరిస్తారు. 'కేసులా' గిరిజన సంస్కృతికి, శ్రమ శక్తికి, శ్రమ సౌందర్యానికి ప్రతీక. వీరు అడవి తల్లితో మమేకమవుతారు, ప్రకృతితో కలిసిపోతారు. సాధారణంగా కొండ గుట్టలు, అడవి ప్రాంతాలలో జీవనం సాగించే వీరు మైదాన ప్రాంతాలలో కూడా ఉంటూ చిన్నపాటి వ్యవసాయపు పనులు చూసుకుంటారు. 'గోర్ మాటి' పదబంధం లోని 'గోర్' పదం బంజారా సముదాయంలోని 'స్వంత తెగకు చెందిన వ్యక్తుల'ను ఉద్దేశించినది. అనగా ఆ సముదాయానికి చెందిన వారేనని అర్థం. బంజారా సముదాయానికి చెందని బయటి వ్యక్తులను 'కోర్' అని సంబోధిస్తారు. 'కేసులా' శీర్షికతో వచ్చిన సూర్యాధనంజయ్ కథలో హరిసింగ్ చదువుకున్నవాడు, నిరుద్యోగి కావడంతో తాగుడుకు బానిసై భార్యను హింసించడం, చివరికి తాగుడు వల్ల చనిపోతాడు. ఫలితంగా భార్య సోని ఒంటరిదవుతుంది. కష్టకాలంలో మోదుగు చెట్టులా నిబ్బరంగా ఉండాలి అని చనిపోయిన భర్త చెప్పినట్లు ఆమెకు భ్రమ కలుగుతుంది. ఈ కథలో స్త్రీని (సోని) మోదుగు చెట్టుతో పోల్చి చూపే ప్రయత్నం చేస్తుంది రచయిత్రి. సోని పరిస్థితికి కారణం ఉద్యోగాలు కల్పించలేని ప్రభుత్వానిదా? మరో మార్గంలో కష్టించి జీవనోపాధిని చూసుకోలేక తాగుడుకు బానిసై బతుకును నాశనం చేసుకున్న హరిసింగ్ బలహీనతా? కానీ, ఆ స్త్రీ కష్టాలకు కారణం ఎవరా? అని ఆలోచించాల్సిన అవసరం పాఠకులకు కలుగచేస్తుంది. దేవేంద్ర కథ 'పిడుగు' అనే గిరిజన మహిళపై కిష్టయ్య పటేల్ కన్నుపడటం, తన ద్వారా లైంగికంగా కలిసి సంతానాన్ని కనివ్వమని అడగటం, సమయం చూసుకొని మేఘి భర్త భూక్యాని అంగడికి పంపించి ఒంటరిగా వున్న మేఘిని తన గుడిసెలోకి రప్పించుకోవడం, బయట వాన, లోపల అలజడి, అనుకోకుండానే కిష్టయ్య మీద పిడుగు పడి చనిపోవడం, నిస్సహాయురాలై వున్న తనను ప్రకృతియే కాపాడిందని మేఘి భావించడంతో కథ ముగుస్తుంది. ముగింపు కాస్త సినిమాటిక్‌గా ఉందన్న భావన పాఠకుడికి కలగవచ్చు. తండా ప్రజల ఎదురుదాడి లేదా మరో విధంగానైనా వ్యక్తుల ప్రమేయంతో కిష్టయ్య లాంటి వారికి బుద్ధి చెప్పినట్లు చూపిస్తే బాగుండేది. సుజాత రచన 'మౌనం ఖరీదు' కథలో కావేరి పాత్ర గుండెను నులిమేస్తుంది. అన్యాయం జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండటం వలన ఎంత నష్టం జరుగుతుందో, పంచాయతీలలో మధ్య పెద్ద మనుషుల్లా వ్యవహరించే వారి ద్వారా జరిగే అన్యాయం ఎలాంటిదో ఈ కథలో మనం చూడవచ్చు. సిల్మా నాయక్ కథ 'అడ్డ కూలీలు'. ఇందులో మేఘ్లి పాత్ర, మౌనాన్ని దాటి మేస్త్రీ వల్ల పొంచివున్న ప్రమాదాన్ని పసిగట్టి ముందు జాగ్రత్తలు తీసుకొని ఒక 'ఖచ్చితమైన వైఖరి' (positive attitude) ని ప్రదర్శించి మోసానికి గురికాకుండా బయట పడుతుంది. కానీ మేఘ్లి తల్లి కేస్లే, మేస్త్రీకి లొంగిపోయి చివరికి మోసానికి గురై ముంబాయి రెడ్‌లైట్ ఏరియాలో AIDS రోగంతో మృత్యువాత పడుతుంది. జ్వలిత కథ 'సంకల్పం'. ఊర్ల పంచాయతీ పనుల కోసమో మరో పనికోసమో వచ్చే పెద్ద మనుషులకు, అధికార్లకు వంట చేసిపెట్టే జానమ్మకు ఆ ఊరి మోతుబరి లచ్చునాయక్ చేసే రంకాటలు అన్నీ తెలుసు. ఊరి పరిస్థితులు, మహిళలు లైంగికంగా పీడించబడటం, బంజారాల్లోని అపరిశుభ్రత అలవాట్లు అన్నీ తెలిసినా ఏమీ చేయలేని నిస్సహాయత జానమ్మది. ఇలా పల్లె పరిస్థితులను, సంచార జాతుల జీవనశైలిని, బంజారా మహిళలు ఏ విధంగా లైంగికంగా ఊరి మోతుబరి, సర్పంచ్‌ల చేతుల్లో పీడించబడుతారన్న విషయాలను కథలో చిత్రీకరించే ప్రయత్నం చేస్తుంది కథకురాలు. తన చిన్ననాటి స్నేహితురాలు ధ్వాళి బాగా చదువుకొని కలెక్టర్ కావడం, మరుగుదొడ్లు కట్టించడం అన్నీ తెలుసుకొని మురిసిపోతుంది జానమ్మ. ఇది ప్రభుత్వం అమలు చేసే స్వచ్ఛభారత్ లాంటి కార్యక్రమాలను గుర్తుకు తెస్తుంది. బంజారా జాతికి చెందిన ధ్వాళి, వారి జాతి మనుషులు మరుగుదొడ్లనే కాదు నీళ్లను కూడా వాడక ఆకులు వాడటం జానమ్మకు వింతగా తోస్తుంది. సంచారజాతుల అలవాట్లు తెలుసుకొని ఆశ్చర్య పోతుంది. ఈ కథ పరిశుభ్రత గురించి, ప్రభుత్వ లక్ష్యాలను, ఉన్నతాధికారుల బాధ్యతల విషయాలపై ఎరుకను కలుగజేస్తుంది. రమేష్ కార్తీక్ నాయక్ కథ 'దావ్లో,' బంజారాల్లో పెళ్ళితంతు కార్యక్రమానికి సంబంధించిన కథా వస్తువుతో నడుస్తుంది. కథ చాలావరకు బంజారా భాషలో ఉంటూ వారి పద్ధతులు, సాంప్రదాయాలు కొంత వరకైనా కథ ద్వారా పాఠకులకు అందజేయాలనే తపన కథకుడిలో కనిపిస్తుంది. కథ శీర్షిక 'దావ్లో' పెళ్లి వీడ్కోలు సమయంలో పాడే పాట/ విలాప గీతం కావచ్చు. దుఃఖ స్వరంతో పాడుకుంటారు. మంగ్లీ వివాహ సందర్భంలోని దృశ్యం ఈ కథా వస్తువు. బంజారా మహిళల ప్రత్యేక దుస్తులు, నగలు బంజారా భాషలో ప్రత్యేకమైన పేర్లతో ఉంటాయి. పెళ్ళైన స్త్రీల ఆభరణాలు వేరుగా ఉంటాయి. ఇవన్నీ ఈ కథలో చూడవచ్చు. బండారు విజయ 'జుమ్రీ' కథలో బంజారాల్లో మగపిల్లాడు పుట్టే వరకు స్త్రీ కనాల్సిందేనన్న పంతం పెద్దలకుంటుందని, అలా జరగకపోతే మారు మనువుకు కూడా వెనకాడరన్న సంగతి తెలుస్తుంది. రాందాసుకు నలుగురు ఆడపిల్లలు. దాంతో సమస్య తలెత్తుతుంది. కానీ రాందాసు ధైర్యంగా తాను ఎవరి దగ్గర పనిచేస్తున్నాడో వారి సలహా, సహాయం తీసుకుంటాడు. దానికి విధిత తమ దగ్గర డ్రైవర్‌గా పని చేసే రాందాసు పిల్లలను చేరదీస్తుంది. రాందాసు కూతురు జుమ్రీతో మరో సమస్య రావడం, విదిత ఆ సమస్యనెలా పరిష్కరిస్తుందన్నది ఈ కథలోని సారాంశం. 55 కథల సమాహారంగా వచ్చిన ఈ కథా సంపుటిలో లబ్ద ప్రతిష్టులైన రచయిత్రులు, రచయితలతో బాటు వర్ధమాన రచయిత్రులు, రచయితలూ వున్నారు. బంజార తెగకు చెందిన కథకులు, బంజారేతర కథకులు వున్నారు. అందరి కథలు సహజత్వానికి దగ్గరగా ఉండటం 'కేసులా' కథల విశేషం. గిరిజన జీవితాల గురించి, వారి జీవన శైలి, భాష, సాంప్రదాయలపై అవగాహన రావాలంటే ఈ పుస్తకం చదవాల్సిందే. ఇలాంటి మంచి కథల సంపుటిని వెలుగులోకి తెచ్చిన తెలంగాణ సాహిత్య అకాడమి కృషి, సంపాదకుల శ్రమ ప్రశంసించదగినది.

> పల్లె పరిస్థితులను, సంచార జాతుల జీవనశైలిని, బంజారా మహిళలు ఏ విధంగా లైంగికంగా ఊరి మోతుబరి, సర్పంచ్‌ల చేతుల్లో పీడించబడుతారన్న విషయాలను కథలో చిత్రీకరించే ప్రయత్నం ఈ కథలో వుంది. ఈ కథా సంపుటిలో లబ్ద ప్రతిష్టులైన రచయిత్రులు, రచయితలతో బాటు వర్ధమాన రచయిత్రులు, రచయితలూ వున్నారు. బంజార తెగకు చెందిన కథకులు, బంజారేతర కథకులు వున్నారు. అందరి కథలు సహజత్వానికి దగ్గరగా ఉండటం 'కేసులా' కథల విశేషం. గిరిజన జీవితాల గురించి, వారి జీవన శైలి, భాష, సాంప్రదాయలపై అవగాహన రావాలంటే ఈ పుస్తకం చదవాల్సిందే.




- డా॥ రూప్ కుమార్ డబ్బీకార్,
99088 40196

ఎవరు దోషి?

అతను నిర్దోషి అని నాకే కాదు నీకూ తెలుసు
నీది కేవలం ఉన్మాదం కాదని
నీకే కాదు నాకూ తెలుసు
నీ మాయల మాంత్రిక
డిజిటల్ భూతపు నోట్ల కత్తిరింపులైనా
మేము బీళ్ళు దున్నుతున్నప్పుడు
నువ్వు నాగళ్ళ మొనలు విరవడమైనా
తలాపున మొలిచిన హత్రాస్ గుడిలో
పదేండ్ల పసిపాప గర్భాల్ని చీల్చడమైనా
అసహాయుల గుండెల మీద
నీ బుల్‌డోజర్ విషనాగుల విధ్వంస నృత్యమైనా
ఎదుట కనిపించే దృశ్యం ఒక్కటే నిజం కాదని
కనిపించని యవనికల మాటున దాచిన
కుట్రల కత్తులు వేరొకటని
నాకు తెలుసనే విషయం నీకు తెలవడం లేదు...
ఈ మట్టి బిడ్డలను మా నేలనుంచి పరాయీకరించే
నీ 'కా' (CAA)వు కావు అరుపులు
కేవలం కాషాయీకరణ మాత్రమే కాదనీ
కాశ్మీర్ ను విడగొట్టి పడగొట్టే నీ పెట్టుబడి కుట్ర
గోముఖ వ్యాఘ్ర శ్యాముని అర్జీకి
నువ్వు సమర్పించే వాగ్దాన సంరంభ
ప్రసాదం మాత్రమే కాదనీ
రామరాజ్య ప్రేలాపనలో
రామ్ లల్లా ప్రతిష్ఠాపనలో
మూర్తీభవించిన మతవాద మూఢత్వం మాత్రమే కాదనీ
నాకు తెలుసనే విషయం నీకు తెలవడం లేదు
ఈ పది హేమంతాల ఉన్మాదపు మండే ఎండలకు
హిందూ సంద్రపు హృదయంలో మానవత ఆవిరయ్యింది
నీ దేవుడి సాక్షిగా చీల్చబడ్డ కతువా మానాల గాయాలకు
భీతిల్లిన వృక్షాలు పుష్పవతులవ్వడం మానేసినయి
నీ రాకాసి మూకల దాడులకు గుండె పగిలిన
నా లక్షల హెక్టార్ల ఛాతీ మీది పర్వతశ్రేణులు
వుట్టి రాతి కుప్పలైనవి
అమృత్ భారత్, అచ్చేదిన్, సబ్ కా సాత్, సబ్ కా వికాస్
మేడిపండు విప్పినందుకు
మా విజ్ఞులు కల్బుర్గిలైనరు, గౌరీ లంకేష్ లైనరు
డాక్టర్ కఫీల్ ఖాన్ లైనరు...
అయినా, మా సమూహ గానం ఆగదు
మా సామాజిక చేతన ఆగదు
ఎప్పటికైనా నాటకానికి తెరపడుతుంది
నీ ఏకపాత్రాభినయం ముగుస్తుంది

- డా॥ కాసుల లింగారెడ్డి

వృద్ధుడు



అర్ధరాత్రి
టేబుల్ ల్యాంప్ వెలుగులో
చదువుకుంటున్న వద్దుడితో
ఓ యువతి అంది
"తాతయ్యా! నీ ఆరోగ్యం
సున్నితమయింది
నీ కంటి చూపు మందగించింది
ఇప్పటికే అర్ధరాత్రి అయింది నువిక పడుకోవాలి"
వృద్ధుడు తాను చదువుతున్న పుస్తకాన్ని మూసేసి
ఫ్రేం లేని కళ్ళద్దాల్ని తీసేసి నవ్వుతూ అన్నాడు
"ఓ పక్క తనను చంపడానికి
విషం తయారవుతూ వుంటే
సోక్రటీసు ఏమి చేస్తున్నాడో తెలుసా
తన పిల్లనగ్రోవిలో
కొత్త రాగం నేర్చుకుంటున్నాడు"

ఆంగ్ల మూలం : మోహన్ కుమార్
తెలుగు : వారాల ఆనంద్

ఒకే ఆకాశం కింద....

ఒకే నేల ఒకే ఆకాశం
ఒకే గాలి ఒకే నీరు
ఒకే సూర్యుడు ఒకే చంద్రుడు
మనసు పొరల్లో పేలడానికి
సిద్ధంగా ఉన్న భూకంపాలు వేరు
తుకతుక ఉడుకుతున్న అగ్నిపర్వతాలు భిన్నం
ఒక చోట నీరు జీవధార అయితే
మరోచోట ఉప్పెనై బతుకు తీర సారాన్ని
ముంచెత్తుతుంది
ఒకే మనిషి ఒకే మనసు
ఒకే ప్రపంచం ఒకే జీవజాలం
ఒకే కాంతి ఒకే వెన్నెల
పక్కా రహదారి అడుగులో కనిపించని
కాలిబాట అడుగుజాడలు వైవిధ్యం
కలగని దూరబారాన్ని చింతిస్తుంది
ఒక్క దగ్గర అనుభవం పాఠం అయితే
మరొక దగ్గర గుణపాఠమై
లోకాన్ని గొప్ప మలుపు తిప్పుతుంది
ఒకే వాంఛ ఒకే ఐక్యం
ఒకే ఇంట ఒకే జంట
ఒకే ప్రాణం ఒకే గానం
ఒక్క చోట నిలువని కాలం
మరో చోట నీడను కోల్పోయిన ఆకారం
మన్ను మిన్నులా నిన్నూ నన్ను కలిపింది
ఒకే ఆకాశం కింద ఉదయంలా
కన్ను తెరిచిన స్వప్నం
నిజం ఉద్వేగంగా మొగ్గ తొడిగి
ఉసూరుమని ఉడిగిపోయిన
కలవర జీవన ప్రయాణం

- జూకంటి జగన్నాథం

ఆజాదీ హై కిస్కా

ప్రపంచజనుల బాధ తనబాధగా రాసాడని శ్రీశ్రీని, తన బాధను ప్రపంచబాధ చేసాడని కృష్ణశాస్త్రిని వ్యాఖ్యానిస్తుంటారు సాహిత్యకారులు. కాని, కవులంతా రుధాలీలే అంటాడొక కవి. రుధాలీలు కిరాయికి ఎవరి చావుకో, కర్మకాండలకో ఏడుస్తుంటారు. కొందరు సంపన్న వర్గాలవారు తమ దు:ఖాన్ని కూడా దు:ఖించలేరు. తనది కాని దు:ఖాన్ని తన దు:ఖంగా గీతించే వాగ్గేయకారుడు కవి. ఎవరివో వెక్కిళ్ళ తన గొంతులో, ఎందరి వేదనలో తన కవిత్వంలో, సముద్రమై తాను, కెరటాలై తన కవితలు... నిరంతర ఘోష తన కవిత్వమై కవి నిత్య నూతనంగా... కరిపె రాజ్‌కుమార్ 'ఆజాదీ' కవితా సంకలనమౌతాడు.

'వేట కొడవలి గాయాల...
పరిహాసపు పరంపరాగత వెక్కిళ్లు' కవి గొంతులో,
'అర్థనగ్న శరీరాలతో/ అక్షరశాలకెళితే/ ముక్కులు మూసుకునే/ కస్తూరీతిలకులు/ అపరాహ్న భోజనానికి/ సత్తుగిన్నెల్లోనే సద్దివడ్డింపులు/ అయినవారికి ఆకుల్లో/ కానివారికి కంచాల్లో'... (వెక్కిళ్ళు)

నిన్నమొన్నటిదాకా విశ్వవిద్యాలయాల్లోనూ ఎవరి 'బంతి'వారిదే. కాకా హోటల్లో ఇప్పటికీ మా గ్లాసులు మావే. ఇదేం సమాజం. ఇదేం వేర్పాటు. వేలయేండ్ల అంటరానితనం ఇంకా.. ఎన్నెన్ని రూపాల్లో... ఎప్పటిదాక? ఈ బాధ కవి గుండెల్ని తొలుస్తూనే వుంది. తండ్లాడిన గొంతుల్లో తడి ఆరని నినాదాలు.

గోవుకు, కుక్కకు, పిల్లులకున్న గౌరవం లేదా సాటి మనిషంటే. ఎందుకు వీళ్ల శాస్త్రాలు, చదువులు తగులబెట్టక.

'దంతాలున్న ఒక పిచ్చి ఏనుగు/ దానిపై చెదలుపట్టిన అంబారీ/ చోద్యాలు చూసే మావటీలు'

మదపిచ్చి దంతాల ఏనుగు ధ్వంసరచన, హింసరచన చేసే విధ్వంసకారులకు ప్రతీక. దాని మీద చెదలుపట్టిన అంబారీ పురాతన సనాతనత్వానికి పీఠం. దీన్నంతా తమాషాగా చూసే మావటీలు మన ఏలికల ప్రతిబింబాలు. ధ్వంసరచనలతోనే వారికి గద్దెలు దక్కుతాయి. వాళ్ళ చర్యలు దంతమదగజ ధ్వంసనమే.

'మూతులు కుట్టేసి, చేతులు కట్టేసి/ విద్వేషాగ్నులను రగిలించడం ఎంతసేపు?'...

వారికదో వినోదం. కుల, మత, జాతి, ప్రాంత విద్వేషాలను రెచ్చగొట్టి, మంటలు పెట్టడానికి ఎంతసేపు? సంయమన సాధన ఏముండదు. దొంగమాటలు తప్ప. వైవిధ్యాలను వైరుధ్యాలుగా మార్చి వివాదాలు పుట్టించేది వాళ్లే. వాళ్ళది అధికార మతం. నేటి సామాజిక పరిణామాల మీద గొప్ప సెటైర్ ఈ 'పిచ్చి ఏనుగులు' కవిత.

రోడ్ల విస్తరణ, ప్రాజెక్టుల ముంపులు ఎందరి జీవితాలను అస్తవ్యస్తం చేస్తాయి. కండ్ల ముందర తాతలనాటి ఇండ్లు, పొలాలు, తర తరాల చరిత్రలు కూలిపోతాయ్, మునిగిపోతాయ్. మనుష్యులు వలసపోవాలె. అధికార గారడీవాండ్ల చేతుల్లో గుంజుకు కట్టిన అంగట్ల ముంగిసలై అల్లల్లాడుతారు ప్రజలు. నీళ్ల ముంపులో కొట్టుకుపోయిన గ్రామాల ప్రజలు త్యాగధనులుగా మిగిలిపోయారు.

'ఆజాదీ' కరిపె రాజ్ కుమార్ నాలుగవ కవితా సంపుటి. వైవిధ్యవస్తు సంపన్నమైన వచనకవితాకావ్యం. తనదొక ప్రత్యేక అభివ్యక్తిశైలి. తన కవితల నిండా తనదైన పదసంపద. భావంలో నవ్యత, భాషలో నవ్యత. కొత్త పదబంధకల్పన చేసాడీ కవి.

మీనాల మీసాలను/ అవలీలగా పట్టేయగలడు.

మార్కెట్ మాయలో పడని వినియోగదారుడు లేడు. ఎన్ని మాయాజలతారులు విసిరి జనాలను వెర్రివాళ్ళను చేస్తుంది అంగడి.

Christina Rossetti, Goblin Market అనే పెద్ద కవితలో "Come buy, come buy" was still their cry./ Laura stared but did not stir,/ Long'd but had no money:/ The whisk-tail'd merchant bade her taste/ In tones as smooth as honey,/ The cat-faced purr'd,/ The rat-faced spoke a word/ Of welcome, / and the snail-paced even was heard;/ One parrot-voiced and jolly/ Criedw "Pretty Goblin" still for "Pretty Polly"—/ 'One whistled like a bird.

ఎన్ని దొంగ ముఖాలతో వ్యాపారానికి దిగుతారో రాస్తుంది.

దేశమంతటా మొన్నటి భారత స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు జరిగాయి. స్వేచ్ఛ ఎవరికి దక్కింది. ప్రజాస్వామ్యం ఎంత మిగిలింది?


విముక్తి పోరాటాలలో/ విగతజీవులైన వీరులెందరు?/ కార్మిక కర్షక ఉద్యమాలలో/ అస్తమించిన అమరులెవ్వరు?/ తాడోపేడో తేల్చుకునే సన్నద్ధతలో/ తలలు తెగిన తారకలెన్ని?/ జైళ్ళలో మగ్గి జీవచ్ఛవాలైన/ జాగృత వసంత కోకిలలెన్ని?

కవి రాజ్ కుమార్ వేస్తున్న ఈ ప్రశ్నలకు సమాధానమెవరిస్తారు? బూటకపు ప్రజాస్వామ్య నాటకం ఎన్నినాళ్లు సాగిస్తారు ఏలికలు?

'1947లో ఆంగ్లేయులు భారతదేశాన్ని వదిలిపోయారు/ ఇపుడు మనదేశం ఆజాదే/ దేశవాసులంతా ఇదే అంటారు కాని,/ నిజంగా మనం ఆజాదీలమేనా?/ మనం ఆజాదీలం కాదు, అదంతా మన భ్రమ/ నీలాకాశంలో ఎగిరే పిట్టలు ఆజాదీలు/ కాని, మనం మన ఇండ్లలోంచి బయటకు రావాలంటేనే భయపడతాం/ రోడ్లమీద ఏ హంతకుడో మనకోసం కాచుకొని కూచున్నాడని/ మనం ఆజాదీలం కాదు, అదంతా మన భ్రమ!' అంటుంది రీతి అనే కవయిత్రి...
ఇదీ మన భారతం

రైతుల గురించి కవులందరు రాస్తారు కవితలు. కాని, రైతుజీవితాన్ని రైతును ప్రజంట్ చేయడంలో వైవిధ్యముంటుంది. అన్నదాత రైతు **'సేద్యగంధాల సైరికుడు,/ సేద్యబంధాల సైనికుడు'** అంటాడు కవి రాజ్ కుమార్. **'లోకుల ఆకలి తీర్చడమే/ తన పరమావధిగా తలుస్తాడు / పదవీ విరమణ ఎరుగని పాంథుడు/ వ్యవసాయాన్ని వ్యసనంగా భావించిన వాడు'** అని రైతుని కవి వర్ణించాడు.

భారత్‌లోని మొత్తం సంపదలో 40 శాతం కేవలం ఒకశాతం ధనవంతుల దగ్గరే ఉందని, అట్టడుగున ఉన్న సగం జనాభా వద్ద దేశ సంపదలో కేవలం 3 శాతం మాత్రమే ఉందని ప్రముఖ హక్కుల సంస్థ ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ 'సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్' పేరిట భారత్‌లోని ఆర్థిక అసమానతలపై సోమవారం నివేదిక తెలియచేసింది.




అదేమాట కవి కరిపె రాజ్ కుమార్ 'జ్వాలాలేఖిని' అనే కవితలో...

'అధికాదాయ/ అల్పజన సమూహాలు/ అల్పాదాయ/ అధిక జనసందోహాలను అధికధరలతో ఆటలాడించవచ్చు, అప్రకటిత కుట్రలతో క్రీడించి ఓడించనూవచ్చు' అంటాడు.

ఈనాడు దేశమంతటా వివక్షలు పెచ్చరిల్లాయి. మనువెన్నడు లేని కుల, మత, జాతి, ప్రాంత వివక్షలు మనిషికి, మనిషికి మధ్య అంతరాలెక్కువై పోయాయి. మనుషులంతా ఒక్కటే అనే నినాదం చెల్లనిదైపోయింది... వసుధైక కుటుంబకమ్ అక్కరకు రాని హితవు.

'నానా నాగరికతా పాయల నడుమ/ అనాగరిక కలుపుమొక్కగా అంకురించి/ విస్తరిల్లిన ఓ వివక్షతా విషవృక్షమా! మానవతను ఎన్నాళ్లు ఓడిస్తావ్?' అని నిగ్గదీసి అడుగుతున్నాడు తన అగ్గిపదాలతో.

ఆజాదీ కవితాసంకలనం కవి ప్రాపంచిక దృక్పథానికి నిదర్శనం. కరిపె రాజ్ కుమార్ తానున్న సమాజాన్ని విశ్లేషించాడు. విషాల్ని గుర్తించాడు. విరుగుడుల్ని వివరించాడు. తనది మానవతావాదం. తన కవిత్వం సమస్తదుర్మార్గాల మీద సత్యాగ్రహం.



- శ్రీరామోజు హరగోపాల్,
9949498698

సాహితీ వార్తలు

కవి సమ్మేళనం

శ్రీశ్రీ జయంతి, మే డే ల సందర్భంగా శ్రామిక కవి సమ్మేళనం ఈ నెల 30 వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. ఈ సభలో కవి యాకూబ్, ఏబూషి నర్సిహ్మా, కె.ఆనందాచారి, తంగిరాల చక్రవర్తి, నస్రీన్‌ఖాన్, సలీమా, శరత్ సుదర్శి, మేరెడ్డి రేఖ పాల్గొంటారు.

'నాగలి కూడా ఆయుధమే..!' పరిచయ సభ

దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటి "నాగలి కూడా ఆయుధమే" పరిచయ సభ రాపోలు సీతారామరాజు అధ్యక్షతన ఈ నెల 30వ తేదీ సాయంత్రం 6.00 గంటలకు అంతర్జాల వేదికపై జరుగుతుంది. గుడిపాటి, యం. నారాయణ శర్మ, పి.శ్రీనివాస గౌడ్, గౌతమ్ లింగా, విల్సన్ రావు కొమ్మవరపు పాల్గొంటారు.వివరాలకు : 89854 35515.

గంద్ర హనుమంతరావు స్మారక సాహిత్య పురస్కారానికి 'షట్చక్రం' ఎంపిక

గంద్ర హనుమంతరావు స్మారక పురస్కారాన్ని ఈ సంవత్సరం డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి రచించిన షట్చక్రం పుస్తకాన్ని పురస్కార కమిటీ ఎంపిక చేసింది.

జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాల కోసం వ్యాసాలు

తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం మొదలైన అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్తు రూపొందించి ప్రచురిస్తున్న జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాల పరంపరలో మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్ జిల్లాల సంపుటాలకు వ్యాసాలు ఆహ్వానిస్తున్నారు.
వివరాలకు : 9441046839

- డా.రాయారావు సూర్యప్రకాశరావు

మాతృ వందనం

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, సితాస్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో మూడవ సంవత్సరం వేడుకలు ఈ నెల 30 ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళామందిరం లో నిర్వహిస్తున్నారు. 43 మందికి సత్కారం వుంటుంది. ఆచార్య తంగెడ కిషన్ రావు, కవిత దర్యానిరావు, డా॥ కె .రజనీ ప్రియ, డా ॥మామిడి హరికృష్ణ, భట్టు రమేష్, అయినంపూడి శ్రీలక్ష్మి, నల్లమోతు నాగరాణి పాల్గొంటారు.



భువనేశ్వర్‌కు వెళ్లిన భట్టి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఒడిశా రాష్ట్రం కటక్‌లో ఆదివారం కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగ సభకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెళ్లారు. అంతకు ముందు సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించన ఆయన...అనంతరం రాహుల్‌గాంధీతోపాటు బహిరంగసభలో ప్రసంగించారు. అక్కడి పీసీసీ కార్యాలయంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జీ అజయ్ కుమార్, జాతీయ నేత భక్త చరందాస్, ఆర్‌సీ కుంతియాలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆ తర్వాత భువనేశ్వర్ పీసీసీ సోషల్ మీడియా విభాగం నేతలకు భట్టి దిశానిర్దేశం చేశారు. ఫ్రీ కాస్ట్ టెక్నాలజీతో నిర్మించిన ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- వ్యవసాయ శాఖ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వానాకాలం సీజన్‌కు కల్తీ విత్తనాల అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ హెచ్చరించింది. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే నేపథ్యంలో ప్రభుత్వం వ్యవసాయ శాఖ, పోలీసు,విజిలెన్స్ శాఖలను అప్రమత్తం చేసింది. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మన రాష్ట్రానికి విత్తనాలను సరఫరా చేస్తున్నప్పటికి వారిపై తనిఖీలు చేపట్టాలని ఆదేశించింది. ముఖ్యంగా లైసెన్స్ లేకుండా నిషేదిత పత్తి, ఇతర విత్తనాలను రైతులకు మభ్యపెట్టి అమ్మే వారిపై గట్టి నిఘా పెట్టింది. ఇప్పటికే కల్తీ విత్తనాలను అమ్మిన 12 మంది గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు వెల్లడించింది. లైసెన్స్ లేకుండా విత్తనాలను అమ్మడం విత్తన నియంత్రణ చట్టం 1983 ప్రకారం నేరం అని పేర్కొంది. లైసెన్స్ పొందిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొవాలని సూచించింది. తప్పనిసరిగా రశీదు తీసుకోవాలనీ, తీసుకున్న రశీదును పంట కోతలు పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించింది.

బిర్యానీ రాజకీయాలు....!



- మతం రంగు పులుముతున్న కమలదళం
- ఈసీ నోటీసుకూ వెరవని ఆదిత్యనాథ్
- భోపాల్‌లో ఫెస్ట్‌నే నిర్వహించిన మజ్లిస్

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సీజన్‌లో బిర్యానీకి డిమాండ్ పెరిగిపోతోంది. ఇప్పుడు ఎక్కడ చూసినా బిర్యానీ రాజకీయాలే!. హైదరాబాద్, దేశ రాజధాని ఢిల్లీ, అవధ్, కొల్‌కతా నగరాల్లో బిర్యానీ ప్రియులు అధికంగా ఉన్నారన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు తమిళనాడులో కూడా బిర్యానీ పేరు మారుమోగుతోంది. బిర్యానీ మసాలా ఇప్పుడు రాజకీయాలను ఘాటెక్కిస్తోంది. ఓటర్లను ఆకర్షించడానికి వివిధ రాజకీయ పార్టీలు మద్యం, డబ్బుతో పాటు బిర్యానీ ప్యాకెట్ కూడా ఇచ్చుకుంటున్నాయి. వాస్తవానికి ఎన్నికల సీజన్ వచ్చిన ప్రతిసారీ బిర్యానీకి మంచి గిరాకీ ఉంటోంది.

మాంసం ముద్ద దిగాల్సిందే

ఓటర్లకే కాదు...ప్రచారంలో భాగస్వాములయ్యే పార్టీ కార్యకర్తలకు కూడా బిర్యానీ ప్యాకెట్ ఇవ్వాల్సిందే. తమిళనాడు రాజధాని చెన్నయ్‌లో ఈసారి బిర్యానీ కోసం విపరీతంగా అర్డర్లు వస్తున్నాయి. పార్టీ కార్యకర్తలకు, ఓటర్లకు తినిపించేందుకు రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున బిర్యానీని కొనుగోలు చేస్తున్నాయి. ప్రచారానికి తరలి రావాలంటే మంసం ముద్ద గొంతు దిగాల్సిందే మరి. చెన్నయ్‌లో చికెన్ బిర్యానీ ప్యాకెట్‌కు జిల్లా ఎన్నికల అధికారులు నిర్ణయించిన రేటు రూ.150.

బిర్యానీని తయారు చేయడం, ప్యాక్ చేయడం, ఆ తర్వాత దానిని పంచడం చాలా సులభం. ఓటర్లు, కార్యకర్తలు కూడా ఎంతో ఇష్టంగా దీనిని లాగించేస్తున్నారు. పనిలో పనిగా ప్రచారంలో బిజీబిజీగా ఉండే నాయకులు, అభ్యర్థులు కూడా బిర్యానీని ఓ పట్టు పడుతున్నారు.

ప్రతిపక్షాలపై ఆరోపణల కోసం...

రాజకీయ నాయకులు... ముఖ్యంగా బీజేపీ నేతలు తమ ఎన్నికల ప్రచారంలో బిర్యానీని ప్రస్తావించడం మరచిపోవడం లేదు. బీజేపీ తరచుగా తన రాజకీయ ప్రత్యర్థులపై విమర్శల కోసం, మైనారిటీలను కించపరచడం కోసం బిర్యానీ రాజకీయాలను ఆశ్రయిస్తోంది. తద్వారా ఈ వంటకానికి మతం రంగు పులుముతోంది. ఈ నెల ప్రారంభంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాజస్థాన్‌లో జరిగిన ఓ ర్యాలీలో ప్రసంగిస్తూ 'కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలను ఆకలితో



చంపుతుంది. అదే ఉగ్రవాదులకు బిర్యానీ పెడుతుంది' అని ఆరోపించారు.

2020లో జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు ముందు ముస్లింల పట్ల వివక్ష చూపుతున్న పౌరసత్వ సవరణ చట్టానికి, జాతీయ పౌరుల రిజిస్టర్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు జరిగిన విషయం తెలిసిందే. అప్పుడు యూపీ సీఎం ఆదిత్యనాథ్ పాలక అమ్‌ఆద్మీ పార్టీపై విమర్శలు చేశారు. షహీన్‌బాగ్‌లోనూ, నగరంలోని ఇతర ప్రాంతాలలోనూ నిరసనలు తెలుపుతున్న వారికి అమ్‌అద్మీ పార్టీ బిర్యానీ సరఫరా చేస్తోందని ఆయన ఎత్తిపొడిచారు. తూర్పు ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో ముస్లింలు అధిక సంఖ్యలో నివసిస్తుంటారు. బిర్యానీ ప్రస్తావన తెచ్చినందుకు ఎన్నికల కమిషన్ యోగికి నోటీసు కూడా పంపింది.

అయినా మూతపడని నోరు

అయినప్పటికీ ఆదిత్యనాథ్ నోరు అంతటితో మూతపడలేదు. 'పాకిస్తాన్ ఉగ్రవాదులను మన సైనికులు నరకానికి పంపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ, కేజ్రీవాల్ వారికి బిర్యానీ తినిపిస్తున్నారు. కానీ మేము బులెట్ల ఆహారాన్ని ఇస్తున్నాము' అంటూ మరోసారి బిర్యానీ ప్రస్తావన తెచ్చారు. బీజేపీకే చెందిన మరో నాయకుడు, పార్టీ ఐటీ విభాగం జాతీయ కన్వీనర్ అమిత్ మాల్వియా సామాజిక మాధ్యమాలలో ఓ చిత్రాన్ని షేర్ చేశారు. షహీన్‌బాగ్‌లో బిర్యానీని పంచుతున్నారనడానికి ఇదే రుజువు అని రాశారు. ఇది ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున ట్రోల్ అయింది. వాస్తవానికి నిరసన ప్రదేశాలలో ఏదో ఒకటి తినడం అసాధారణమేమీ కాదు. ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో అమ్‌ఆద్మీ పార్టీ ఘనవిజయం సాధించిన తర్వాత బిర్యానీ విక్రయాలు పెరిగాయి. బీజేపీ వ్యాఖ్యానాలు కూడా తగ్గిపోయాయి. బిర్యానీకి డిమాండ్ పెరగడంతో విక్రయదారులు అనేక ఆఫర్లతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

దక్షిణాదిలోనూ...

ఉత్తరాదిలో అలా ఉంటే దక్షిణాదిలో కూడా బీజేపీ మరో రకంగా బిర్యానీ రాజకీయాలు నడిపింది. కర్నాటకలో గత సంవత్సరం జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా బీజేపీ నేత ఎస్‌టీ సోమశేఖర్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ ఓ ఫిర్యాదు వచ్చింది. సోమశేఖర్ తన ఎన్నికల ప్రచారం సందర్భంగా కార్యకర్తలను బిర్యానీ తినమంటూ సూచించిన చిత్రాలను ఎవరో కెమేరాలో బంధించారు. ఇవి వైరల్ కావడంతో ఆయనపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందింది. కర్నాటకలోనే కాదు...మధ్యప్రదేశ్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూడా ఈ వంటకం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. రాష్ట్ర రాజధాని భోపాల్‌లో ఓటర్లను ఆకర్షించి పార్టీ బలాన్ని పెంచుకోవడానికి మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఏకంగా బిర్యానీ ఫెస్ట్‌నే ఏర్పాటు చేశారు.

కలెక్టర్ ఆదేశాలు..బేఖాతర్

- మద్దికుంట, మామిడిపల్లి భూ కబ్జాలపై మూడు రోజుల్లో రిపోర్టు వ్వాలని ఆదేశం
- మూడు నెలైనా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ఉబచెర్వు, ఉప్పరికుంట, మన్నేవారు కుంట కబ్జాలు
- ఎఫ్‌టీఎల్ పరిధిలో కబ్జాలను నిర్ధారించిన ఇరిగేషన్ అధికారులు
- రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు రిపోర్టులిచ్చినా పట్టని వైనం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి. చెరువులు, కుంటలు కబ్జాకు గురికాకుండా నిఘా కొనసాగించాలి. చెరువులు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. ఎఫ్‌టీఎల్ సరిహద్దుల్ని పరిశీలించి చెరువులు, కుంటల్ని పరిరక్షించాలి' ఇదీ..! జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ చెన్నూరి రూపేష్ భూముల కబ్జాలపై సమీక్షిస్తూ మాట్లాడిన మాటలు. కొత్త మంత్రి, కొత్త కలెక్టర్, కొత్త ఎస్పీ.. వచ్చి రాగానే ప్రభుత్వ భూముల పరిరక్షణపై దృష్టి సారించడాన్ని జిల్లా ప్రజలు స్వాగతించారు. ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువుల కబ్జాలకు అడ్డుకట్ట పడుతుందని భావించారు

చెరువులు, కుంట స్థలాల ఆక్రమణలపై ఆగమేఘాల మీద ఇరిగేషన్ అధికారులు విచారణ చేసి కబ్జా జరిగినట్టు నిర్ధారించారు. వెంటనే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగి కబ్జాకు గురైన భూముల్ని కాపాడుతారనుకుంటే వాళ్లకు పట్టింపే లేకుండా పోయింది. భూముల కబ్జాపై మూడు రోజుల్లో సమగ్ర రిపోర్టు ఇవ్వాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశిస్తే.. మూడు నెలలయినా రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు పట్టట్లేదు. ఎఫ్‌టీఎల్ సరిహద్దులు గుర్తిం చడంలో ల్యాండ్ సర్వే అధికారులు, ఆక్రమణలను తొలగించి చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కాలయాపన చేస్తుండటంతో కబ్జాదారులకు కలిసొస్తుంది.

మూడు రోజుల్లో రిపోర్టులివ్వాలని ఆదేశం

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండంలోని మద్దికుంట శివారులో జాతీయ రహదారి పక్కన రూ.40 కోట్ల విలువ చేసే భూమిని ఫోర్జరీ పత్రాలు సృష్టించి ఢిల్లీకి చెందిన రియల్టర్‌కు విక్రయించిన విషయాన్ని ఆధారాలతో సహా నవతెలంగాణ వెలుగులోకి తెచ్చింది. సర్వే నెంబర్ 88లో ప్రొసీడింగ్ నెంబర్ 3474/93, 1945/2006 ద్వారా 200 మంది ఇండ్లు లేని పేద కార్మికుల ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చారు. ఆర్థిక పరిస్థితి బాగలేక, ఊరికి స్థలాలు దూరంగా ఉండటంతో పేదలు ఇండ్లు కట్టుకో లేదు.

ఆ భూమిని ఓ రాజకీయ నాయకుడైన రియల్టర్ ఫోర్జరీ పత్రాలతో కాజేసిన తంతుపై సమగ్రమైన విచారణ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదు. కంది మండలం లోని మామిడిపల్లి శివారులో సర్వే నెంబర్ 312లో ఉన్న ప్రభుత్వ భూమిలో దివీస్ ధరిత్రి అనే సంస్థ ప్రయివేట్ వెంచర్ చేసి ప్లాట్లు అమ్ముకుంటున్న లోగుట్టును కూడా నవతెలంగాణ వెలుగులోకి తెచ్చింది.

ఈ కబ్జాలను సీరియ స్‌గా తీసుకున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు వీటిపై మూడు రోజుల్లో సమగ్రమైన రిపోర్టు ఇవ్వాలని ఫిబ్రవరి మొదటి వారంలో ఆదేశించారు. కానీ మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ తహసీల్దార్లు రిపోర్టు ఇవ్వలేదు. కబ్జాదారులకు అనుకూలంగా రిపోర్టు ఇవ్వలేక.. అలాగని కబ్జా జరిగింది నిజమేనంటూ రిపోర్టు పంపలేక రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఆఫీస్‌లో రికార్డుల్ని మాయం చేసినట్టు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ నెపంతో మరింత జాప్యం చేస్తున్నారు.

కుంట శిఖం భూముల కబ్జా

సదాశివపేటలోని ఉప్పరి కుంటకు సంబంధించిన



కుంట కట్టను తొలగించింది. ఓ ప్రయివేట్ వెంచర్ సంస్థ. కుంట కట్టను 100 ఫీట్ల వరకు తొలగించి ఎఫ్‌టీఎల్ పరిధిలో వాళ్ల వెంచర్ కోసం 40 ఫీట్ల రోడ్డు వేశారు. రియల్టర్లు కుంట కట్టను తొలిచి రోడ్డు వేయడంతో పలు చోట్ల కట్టకు లీకేజీ లేర్పడ్డాయి. నీళ్ల వృథాగా పోతున్న విషయాన్ని రైతులు గుర్తించి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

చెరువు కట్టపైనే వెంచర్‌కు చెందిన జెండాలను కట్టి ఆక్రమణకు పాల్పడుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. చెరువు కట్టకు లీకేజీలు పెట్టి నీరంతా ఖాళీ చేసి ఎండిపోయిన తర్వాత ఆక్రమించి వెంచర్‌లో కలుపుకునేలా రియల్టర్లు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆర్ఐ, సర్వేయర్లు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ స్పందించి వెంచర్ వాళ్ల వేసిన రోడ్డును చెడగొట్టి చెరువు కట్టకు శాశ్వత మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. అదే విధంగా మన్నెవారి కుంటలో సర్వే నెంబర్ 437లో నీళ్ల నిలిచే చోట రెండు ఫీట్ల మొరం పోసి క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో క్రీడా ప్రాంగణం బోర్డు పెట్టి తర్వాత ఆ భూమిని క్రమంగా ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో క్రీడాప్రాంగణం బోర్డు పెట్టినట్టు ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి నిర్ధారించినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. ఉబ చెరువులో 65 మంది శిఖం భూమిని ఆక్రమించి ఇండ్లు కట్టుకున్నారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదులు రావడంతో సర్వే చేయాలని అప్పటి కలెక్టర్ ఆదేశించారు. దాంతో జాయింట్ డైరెక్టర్ సర్వే చేసి 65 మందికీ నోటీసులు జారీ చేశారు. అందులో అప్పటి పట్వారీ అంజనేయులు 10 ప్లాట్లను ఆక్రమించి విక్రయించారు. అట్టి రికార్డులు కార్యాలయంలో లేకుండా మాయం చేసినట్టు తెలుస్తోంది. 260 సర్వే నెంబర్‌లో బలహీన వర్గాలకు కేటాయించిన పది ప్లాట్లను కూడా బినామీ పేర్లతో తన పట్టా భూమి సర్వే నెంబర్ వేసి పట్టాలు రాయించుకుని ఇండ్లు కట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఊబ చెరువు పక్కన అదే పట్వారీకి ఉన్న పట్టా భూమిలో ప్లాట్లు చేసి అమ్మిన తర్వాత పక్కనే ఉన్న ఊబ చెరువు శిఖం భూమిని ఆక్రమించారు. పట్టా, సర్వే నెంబర్లు వేసి పది ప్లాట్లు ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు.

ఆగని కబ్జాల పర్వం

సంగారెడ్డి జిల్లాలో ముంబయి జాతీయ రహదారి వెంట ఉన్న మండలాల్లో ప్రభుత్వ భూముల కబ్జా పర్వం కొనసాగుతునే ఉంది. అమీన్‌పూర్, పటాన్‌చెరు, కంది, సంగారెడ్డి, సదాశివపేట ప్రాంతాల్లో ఇప్పటికే 50 చోట్ల చెరువు, కుంట, శిఖం భూములు కబ్జాకు గురయ్యాయి. పారిశ్రామికంగా, రియల్ ఎస్టేట్ పరంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో భూముల విలువ అమాంతం పెరిగింది. వందల సంఖ్యలో వెంచర్లు వెలుస్తున్నాయి. పట్టా భూముల్లో ప్లాట్లు చేస్తున్న రియల్టర్లు పక్కనే ఉన్న కుంట, చెరువు, శిఖం భూముల్ని కలిపేసు కుంటున్నారు. పేదల కోసం ఇండ్ల స్థలాలకు కేటాయించి పంపిణీ చేసిన స్థలాల్ని కూడా కాజేస్తున్నారు. మామిడిపల్లి, కంది, సంగారెడ్డి, సదాశివపేట ప్రాంతాల్లో పేదలకు పట్టాలిచ్చిన భూముల్ని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ భూ కబ్జాలపై అధికారులతో సమీక్ష జరిపి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చెరువులు, కుంట, శిఖం భూముల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. కబ్జాకు గురి కాకుండా ఎఫ్‌టీఎల్ సరిహద్దుల్ని నిర్ధారించి ఫెన్సింగ్ వేయాలని సూచించారు. అయినా సరే కబ్జాలు మాత్రం ఆగని పరిస్థితి ఉంది.

రిజర్వేషన్లను నీరుగార్చింది బీజేపీయే

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సామాజిక రిజర్వేషన్లను నీరుగార్చింది బీజేపీ ప్రభుత్వమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. సామాజిక వివక్ష, అసమానతలను రూపుమాపటానికి భారత రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పిస్తే, వాటిని బీజేపీ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ఆర్థిక వెనుకబాటు ప్రతిపదికగా ఆ పార్టీ అగ్రకుల రిజర్వేషన్లు తీసుకొచ్చిందనీ, వాటి మూల సిద్ధాంతాన్ని, లక్ష్యాన్ని నీరుగార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో ఎక్కడా ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొనలేదని గుర్తు చేశారు. సాంఘిక అసమానతలను రూపుమాపి సామాజిక సమానత్వం సాధించడానికే రిజర్వేషన్లు కల్పించిందన్నారు. వాటిని నిర్వీర్యం చేసిన మోడీ సర్కార్.. బీసీ ఎస్సీ ఎస్టీల నోట్లో మట్టి కొట్టిందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని గత పదేండ్లనుంచి మోడీకి విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెట్టారని తెలిపారు. ఏ కమిషన్ సిఫార్సు, కులాల లెక్కలు లేకుండానే రాత్రికి రాత్రి 48 గంటల్లోగా ఆర్థిక వెనక బాటు అనే అసంబద్ధమైన కారణం చూపుతూ అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లను ఎలా కల్పించారని ఆయన ప్రశ్నించారు. బీసీలపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే, రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా కల్పించాలనుకుంటే మొదట కులగనణ చేపట్టాని డిమాండ్ చేశారు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వ కుండా, మహిళా బిల్లు సబ్ కోట బీసీలకు పెట్టకుండా, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కల్పించకుండా అన్యాయం చేశారని విమర్శించారు.

కాంగ్రెస్ మోసాన్ని ప్రజలు గుర్తించారు

- పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో కనీసం ఒక్క దాన్ని కూడా అమలు చేయకుండా కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేవలం నాలుగు నెలల్లో ఏ ప్రభుత్వానికి రానంత వ్యతిరేకత కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిందని చెప్పారు. సాగు, త్రాగునీరు, కరెంటు కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి పాలనల మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించారని తెలిపారు.కాంగ్రెస్ కు ప్రభుత్వానికి అధికారమదం తలకెక్కిందా అని జాతీయ జర్నలిస్ట్ బర్కాదత్ ట్వీట్ చేశారని గుర్తు చేశారు. ఆ ప్రభుత్వ అహంకారాన్ని తగ్గించేందుకు పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ను గెలిపించాలని ఆయన ప్రజలకు సూచించారు.

సూసైడ్ నోట్ రాసి.. ప్రేమ జంట ఆత్మహత్య

- ఇంట్లో ఒప్పుకోకపోవడమే కారణం..

నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్



ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మం డలం తుమ్మల పెన పహాడ్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన గుండగాని సంజయ్ (25) అదే గ్రామానికి ఆవాస గ్రామమైన కృష్ణసముద్రం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో ఉండే సల్లగండ్ల నాగజ్యోతి (21) గ్రామ శివారులోని కోట రాజేందర్‌రెడ్డి వ్యవసాయభూమిలో మోనోక్రోటోపాస్ పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకు న్నారు. ఆత్మహత్యకు గల కారణం పోలీసులు ఆరా తీయగా అమ్మాయి బ్యాగ్‌లో సూసైడ్ నోట్ లభించింది. దాని ప్రకారం.. నాగజ్యోతి, సంజయ్. ఆరేండ్ల నుంచి ప్రేమించుకొంటున్నారు. వీరి ప్రేమ విషయం మూ డేండ్ల కిందటే అమ్మాయి ఇంట్లో తెలవడంతో ఆమె తండ్రి.. ఆమెతో వాదనకు దిగారు. దాంతో అప్పటినుంచి వారిద్దరూ విడివిడిగా ఉన్నారు. సంజయ్ సూర్యాపేటలో ఉంటూ వాటర్ ప్లాంట్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. నాగజ్యోతి ఇమాంపేట ప్రతిష్టా కాలేజీలో బీ ఫార్మసీ పూర్తి చేసి కొద్ది రోజుల పాటు హైదరాబాద్‌లోని నాగోల్ క్రాస్‌రోడ్‌లోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో పనిచేసింది. ఇప్పుడు సూర్యాపేటలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో పనిచేస్తూ సనా కాలేజీలో ఎం ఫార్మసీ చదువుతున్నది. ఈ క్రమంలో మూడేండ్ల నుంచి తిరిగి వారిద్దరూ ప్రేమను కొనసాగిస్తున్నారు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన బెల్లంకొండ నారాయణ, ఆరే లతారెడ్డి అమ్మాయి తండ్రికి వారి ప్రేమ సంగతి చెప్పారు. దాంతో ఆమె తండ్రి పలుమార్లు అమ్మాయిని కొట్టాడు. అమ్మాయి పాలోళ్లయిన సల్లగండ్ల అజయ్, సల్లగండ్ల మల్లయ్య, సల్లగండ్ల శ్రీను, సల్లగండ్ల ఉప్పయ్య కొద్ది రోజుల కింద సంజయ్‌తో గొడవపడి కొట్టారు. దాంతో మనస్తాపం చెందిన సంజయ్, నాగజ్యోతి.. శనివారం రాత్రి తమ తమ ఇండ్లలో నుండి పురుగుల మందు తెచ్చుకొని పొలంలో తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వారిద్దరి చావుకు కారణమయిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూసైడ్ నోట్‌లో పేర్కొని ఇద్దరూ సంతకాలు చేశారు. కాగా, మృతదేహాలను పోస్టుమార్టం చేసి ఇరువురి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

యుద్ధ క్షేత్రంలో పరిస్థితి 'సంక్లిష్టం'

- ఉక్రెయిన్ టాప్ మిలిటరీ కమాండర్

రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధ క్షేత్రంలో ఉక్రెయిన్ పరిస్థితి "సంక్లిష్టం"గా ఉందని ఉక్రెయిన్ సాయుధ దళాల కమాండర్-ఇన్-చీఫ్ జనరల్ అలెగ్జాండర్ సిర్స్కీ శుక్రవారంనాడు జరిగిన వర్చువల్ రామ్‌స్టెయిన్ గ్రూప్ సమావేశంలో ఉక్రెయిన్ పాశ్చాత్య మద్దతుదారులతో అన్నాడు. డాన్‌బాస్ ప్రాంతంలో కొనసాగుతున్న రష్యన్ దాడులలో ఉక్రేనియన్ మిలిటరీ కేవలం ఒక వారంలో 8,000 మందికి పైగా సైనికులను కోల్పోయిందని రష్యన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. "నేను... కష్టతరమైన కార్యాచరణ, వ్యూహాత్మక పరిస్థితి గురించి సంకీర్ణ సభ్యులకు తెలియజేశాను. పరిస్థితులు మరింతగా దిగజారి పోతున్నాయి" అని సిర్స్కీ శనివారం ఒక టెలిగ్రామ్ పోస్ట్‌లో తెలిపాడు. ఇందులో ఉక్రెయిన్‌కు సైనిక సహాయం అందించడంపై పాశ్చాత్య దేశాలతో చర్చల గురించి మాట్లాడాడు. ఉక్రెయిన్‌కు క్షిపణులు, మందుగుండు సామాగ్రి, ఆయుధాలు, సైనిక పరికరాలు "తక్షణావసరం" అని జనరల్ చెప్పాడు.

ఉక్రెయిన్‌కు 61 బిలియన్ డాలర్ల విలువైన సైనిక సహాయ ప్యాకేజీని అమెరికా ఇటీవల ఆమోదించింది.



అమెరికా సరిహద్దు నియంత్రణ వ్యయంపై వైట్‌హౌస్ నుండి రాయితీలు కోరిన రిపబ్లికన్ చట్టసభ సభ్యులు దానిని నిరోధించినందున అత్యవసర వ్యయ బిల్లు నెలల తరబడి కాంగ్రెస్‌లో నిలిచిపోయింది. ఉక్రెయిన్ కోసం ఉద్దేశింపబడిన సహాయానికి అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం తెలపటాన్ని ఉక్రేనియన్ ప్రెసిడెంట్ వ్లాదిమిర్ జెలెన్స్కీ స్వాగతించాడు. మరిన్ని పాశ్చాత్య ఆయుధాలతో తన దేశానికి "విజయం సాధించే అవకాశం" ఉందని అతను ఎన్‌బిసికి చెప్పాడు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి డిమిత్రి కులేబా ఈ విషయంపైన తన సందేహాన్ని వ్యక్తపరిచాడు. "ఏ ఒక్క ప్యాకేజీ రష్యన్‌లను ఆపలేదు" అని ఆయన అన్నాడు.

ఏ పాశ్చాత్య ఆయుధాలూ యుద్ధ క్షేత్రంలోని చలనశీలతను మార్చలేవని రష్యా ప్రకటించింది. రష్యా ఈ సంవత్సరం ప్రారంభం నుండి దాడులను తీవ్రతరం చేస్తోంది. ఫిబ్రవరిలో వ్యూహాత్మక డాన్‌బాస్ నగరమైన అవదీవ్కాను స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి రష్యన్ దళాలు పశ్చిమంవైపు మరింతగా ముందుకు దూసుకు పోతున్నాయి. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో అనేక చిన్న చిన్న స్థావరాలను స్వాధీనం చేసుకున్నాయి. గత వారంలో రష్యా ఉక్రేనియన్ దళాల నుంచి రెండు ఆవాసాలను స్వాధీనం చేసుకున్నదని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

2022 ఫిబ్రవరిలో సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ దాదాపు 500,000 మంది సైనికులను కోల్పోయిందని ఈ నెల ప్రారంభంలో రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగు ప్రకటించాడు. అందువల్లనే ఉక్రేనియన్ ప్రభుత్వం, సైనికాధికారులు తమ నష్టాలను భర్తీ చేయాల్సిన తక్షణ అవసరాన్ని పదేపదే ఎత్తి చూపుతున్నారు. ఇటీవల సైనిక మోబిలైజేషన్ వ్యవస్థ సమూల సంస్కరణ చట్టంపైన జెలెన్స్కీ సంతకం చేశాడు. సైన్యంలో చేరకుండా తప్పించుకునే వారికి కఠినమైన శిక్షలను ప్రవేశపెట్టడం ద్వారా వేలాది మందిని నిర్బంధంగా సైన్యంలో చేర్చుకునే ప్రయత్నాలను ఉక్రెయిన్ ముమ్మరం చేసింది.

స్టాగ్‌ఫ్లేషన్ ముప్పును ఎదుర్కొంటున్న అమెరికా

- బిజినెస్ ఇన్‌సైడర్

అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ విడుదల చేసిన తాజా స్థూల ఆర్థిక డేటా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రతిష్టంభన దిశగా పయనిస్తున్నట్లు సూచిస్తోందని న్యూయార్క్ నగరం ప్రధాన కేంద్రంగా అంతర్జాతీయ వ్యాపార వార్తలను అందించే బిజినెస్ ఇన్‌సైడర్ విశ్లేషించింది. నిరాశాజనకంగా వున్న సంకేతాలు రాబోయే కఠినమైన సవాళ్లను సూచిస్తున్నాయని బిజినెస్ ఇన్‌సైడర్ రాసింది. ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసికంలో అమెరికన్ జీడీపీ వార్షిక వృద్ధి రేటు 1.6శాతం మాత్రమే పెరిగిందని, ఇది 2.5శాతం అంచనాలకంటే చాలా వెనుకబడి ఉందని గురువారంనాడు బిజినెస్ ఇన్‌సైడర్ వెల్లడించింది. 2023 అక్టోబరు-డిసెంబర్‌లో నమోదైన 3.4శాతం, అంతకుముందటి త్రైమాసికంలో 4.9శాతం వృద్ధి కంటే వర్తమానంలో వృద్ధి రేటు చాలా మందకొడిగా సాగుతోంది. "ఇది రెండు వైపులా అత్యంత చెత్తగా ఉంది - ఊహించిన వృద్ధి కంటే నెమ్మదిగాను, ఊహించిన ద్రవ్యోల్బణం కంటే ఎక్కువగాను ఉంది" అని సీఐబీసీ ప్రైవేట్ వెల్త్ అమెరికా చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ డేవిడ్ డొనాబెడియన్ బిజినెస్ ఇన్‌సైడర్‌కి చెప్పాడు. బలహీనమైన వృద్ధి, పెరుగుతున్న వినియోగ వస్తువుల ధరలు స్టాగ్ ఫ్లేషన్ లేక మందగాడి ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థలో నెలకొన్నదనుకోవటానికి ప్రత్యేక సంకేతాలుగా ఉంటాయి. ఇది దీర్ఘకాలం పాటు ఆర్థిక మందగమనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ద్వారా వ్యక్తీకరించబడుతుంది. గతంలో ఒకసారి 1970లలో అమెరికన్ ఆర్థిక వ్యవస్థను స్టాగ్ ఫ్లేషన్ ఆవహించింది. ఆ కాలంలో ద్రవ్యోల్బణం



రెండంకెలకు పెరిగి ఆర్థిక వ్యవస్థ పతనమైనప్పుడు అమెరికా చివరిసారిగా స్టాగ్‌ఫ్లేషన్‌ను ఎదుర్కొంది. అమెరికా విధాన నిర్ణేతలు కీలక వడ్డీ రేటును 20శాతం వరకు పెంచడం ద్వారా ధరలను తగ్గించారు. అయితే దానితో ఆర్థిక వ్యవస్థ తీవ్ర మాంద్యంలోకి జారుకుంది.మార్చిలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు పెంపును వాయిదా వేసింది. అమెరికాలో ప్రస్తుతం వడ్డీరేట్లు 5.25శాతం - 5.5శాతం శ్రేణిలో ఉన్నాయి. ఫెడ్ ఓపెన్ మార్కెట్ కమిటీ తదుపరి సమావేశం మే 1న జరగనుంది. ఇదే కాలంలో ఫెడ్ ద్వారా కీలక ద్రవ్యోల్బణ కొలతగా ఉపయోగించే వ్యక్తిగత వినియోగ వ్యయ ధరల సూచిక 3.4శాతం వార్షిక వేగంతో పెరిగింది. ఇది ఒక సంవత్సరంలో జరిగిన అతిపెద్ద పెరుగుదలగా ఉంది. అమెరికా వినియోగదారుల వ్యయంలో పెరుగుదల జనవరి నుంచి మార్చి వరకు 2.5శాతంగా ఉంది. ఇది 2023 నాల్గవ త్రైమాసికంలో 3.3శాతం పెరుగుదల నుంచి తగ్గిందని, అంచనా వేసిన 3శాతం కంటే తక్కువగా ఉందని బ్యూరో ఆఫ్ ఎకనామిక్ అనాలిసిస్ పేర్కొంది. ఏదైనా రేటు తగ్గింపులు జరగడానికి ముందు ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టాల్సిన అవసరం ఉందని రెగ్యులేటర్ స్పష్టం చేసినందున, ఇది ఫెడ్ చర్య తీసుకునే సామర్థ్యంపై తీవ్రమైన పరిమితులను కలిగిస్తుందని బిజినెస్ ఇన్‌సైడర్ రాసింది.

గాజా దారుణ మారణకాండపై ఆరని ఆగ్రహ జ్వాలలు

- నిర్బంధాన్ని ఎదిరించి ముందుకు సాగుతున్న యూనివర్సిటీ విద్యార్థులు

వాషింగ్టన్ : గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతపై అమెరికాలో రగిలిన ఆగ్రహ జ్వాలలు అంతకంతకూ విస్తరిస్తున్నాయి. పాలస్తీనాపై దురాక్రమణకు పాల్పడుతూ, దారుణ మారణకాండకు కారణమవైన యూదు దురహంకార ఇజ్రాయిల్‌కు యూనివర్సిటీ నిధులను మళ్లించడాన్ని ఆపాలని, ఆయుధాలు, నిధుల సరఫరాకు తక్షణమే స్వస్తి పలకాలని కోరుతూ గత కొన్ని రోజులుగా అమెరికా అంతటా యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న ఆందోళనలతో అమెరికా అట్టుడుకుతోంది. రోజులు గడుస్తున్న కొద్దీ తీవ్రతరమవుతున్న ఈ ఉద్యమం రెండు ప్రధాన పాలకవర్గ పార్టీల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. క్యాంపస్‌లలో గుడారాలు వేసుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులపై బైడెన్ ప్రభుత్వం పెద్దయెత్తున నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది.వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసింది. కొందరిని క్యాంపస్ నుంచి బహిష్కరించింది. పోలీసులను పెద్దయెత్తున మోహరించి నిరసన గుడారాలను బలవంతంగా తొలగించేందుకు యత్నించింది. విద్యార్థులపై పోలీసులు పిప్పర్ బాల్స్, టియర గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించారు. ఇటువంటి వాటికి తాము భయపడేది లేదని, పాలస్తీనాపై దురాక్రమణను, ఊచకోతను ఆపాలన్న డిమాండ్‌పై తాము తగ్గేదే లే అని విద్యార్థులు స్పష్టం చేశారు. నిర్బంధాన్ని ఎదిరించి వీరోచితంగా పోరాడుతున్న అమెరికన్ యూనివర్సిటీ విద్యార్థులకు ప్రపంచ నలుమూలల నుంచి మద్దతు లభిస్తోంది. అమెరికా విద్యార్థుల పోరాటానికి మద్దతుగా శుక్రవారం ఎమెన్ రాజధాని సనా స్క్వేర్‌లో భారీ మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌లో లక్షలాది మంది యెమెన్ ప్రజలు పాల్గొని ఇజ్రాయిల్ దుర్మార్గాలకు వ్యతిరేకంగా నినదించారు. ఫ్రాన్స్‌లో కూడా వీరికి సంఘీభావంగా ప్రదర్శనలు జరిగాయి. ఆఫ్రికా, ఆసియా దేశాల నుంచి కూడా వీరి పోరాటాన్ని అభినందిస్తూ సందేశాలు వస్తున్నాయి.

ఈ ఆందోళనలకు ప్రధాన కేంద్రంగా ఉన్న కొలంబియా యూనివర్సిటీలో నిరసన శిబిరాలను ఖాళీ చేయించాలని చూసిన పోలీసులకు విద్యార్థుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. యేల్, న్యూయార్క్, మిచిగాన్, ఓహియో, హోస్టన్, సదరన్ కాలిఫోర్నియా, ఇలా అన్ని యూనివర్సిటీలు నిరసనలతో హోరెత్తుతున్నాయి. ఈ నిరసనల్లో పాల్గొన్నందుకు భారత సంతతికి చెందిన విద్యార్థిని శివలింగమ్‌ను యూనివర్సిటీ నుంచి యాజమాన్యం సస్పెండ్ చేసింది. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ఆమె పాలస్తీనా ప్రజలకు తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు.గాజాలో ఇజ్రాయిల్ దారుణ మారణకాండకు అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇద్దరూ బాధ్యులేనని నిరసనకారులు విమర్శిస్తున్నారు. వీరి మద్దతుతోనే నెతన్యాహు 25వేల మంది మహిళలు, పిల్లలతో సహా 34వేల మంది అమాయక పౌరుల ప్రాణాలు తీశాడని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అట్లాంటాలోని ఎమోరా యూనివర్సిటీలో శాంతియుతంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై యాజమాన్యం ఆదేశాలతో పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ దృశ్యాలు తన యుక్తవయసులో గ్వాటెమాలాలో జరిగిన అంతర్యుద్ధాన్ని గుర్తుకు తెస్తున్నాయని ఇంగ్లీష్ ప్రొఫెసర్ ఎమిల్ కెమె తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులను పోలీసులు రబ్బరు బుల్లెట్లు, వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. ఇదంతా చూస్తుంటే తాము యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్నామా, లేక యుద్ధ ప్రాంతంలో ఉన్నామా అన్న అనుమానం కలుగుతోందని అన్నారు. వీరికి మానవ హక్కుల గ్రూపులు, ప్రతిఘటనా బృందాలు, వామపక్ష, ప్రజాతంత్రవాదులు సంఘీభావంగా నిలిచారు.

గాజాలోని పాలస్తీనియన్లకు సంఘీభావంగా విద్యార్థులు ఈ నిరసనలు చేపడుతున్నారు. ఇజ్రాయిల్‌తో ముడిపడి ఉన్న అంశాలు, గాజాలో యుద్ధానికి ఆజ్యం పోసే ఆయుధాలకు యూనివర్శిటీలు ఫండ్స్ నిలిపివేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

బెరియాట్రిక్ సర్జరీతో మధుమేహం దూరం

- కేర్ బంజారాహిల్స్ సీఓఓ సయ్యద్ కమ్రాన్ హుస్సేన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హై బీఎమ్ఐ ఉన్న డయాబెటిక్ రోగుల్లో బేరియాట్రిక్ సర్జరీతో మధుమేహం దూరమవుతున్నట్టు కేర్ ఆస్పత్రి (బంజారాహిల్స్) సీఓఓ సయ్యద్ కమ్రాన్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రిలో ఇటీవల ఒడిషా రాష్ట్రానికి చెందిన ముగ్గురు హైబీఎమ్ఐ ఉన్న రోగులు ట్రాన్స్ ఫర్మేటివ్ సర్జరీ తర్వాత డయాబెటీస్ నుంచి పూర్తిగా బయటపడ్డారని చెప్పారు. ఈ సర్జరీ తర్వాత సదరు రోగులు డయాబెటిస్ మందులు వాడాల్సిన అవసరం లేకుండా పోయిందని వెల్లడించారు. మెటబాలిక్ సర్జరీగా కూడా వ్యవహరించే ఈ శస్త్రచికిత్సను లాపరోస్కోపికల్‌గా చేస్తారని ఆయన తెలిపారు.

ఈ సర్జరీలో భాగంగా హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపించడానికి వీలుగా కడుపు, పేగులను తిరిగి మారుస్తారని ఆస్పత్రి కన్సల్టెంట్ సీనియర్ రోబోటిక్ బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్ పరీక్ తెలిపారు. హైబీపీ, ఊబకాయం తదితర వాటి కారణగా వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, శ్వాస ఆడకపోవడం, రక్తపోటు,, నిద్రలేమి, భారీ గురక సమస్యలకు ఆ రోగులు మందులు వాడేవారని తెలిపారు. వారి శరీరంలో చక్కెర స్థాయిలు నియంత్రణలోకి రాకపోవడంతో సర్జరీ చేయించుకున్నారని చెప్పారు. ఈ సర్జరీతో జీవితకాలం పెరగడంతో పాటు ఆ కాలంలో మెరుగైన జీవితం లభిస్తుందని పేర్కొన్నారు.

నా రూపాన్ని కాదు.. మార్కుల్ని చూడండి

- యూపీ టెన్త్ టాపర్ ప్రాచీ నిగమ్



లక్నో : యుపిలో పదవ తరగతి బోర్డ్ పరీక్షల్లో 98.5 శాతం మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన ప్రాచీ నిగమ్ ఆదివారం తనపై వస్తున్న ట్రోల్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన రూపాన్ని కాదని, పరీక్షల్లో తాను సాధించిన మార్కుల్ని చూడాలని అన్నారు. "నా ముఖంపై అవాంఛిత రోమాలు ఉండటం వల్ల నన్ను ట్రోలింగ్ చేస్తున్నారు. నా రూపాన్ని కాదు.. మార్కుల్ని చూడండి" అని బదులిచ్చారు. "చాణక్యుడు కూడా వేధింపులకు గురయ్యారు.అవి అతనిపై ప్రభావం చూపలేకపోయాయి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన వారందరికీ ప్రాచీ కృతజ్ఞతలు తెలిపారు.

మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో నటుడి అరెస్టు

ముంబై : మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో నటుడు సాహిల్ ఖాన్‌ను ముంబై పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మధ్యంతర బెయిల్‌కు ముంబై కోర్ట్ నిరాకరించడంతో సాహిల్ పరారయ్యాడని పోలీసులు తెలిపారు. ఛత్తీస్ గఢ్ పోలీసుల సహాయంతో 40 గంటలపాటు సాగిన ఆపరేషన్ తర్వాత అరెస్టు చేశామని వెల్లడించారు. ఆదివారం అతడిని ముంబైకి తరలించారు.

మణిపూర్‌లో మరోసారి కాల్పులు

ఇంఫాల్ : మణిపూర్‌లో ఆదివారం మరోసారి కాల్పులు చోటుచేసుకున్నాయి. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో ఆదివారం ఉదయం కుకీ, మెయితీ గ్రూపులకు చెందిన వాలంటీర్ల మధ్య కాల్పులు జరిగినట్టు పోలీసులు తెలిపారు. కాంగ్‌పోక్పి జిల్లా కౌత్రుక్ గ్రామంపై కొండపై నుంచి సాయుధ దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని చెప్పారు. కొన్ని బుల్లెట్లు గ్రామస్తుల ఇళ్లను నాశనం చేశాయన్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులను సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు తెలిపారు. స్థానికంగా తయారయ్యే పంపి అని పిలిచే మోర్టార్ షెల్స్‌ను గ్రామంపై ప్రయోగిస్తున్నారని పోలీసులు చెప్పారు. ఈ కాల్పుల్లో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఆ ప్రాంతంలో భారీగా భద్రతా బలగాలను మోహరించారు. ఈనెల 26న ఇంఫాల్ తూర్పు సరిహద్దులోని సినామ్ కోమ్ గ్రామంలో రెండు గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో 33 ఏళ్ల గ్రామ వాలంటీర్ మరణించిన సంగతి తెలిసిందే.

బడే భాయ్, చోటే భాయ్

మాటలు నమ్మి మోసపోవద్దు

ప్రజల గోస, ప్రజల భాష తెలిసిన వాళ్లను గెలిపించండి

- తెలంగాణ పుట్టుకనే అవమానించినోడు నరేంద్రమోడీ
- రేపు హైదరాబాద్‌ను కేంద్ర పాలితం చేయాలని ప్లాన్
- రేవంత్ రెడ్డివి అన్నీ చిల్లర మాటలు.. ఉద్దెర పనులు
- మే10న సిరిసిల్లలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షో : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ - వేములవాడ

"బడే భాయ్, చోటే భాయ్ మాటలు నమ్మి మోసపోకండి.. తెలంగాణ ప్రజల గోస, భాష, బాధ్యత తెలిసిన నాయకులనే ఎంపీగా గెలిపించుకోవాలి. రేవంత్ రెడ్డివి అన్నీ చిల్లర మాటలు.. ఉద్దెర పనులు.." అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతంగా మారకుండా ఉంచే శక్తి, మన అవసరాలు తీరకుండా గోదావరి జలాలను కావేరి, పెన్నా నదిలోకి వెళ్లకుండా అడ్డుకునే శక్తి.. ఒక్క బీఆర్ఎస్ పార్టీకే ఉందన్నారు. 2026 పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజనలో తెలంగాణకు అన్యాయం జరగకుండా ప్రశ్నించే శక్తి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చకుండా అడ్డుకునే శక్తి, బీజేపీ అరాచకాలను అడ్డుకునే శక్తి గులాబీ కండువాకు మాత్రమే ఉందని తెలిపారు. దాని కోసం పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని కోరారు. 2014 ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బడే భాయ్ నరేంద్ర మోడీ రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని తెలిపారు. పైగా తల్లిని చంపి, బిడ్డను వేరు చేశారనే మాటలు మాట్లాడి తెలంగాణ ప్రజలను మోడీ కించపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తా అన్న హామీ, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎటు పోయాయంటూ ప్రశ్నించారు. ఇక చోటే భాయ్ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి గద్దెనెక్కి, నేడు హామీలు అమలు చేయమంటే ఖజానా ఖాళీగా ఉంది అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడన్నారు. సచివాలయంలో లంకె బిందెలు ఉన్నాయనుకుంటే ఖాళీ కుండలు ఉన్నాయని, జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతా, నరుకుతా, చీరుతా, పేగులు తీస్తా అని హోదా మరచి మాట్లాడుతున్నాడని విమర్శించారు. గడిచిన ఐదేండ్లుగా ఎంపీగా ఉన్న బండి సంజయ్.. ఒక్కరూపాయి తెచ్చి అభివృద్ధి చేసింది లేదని, కొండగట్టు, వేములవాడ, ఇల్లందకుంట ఆలయాలకు ఒక్క రూపాయి తేలేదని, కేవలం ఓట్ల కోసమేనా దేశం, ధర్మం అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమకు బీజేపీతోనే పోటీ అని, అభ్యర్థి ఎవరో కార్యకర్తలకే తెలియని కాంగ్రెస్‌తో కాదన్నారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ముఖ్యంగా వినోద్ కుమార్ వంటి మేధావులు ఉంటే జరిగే లాభాలను ప్రజలకు వివరించాలని, ఎవరు ఎలాంటి విభేదాలు పెట్టుకోకుండా అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 10న సిరిసిల్లలో పార్టీ అధినేత కేసీఆర్ రోడ్ షో ఉంటుందని, ఈ కార్యక్రమానికి వేములవాడ నియోజకవర్గ నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) కార్యాలయానికి రఘురాంరెడ్డి రాక

- ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తాం : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నానాగేశ్వరరావు



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ఆదివారం ఉదయం సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంకు వచ్చారు. ఆయనకు సీపీఐ(ఎం) నాయకులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న సీపీఐ(ఎం) ఖమ్మం పార్లమెంట్‌లో తన విజయానికి మద్దతు ఇవ్వాల్సిందిగా జిల్లా నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్లుగా నియంతృత్వ పరిపాలన సాగిస్తూ దళితులు, మైనార్టీలు, రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థుల హక్కులను కాలరాస్తూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు పరుస్తోందన్నారు. మొదటి, రెండవ దశ పోలింగ్‌లో ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతతో కంగుతిన్న బీజేపీ నాయకులు దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్ మేనిఫెస్టోపై అక్కసు వెళ్లగక్కుతున్నారని తెలిపారు. మహిళల పుస్తెలతాళ్ళను, ప్రజల ఆస్తులను లాక్కొని ముస్లింలకు పంచుతారని తమ పార్టీపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. తనకు ఖమ్మం జిల్లా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, తాను గెలిస్తే జిల్లా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీజేపీని ఓడించేందుకు ఏర్పడిన "ఇండియా" కూటమిలో సీపీఐ(ఎం) ప్రధాన భాగస్వామి అని, అందులో భాగంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ పరిపాలనలో దేశంలో నిరుద్యోగం 47 ఏండ్ల గరిష్ట స్థాయికి చేరుకుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ప్రజల ఆదాయం బాగా తగ్గిపోయి, ఖర్చులు పెరిగిపోయి బతుకు దినదిన గండంలాగా మారిందన్నారు. ప్రభుత్వం కేవలం కార్పొరేట్లకు అనుకూలంగా మాత్రమే పరిపాలన సాగిస్తుందన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో కోట్ల రూపాయలు సేకరించి, అలా సేకరించిన అక్రమ సంపాదనతో రాష్ట్రాల్లో ఏర్పడిన ప్రభుత్వాలను అస్థిరపరచి కూలగొడుతోందని ఆరోపించారు. ప్రశ్నించిన ప్రతిపక్ష నేతలను అక్రమ కేసులతో అరెస్టులు చేస్తున్నదని తెలిపారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చివేసి మనుస్మృతినే రాజ్యాంగంగా ప్రకటించే ప్రమాదం ఉందని అన్నారు. ఇదే జరిగితే దేశంలో ఎవరికీ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ఉండవని చెప్పారు. నేడున్న పరిస్థితుల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడం అత్యంత ఆవశ్యకమని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, తుమ్మల యుగంధర్, జావీద్, మిక్కిలినేని నరేంద్ర, చావా నారాయణరావు, సైదాబాబు, బేబీ స్వర్ణకుమారి, సీపీఐ(ఎం) నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, వై.విక్రం, భూక్యా వీరభద్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, బండారు రమేష్, ఆర్.ప్రకాష్, దొంగల తిరుపతిరావు, డాక్టర్ భారవి, నంద్ర ప్రసాద్, వజినేపల్లి శ్రీనివాసరావు, బండారు యాకయ్య, వెల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌కు కేసీఆర్ కుటుంబం దూరం

- 2004 నుంచి 2019 వరకు వరుసగా పోటీ
- 15 ఏండ్లలో తొలిసారి తప్పుకున్న గులాబీ బాస్ ఫ్యామిలీ
- ప్రతిపక్షంలో ఉండటం వల్లే పోటీకి నై
- ఓటమి భయంతో కాడివదిలేసారా?
- బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి ఈ సారి కేసీఆర్ ఫ్యామిలీ దూరంగా ఉంది. ఇరవై ఏండ్లలో మొదటిసారిగా ఆ కుటుంబం నుంచి ఎన్నికల బరిలో నిలవడం లేదు. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం తర్వాత 2004 నుంచి 2019 వరకు జరిగిన అన్ని పార్లమెంట్ ఎన్నికల్లో ఆ కుటుంబం నుంచి ఎవరో ఒకరు పోటీలో ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత జైలులో ఉండటం, రాష్ట్రంలో అధికారంలో లేక పోవడం తదితర కారణాలతో పాటు ఓటమి పాలైతే పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతింటుందనే భయంతో మొదటి సారి బీఆర్ఎస్ అధినేత కుటుంబం పోటీకి దూరంగా ఉందని భావిస్తున్నారు.

రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది. రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను హైదరాబాద్ మినహాయించి మిగతా 16 స్థానాల్లో ముక్కోణ పోటీ జరుగుతోంది. బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ కుటుంబం పోటీలో లేకుండా మొదటి సారిగా పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఉప ఎన్నికలను కలుపుకుని పదేండ్లలో కేసీఆర్ మొత్తం ఐదు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2004లో జరిగిన ఎన్నికల్లో సిద్దిపేట ఎమ్మెల్యేగా, కరీంనగర్ ఎంపీగా పోటీ చేసి రెండు చోట్ల గెలుపొందారు. అనంతరం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎంపీగా కొనసాగారు. యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. తెలంగాణ ఏర్పాటు కోసం యూపీఏ నుంచి బయటకు వచ్చి ఎంపీ పదవికి రాజీనామా చేశారు.2006, 2008 ఉప ఎన్నికల్లో ఎంపీగా ఆయన వరుసగా విజయం సాధిం చారు.2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పొత్తుతో మహబూబ్ నగర్ నుంచి విజయం సాధించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానానికి గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసిన ఆయన రెండు చోట్ల గెలుపొందారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో ఎంపీ పదవికి రాజీనామా చేసి ఎమ్మెల్యేగా కొనసాగారు. ఇక అదే సమయంలో కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. 2018 రాజ్యసభ ఎన్నికల్లో కేసీఆర్ సమీప బంధువు జోగినపల్లి సంతోష్ కుమార్ బీఆర్ఎస్ తరపున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2019లో జరిగిన లోక్ సభ సాధారణ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి మరోసారి పోటీ చేసిన కవిత బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత నిజామాబాద్ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత అరెస్టు కావడంతో నిజామాబాద్ నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను బరిలోకి దింపింది. డిసెంబర్ 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసిన కేసీఆర్ గజ్వేల్‌లో విజయం సాధించగా కామారెడ్డిలో ఓడిపోయారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో తన కుటుంబ సభ్యులు పోటీ చేసి ఓడిపోతే రాజకీయంగా నష్టం జరుతుందని భావించిన ఆయన తన కుటుంబాన్ని ఎన్నికలకు కావాలనే దూరంగా ఉంచారనే చర్చ నడుస్తోంది. ఈ పరిణామాల పట్ల పార్టీ శ్రేణుల్లో ఒకింత ఆందోళన నెలకొంది.

ముస్లిం నాయకులే టార్గెట్

- ఆరుగురు కీలక నేతలపై 175 కేసులు నమోదు
- వీరిలో కాంగ్రెస్, బీఎస్పీ, ఎస్పీ లీడర్లు
- యోగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదీ పరిస్థితి



న్యూఢిల్లీ : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలకు రక్షణ కరువైంది. అంతేకాదు, మైనారిటీ వర్గం నుంచి వచ్చే నాయకులకూ రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తున్నాయి బీజేపీ ప్రభుత్వాలు. ఇందుకు యూపీలోని యోగి సర్కారే ప్రత్యక్ష ఉదాహరణ. ఇక్కడ యోగి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనారిటీ వర్గానికి చెందిన కీలక నాయకులను టార్గెట్ చేసుకున్నది. ఇందులో భాగంగా ఆరుగురు కీలక నాయకులపై 175 కేసులు నమోదు చేసింది. దీంతో సదరు నాయకులు అన్యాయంగా జైళ్లో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని సామాజికవేత్తలు చెప్తున్నారు. తమ వర్గం ప్రజలకు అండగా ఉండి ధైర్యం నింపే ఇలాంటి నాయకులపై కేసులు నమోదు చేసి, అరెస్టులు చేయించటం ద్వారా వారిని మానసికంగా దెబ్బతీసి ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించటమే యోగి సర్కారు లక్ష్యమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఐదేండ్ల క్రితం బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)కి చెందిన హాజీ యాకూబ్ ఖురేషీ మీరట్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందేందుకు బలమైన అవకాశాలు ఉన్నాయి. మే 25న, 28వ రౌండ్ ఓట్ల లెక్కింపులో మీరట్ మాజీ మేయర్, బీజేపీ అభ్యర్థి రాజేంద్ర అగర్వాల్ కంటే ముందంజలో ఉన్నారు. విజయం ఇక లాంఛనమేననుకొని బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచడం ప్రారంభించారు. వాట్సాప్‌లో మెసేజ్‌లు హల్‌చల్ చేయడం ప్రారంభించాయి. కానీ కొన్ని గంటల తర్వాత, ఖురేషీకి ఐదు లక్షలకు పైగా ఓట్లు వచ్చినప్పటికీ, అతను అగర్వాల్ చేతిలో 4,729 ఓట్ల తేడాతో ఓడిపోయాడు.బీజేపీ మద్దతుదారులలో కూడా.. ఎన్నికల "రిగ్గింగ్" జరిగిందని గుసగుసలు వినబడ్డాయి. మీరట్‌లోని ఒక సీనియర్ బీజేపీ నాయకుడు మాట్లాడుతూ.. "సుమారు ఐదు ఈవీఎంల ఓట్లను లెక్కించకపోవటంతో ఖురేషీ ఓడిపోయాడు. వాటిలో ఒక్కొక్కటి 1500 ఓట్లు ఉన్నాయి" అని చెప్పారు. ఆ ఎన్నికలో 370కి పైగా నియోజకవర్గాలలో పోలైన, లెక్కించబడిన ఓట్లలో అసమతుల్యత ఉన్నట్టు వార్తా కథనాలు వెలువడ్డాయి. ఐదేండ్ల తర్వాత ఖురేషిపై ఏడు కేసులు నమోదయ్యాయి. మొత్తం ఎనిమిది నెలల జైలు జీవితం గడిపాల్సిన పరిస్థితి ఆయనకు ఏర్పడింది. అయితే 2019 నుంచి, ఖురేషీతో సహా కనీసం ఆరుగురు ప్రభావవంతమైన ముస్లిం నాయకులపై పశ్చిమ యూపీలో యూపీ గ్యాంగ్‌స్టర్స్ అండ్ యాంటీ సోషల్ యాక్టివిటీస్ (నివారణ) చట్టం కింద కేసులు నమోదయ్యాయి. వీరిలో నలుగురు సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి చెందినవారున్నారు. వీరిలో గతంలో రెండు సార్లు ఎంపీగా గెలిచిన తబస్సుమ్ హసన్, ఆమె కుమారుడు, మూడుసార్లు కైరానా ఎమ్మెల్యేగా ఎన్నికైన నహిద్ హసన్, ఎస్పీ వ్యవస్థాపక సభ్యుడు ఆజం ఖాన్, ఆయన భార్య, మాజీ రాజ్యసభ ఎంపీ, ఎమ్మెల్యే తజీన్ ఫాత్మాలు ఉన్నారు. కాంగ్రెస్ నుంచి బిజ్నోర్ జిల్లా అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు షెర్బాజ్ పఠాన్ పైనా కేసు నమోదైంది. వారిపై గ్యాంగ్‌స్టర్స్ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. తబస్సుమ్, నహిద్ మినహా మిగతావారి కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, 2024 లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం చేస్తున్నప్పుడు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పశ్చిమ యూపీలో తన ర్యాలీలలో ప్రభావవంతమైన ముస్లిం నాయకులపై తన ప్రభుత్వ చర్యను సమర్థించుకోవటం గమనార్హం.

నేతలకు జైలు నుంచి వీసీ ద్వారా ఎన్నికల ప్రచారానికి అనుమతించాలి

- ఢిల్లీ హైకోర్టులో పిల్



న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టులో తమాషా అయిన ప్రజాహిత వ్యాజ్యం (పిల్) పడింది. అరెస్టయి జైళ్లలో ఉన్న రాజకీయ నాయకులను 2024- సార్వత్రిక ఎన్నికల్లో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా ప్రచారం నిర్వహించేందుకు అనుమతించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ కోర్టులో పిల్ దాఖలైంది. న్యాయవాది ఇమ్రాన్ అహ్మద్ ద్వారా న్యాయ విద్యనభ్యసిస్తున్న చివరి సంవత్సరం లా విద్యార్థి అమర్జీత్ గుప్తా ఈ వ్యాజ్యం వేశారు. జైలు నుంచి వీసీ ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, వ్యవస్థను నెలకొల్పేలా ఇసిని ఆదేశించాలని పిల్‌లో కోరారు. ఇదిలా ఉండగా రాజకీయ కక్షల కారణంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జైలులో ఉన్నారు. బెయిల్ కోసం ప్రయత్నించినా వారికి బెయిల్ రాలేదు. ఈ నేపథ్యంలోనే పిల్ దాఖలైనట్టు తెలుస్తోంది. కాగా రాజకీయాల్లో ఉంటూ నిజంగా తీవ్ర నేరాలు చేసి జైలుకెళ్లిన వారికి సైతం వీసీ. ద్వారా ప్రచారం నిర్వహించే వెసులుబాటు కల్పిస్తే ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, చట్టాల ఉల్లంఘన అవుతుందన్న అభ్యంతరం వ్యక్తం చేస్తున్నవారూ ఉన్నారు.

కేవలం 8శాతం మంది మహిళా అభ్యర్థులే..

- రెండు దశల్లో బరిలో దిగిన అతివలు..
- తమిళనాడు,కేరళలోనే అత్యధికం



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల మొదటి రెండు దశల్లో మొత్తం 2,823 మంది అభ్యర్థులలో కేవలం 8 శాతం మాత్రమే పోటీపడ్డారు. ఇది దేశంలో పాతుకుపోయి లింగవివక్షను ప్రతిబింబిస్తోందని పలువురు రాజకీయ విశ్లేషకులు, నిపుణులు పేర్కొన్నారు. మహిళా సాధికారత గురించి రాజకీయ నేతలు చెప్పేవన్నీ బూటకమని స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా ఏప్రిల్ 19న మొదటి దశ ఎన్నికలు జరగగా, ఏప్రిల్ 26న రెండవ దశ ఎన్నికలు జరిగాయి. మొదటి దశలో మొత్తం 1,625 మంది అభ్యర్థులు పోటీపడగా, రెండవ దశలో 1,198 మంది బరిలోకి దిగారు. వీరిలో మొదటి దశలో 135 మంది మహిళా అభ్యర్థులు పోటీ చేయగా, రెండవ దశలో 100 మంది బరిలో నిలిచారని, మొత్తం మీద రెండు దశల్లో కలిపి 235 మంది మహిళా అభ్యర్థులు ఉన్నట్టు తెలిపారు. అయితే ఆ సంఖ్య రాష్ట్రంలోని మొత్తం అభ్యర్థుల్లో కేవలం 8శాతం మాత్రమే.

మొదటి దశలో 135 మంది మహిళా అభ్యర్థులలో, తమిళనాడులో అత్యధికంగా 76 మంది మహిళా అభ్యర్థులతో మొదటి స్థానంలో నిలవగా, 24 మంది మహిళా అభ్యర్థులతో కేరళ రెండవ స్థానంలో నిలిచింది.

యువత క్రీడల్లో రాణించాలి

మాజీ కార్పొరేటర్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

యువత క్రీడల్లో రాణించాలి అని మాజీ కార్పొరేటర్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నాయిని నరసింహారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సరోజినీ క్రికెట్ స్టేడియంలో నిర్వహించారు ఈ పోటీలలో కంపెనీ తరపున నాలుగు జట్లు పాల్గొనగా షిఫ్ట్ నెంబర్ 3 విజేతగా నిలిచింది రన్నర్ కామన్ షిప్ విజేతగా నిలిచింది వారికి కంపెనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మెమొంటో అందజేశారు ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ ప్రభాకర్ బాబీ నరేందర్ గౌడ్ రవి యాదవ్ రణధీర్ రెడ్డి రాములు అతిక్ శంకర్ మధు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ షురూ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గోషామహల్ నియోజక వర్గంలో ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారం భమైంది. ఈ సందర్భంగా ఆదివారం ఓటర్ స్లిప్పులను ఓటర్లకు అం దించారు. అనంతరం స్టిక్కర్లను ఇంటి గోడలపై అంటివేస్తున్న జిహెచ్ఎంసి గోషామహల్ సర్కిల్ -14 అసిస్టెంట్ కమిషనర్ ఎం ఎన్ శైలజ, బిఎల్వో లు, జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మూఢనమ్మకాలను నిర్మూలించాలి

- ఆయుర్వేద వైద్యురాలు బి.విజయలక్ష్మి



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యార్థులు మూఢనమ్మకాలను నిర్మూలించడానికి శాస్త్రీయ విజ్ఞానం వైపు అడుగులు వేయాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ బి.విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జ్యోతిష్య విజ్ఞాన కేంద్రం వార్షికోత్సవ జ్యోతిష్య విద్యార్థుల అధ్యాపకుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ బి విజయలక్ష్మి, ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్త జాలా సోమనాథ శాస్త్రి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పప్పు రాజేశ్వరి అనువదించిన వైవాహిక జీవితం శాస్త్రీయ జాతక పోతన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. జ్యోతిష్య శాస్త్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మూఢనమ్మకాల వైపు ప్రయాణించకూడదన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీసి వారిని పరిపూర్ణత చేయడానికి జ్యోతిష్య శాస్త్రం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. జ్యోతిష్య శాస్త్రం మూఢనమ్మకాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించదు సైన్స్‌తో కూడిన విజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతిష్య శాస్త్ర నిపుణులు ముత్యాలప్ప శ్యాంప్రసాద్ బంగారు రావు, శ్రీధర్ సుజాత విజయలక్ష్మి శ్రీనివాస్ అనిల్ కుమా ర్ రాజేశ్వరి, వెంకట వేణు, శ్యామ్ సుందర్ విజయ శంకర్, రామ్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజస్థానీ ప్రవాసి సమ్మేళనం



- హాజరైన రాజస్థానీ పరిశ్రమ, వాణిజ్య, క్రీడలశాఖ మంత్రిరాజ వర్ధన్ సింగ్ రాథోడ్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

దేశం అభివృద్ధి కావాలంటే ప్రజలు మరోసారి నరేంద్ర మోదీప్రభుత్వాన్ని గెలిపించాలని కేంద్ర క్రీడాల శాఖ మాజీ మంత్రి, ప్రస్తుత రాజస్థాన్ రాష్ట్ర పరిశ్రమ వాణిజ్య, క్రీడల శాఖ మంత్రి రాజవర్ధన్ సింగ్ రాథోడ్ అన్నారు. ఆదివారం రాజస్థానీ ప్రవాసీ సమ్మేళనాన్ని బేగంబజార్ లోనీరాజధాని హోటల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి హైదరాబాద్ లోక్ సభ బిజెపి పార్టీ అభ్యర్థి కే మాధవిలత తో కలిసి ఆయన పాల్గొ న్నారు. ఈ సందర్భంగా రాజస్థాన్ మంత్రి రాజవర్ధన్ సింగ్ రాథోడ్ మాట్లాడుతూ..గత యూపీఏ సంకీర్ణ ప్రభుత్వంలో దేశంలో రక్షణ వ్యవస్థతోపాటు అన్ని రంగాలు భ్రష్టు పట్టాయని విమర్శించారు. పదేళ్ల మోడీ ప్రభుత్వంలో రక్షణ శాఖ ఆయుధాలను తయారు చేసే స్థాయిలో దేశం అభివృద్ధి చెందిందన్నారు. దేశం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజల బిజెపి పార్టీ కి ఓటు వేసి మూడోసారి నరేంద్ర మోడీ ని మూడవసారి ప్రధాని చేయాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి మాధవి లత మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంటు ప్రజలు 40 ఏళ్లుగా విసిగిపోయారన్నారు.

ఇప్పుడు బిజెపి వైపు ప్రజలు చూస్తున్నారని అన్నారు. ఎమ్ఐఎం ఎంఐఎం పార్టీ 40ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. హైదరాబాద్ పార్లమెంటు ఎంపీగా తనను గెలిపిస్తే పాత నగరాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. రాజస్థానీలకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు ప్రేమ్ సింగ్ రాథోడ్, శ్రీరాం వ్యాస్,ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు సోహన్ లాల్ , అవినాష్ దేవదా, అభిషేక్. మోహన్ గుప్తా మహేష్ బంగు వినోద్ జైన్, రాజస్థానీ సమాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి మరో రెండు వారాలే..!

- నామినేషన్లు ప్రక్రియ ముగియడంతో..
- స్పీడ్ పెంచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ముగింపు ప్రక్రియ పూర్తయింది. బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరనేది ఇప్పటికే తెలిపోయింది. స్వతంత్రులు, రిజిస్టర్డ్, రికగ్నైజ్డ్ పార్టీల అభ్యర్థులు బరిలో నిలిచినప్పటికీ.. పోటీ మాత్రం ప్రధాన పార్టీల్లోనే అన్నట్టుగా క్షేత్రస్థాయి పరిస్థితులు ఉన్నాయి. ప్రధానంగా సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంల మధ్య పోటీ ఉండనుంది. ఈ పార్టీల అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సమావేశాలు, ఇంటింటి ప్రచారాల్లో నిమగ్నమయ్యారు. ఇక పోలింగ్‌కు రెండు వారాలే ఉండడంతో ప్రతి ఓటరును చేరేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు పక్కా ప్రణాళికతో ప్రచారాన్ని వేగిరం చేశాయి. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూనే.. మరోవైపు ప్రజలను నేరుగా కలుస్తూ.. ప్రత్యర్థి వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రచారాన్ని రక్తి కట్టిస్తున్నారు. అలాగే అగ్రనేతల సభల నిర్వహణకూ సన్నాహాలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్ని కల్లో గెలిచిన ఉత్సాహంతో కాంగ్రెస్, గెలవాలనే పట్టుదలతో బీఆర్ఎస్, సిట్టింగ్ స్థానాలను పదిలపరచుకోవాలనే యోచనలో బీజేపీ, ఎంఐఎంలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. నామినేషన్లు ప్రక్రియ ముగిసిన రోజు నుంచే పార్టీలు ప్రచారాన్ని జోరు పెంచాయి.

ఆరు గ్యారంటీలతోనే ప్రజల్లోకి..

2004, 2009 పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి వరుసగా రెండుసార్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ.. తిరిగి ఈ స్థానంలో పాగా వేయాలని చూస్తోంది. అదే సమయంలో హైదరాబాద్ లోక్‌సభ స్థానంపై కూడా దృష్టిసారించింది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీ వంద రోజుల్లో అమలు చేసిన ఆరు గ్యారంటీలనే ప్రధాన ప్రచారాస్త్రంగా మార్చుకోనుంది. రాష్ట్రంలో అయిదేండ్లు అధికారంలో ఉండే తాము ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని భరోసానిస్తూనే కొత్తగా పాంచ్ న్యాయ్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా దానం నాగేందర్‌ను బరిలోకి దింపింది. ఆయన ఇప్పటికే శాసనసభ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వ హిస్తూ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు. సెగ్మెంట్ల వారిగా ప్రచార రథాలను తిప్పుతున్నారు. డివిజన్ల వారీగా డోర్ టు డోర్ క్యాంపెయిన్‌కు రెడీ అయ్యారు. ఇక హైదరాబాద్ స్థానానికి వలీవుల్లా సమీర్ పేరు తాజాగా ప్రకటించడంతో ఆయన ఇప్పుడిప్పుడే జనంలోకి వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు.

కాంగ్రెస్ వందరోజుల పాలనే.. బీఆర్ఎస్ ప్రచారాస్త్రం!

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా బీఆర్ఎస్ పార్టీ ముఖ్య సమావేశాలు పూర్తి చేసింది. ఏడు స్థానాల్లో నాంపల్లి, ఖైరతాబాద్ మినహా మిగతా అయిదింటిలో వారి ఎమ్మెల్యేలే ఉండడంతో సెగ్మెంట్‌ల వారీగా సమావేశాలు సైతం పూర్తిచేసింది. ఎమ్మెల్యేలతో సహా సీనియర్ నాయకులు, క్యాడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేసింది. ఇదిలావుంటే ప్రచారంలో భాగంగా.. కాంగ్రెస్ వంద రోజుల పాలన, పథకాల అమలులో లోపాలే అస్త్రాలుగా బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. ఇక బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు గౌడ్ నామినేషన్ ముందు వరకు ప్రచారాన్ని నెమ్మదిగా ప్రారంభించినా.. ఆయన ఇప్పుడు సెగ్మెంట్‌ల వారీగా ప్రచార జోరు పెంచారు. ఎన్నికల ప్రచార పాదయాత్ర పేరిట ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కో రోజు ప్రచారాన్ని నిర్వహిస్తు.. ఓటర్లను కలుస్తున్నారు. ఈ ప్రచార పాదయాత్రలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కో-ఆర్డినేటర్లు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గనేలా చూసుకుంటున్నారు. పోలింగ్‌కు సమయం దగ్గరపడ డంతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్, సభల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ.. సికింద్రాబాద్ స్థానంలో గెలుపే లక్ష్యంగా క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. హైదరాబాద్ పార్లమెంట్‌కు బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్ సైతం పచారాన్ని ముమ్మరం చేశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రచారానికే ఆదరణ

సికింద్రాబాద్ పార్లమెంట్ సిట్టింగ్ స్థానాన్ని మరోసారి నిలుపుకునేందుకు బీజేపీ తీవ్రంగా శ్రమిస్తోంది. ఇక్కడి నుంచి పోటీలో మరోసారి కిషన్ రెడ్డి బరిలో ఉన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌తో పాటు హైదరాబాద్‌పైనా ఆ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రచారం సందర్భంగా అభ్యర్థులు అభివృద్ధి కంటే కూడా.. కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు ప్రధాని మోడీ చరిష్మా, అయోధ్య రామమందిర నిర్మాణం వంటి అంశాలతో ఓట్లు అడిగే ప్రయత్నాలు చేస్తున్నారు. రోజుకో కార్యక్రమాన్ని తీసుకుంటూ జనంలోకి వెళ్తున్నారు. కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి వస్తున్నా ఆదరణతో పోల్చితే బీజేపీ అభ్యర్థికి తక్కువే. మరో రెండు వారాల్లో పోలింగ్ ఉండడంతో వచ్చే నెల మొదటివారంలో ప్రధాని మోడీ, ఇతర కేంద్రమంత్రులు, ముఖ్యనేతలతో ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రచారానికి సన్నహాలు చేస్తుంది. ఇదిలావుంటే హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఎంఐఎం సిట్టింగ్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ మరోసారి బరిలో నిలువగా..కాంగ్రెస్ నుంచి వలీవుల్లా సమీర్, బీఆర్ఎస్ నుంచి గడ్డం శ్రీనివాస్ యాదవ్, బీజేపీ నుంచి మాధవీలత పోటీలో ఉన్నారు. ముస్లిం మైనార్టీ ఓటు బ్యాంకు ఎక్కువగా ఉన్న ఈ ఎంపీ నియోజకవర్గంలో అసదుద్దీన్‌కే గెలుపునకే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలి



138వ మేడేను జయప్రదం చేయండి

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ

నవ తెలంగాణ - ముషీరాబాద్

బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలి 138వ. మేడేను జయప్రదం చేయండి అని ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ పిలుపునిచ్చారు. ఆదివారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్ లో ఐఎఫ్ టి యు ఆధ్వర్యంలో మేడే138 వ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ రాష్ట్ర సహకార దర్శి వై గీత మాట్లా డుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో 10 సంవత్సరాల పాలనలో పరిశ్రమల మూతపడి కార్మికుల బజార్నపడి కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు కరువై కోర్టు తీర్పులను పక్కనపెట్టి ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులను కట్టు బానిసలుగా చేసే కుట్రకు వడిగట్టిందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతులను మోసం చేశాడన్నారు. కులం పేరుతో మతం పేరుతో రాముడు దేవుడి మందిరాల పేరుతో ప్రజల్ని మరొకసారి మోసం చేయడానికి అనేక మాయ మాటలు చెబుతూ మన ముందుకు వస్తున్నారు ఇలాంటి మోసపూరితమైన బిజెపి నరేంద్ర మోడీ మాటలు ప్రజలు కార్మికులు రైతులు నమ్మవద్దని అన్నారు.దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య ఐక్యతను శ్రమజీవుల మధ్య ఐక్యత పై దాడి చేస్తుందన్నారు కార్మిక వర్గం ఇటువంటి విభజన విధానాలను తిప్పికొట్టాలని బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని కార్మిక చట్టాల రద్దు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటీకరణ వంటి కార్మిక వ్యతిరేక విధానాలపై కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, స్కీం రంగాల కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కార్మిక వర్గం ఐక్యతను విస్తృతం చేసి బలమైన కార్మిక పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఐఎఫ్టియు గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు మణెమ్మ, నాయకులు సరోజ, ప్రమీల, సుజాతపాల్గొన్నారు.

దోస్త్ కేవలం కార్పొరేట్ ఆటానామస్ కళాశాలలకే

టిఎస్ ఎఫ్ అధ్యక్షులు జంపాల రాజేష్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్స్ కోసం ఏర్పాటు చేసిన దోస్త్ కేవలం కార్పొరేట్ , అటానామస్ కళాశాలలకే దోస్త్‌గా మారిందని ఓయూ జేఏసీ ఫౌండర్, టీఎస్ఎఫ్ అధ్యక్షులు జంపాల రాజేశ్ ఆరోపించారు. ఆదివారం ఆయన కోఠి లో మాట్లా డుతూ.. రాష్ట్రంలో విద్యార్థులు ఒకవైపు ఎంసెట్ పరీక్షకు ప్రిపేర్ అవుతుంటే వారిని గందరగోళం లో పడేసాల ఎంసెట్ పరీక్ష కాకముందే దోస్త్ నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల విద్యార్థులు ఎటు తేల్చుకోలేక పోతున్నారు అన్నారు. ఇలా ముందే దోస్త్ ఇవ్వడం వల్ల కార్పొరేట్, అటానామస్ కళాశాలు, హైదరాబాద్ లో వుండే కళాశాలల్లో ముందే సీట్లు నిండి గ్రామీణ ప్రాంత కళాశాలు పూర్తిగా నష్టపోతున్నాయి అన్నారు. ఎంసెట్ తరువాత దోస్త్ ఇస్తే విద్యార్థికి కొంత స్పష్టత వచ్చి డిగ్రీలో సీటును ఉపయోగించు కుంటారన్నారు. ప్రస్తుత సంవత్సరం విపరీతంగా ఎండలు ఉండడం, మే 13 న పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున చాలా యూనివర్సిటీల్లో 2,4 సెమిస్టర్ విద్యార్థులకు సెలబస్ పూర్తికాక పోవడం, వార్షిక అఫీలియేషన్ ప్రక్రియ పూర్తి కాక పోవడం, కొత్త కోర్సులు, పాత కోర్సుల మార్పులకు ఇంకనూ నోటిఫికేషన్ ఇవ్వనందున ఈ సారి దోస్త్ నోటిఫికేషన్ మే 15 తరువాత ఇవ్వాలని అన్నారు.రాష్ట్రం లో ప్రైవేట్ కళాశాలలు అందునా గ్రామీణ ప్రాంత కళాశాలలు హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చినా చైర్మన్ ను కాదని గత ప్రభుత్వం లాగానే ఈసారి మొండిగా మే 1 నే దోస్త్ నోటిఫికేషన్ ఇవ్వడానికి నిర్ణయించడం ప్రైవేట్ కళాశాలలను పూర్తిగా విస్మరించడమే అని మండి పడ్డారు. అసలే గత 2 సంవత్సరాలనుండి ఫీజు రీయంబర్స్ రాక మూత పడే దశకు వచ్చిన కళాశాలలను కాపడాల్సిన ప్రభుత్వం కేవలం కొందరి కళాశాలలకు మేలు చేసేలా ఆలోచించడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని పునరాలోచించాలని ప్రభుత్వాని కోరారు.

రైల్ ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

గుర్తుతెలియని రైల్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆఫీస్ నగర్ చంద్ర నగర్ మధ్య ఆదివారం రైల్ పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు సమాచారం అందించారని చెప్పారు. అ వ్యక్తి వయసు 30-35 ఉంటాయన్నారు. అతని ఎడమచేతి పై పచ్చబొట్టు టి టి అక్షరాలు ఉన్నాయన్నారు. మిగతా వివరాల కోసం ఫోన్ నెం.9866357238,04023202238 ను సంప్రదించవచ్చని చెప్పారు.

ముందస్తు వైద్య పరీక్షలు ఆరోగ్యానికి ఎంతో మేలు

ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్స్ డా.సమీర



నవతెలంగాణ-బంజారా హిల్స్

కంజెర్ల లక్ష్మీ నారాయణ యాదవ్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉచిత వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఆదివారం సనత్ నగర్ లో ఏర్పాటు చేశారు. ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ డా.సమీర, నేతృత్వంలో షుమారు 150 మందికి పైగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు బీపీరక్త పరీక్ష, షుగర్ పరీక్షలతో పాటూ ఇతర సాధారణ పరీక్షలను సిబ్బంది నిర్వహించారు. అనంతరం వారి పరీక్షా ఫలితాలను అనుసరించి వైద్యులు అవసరమైన వారికి వైద్య సలహా, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారి నుద్దేశించి డా.సమీర మాట్లాడుతూ నిరంతరం ఆరోగ్యాన్ని జాగ్రత్తగా గమనించుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. వయస్సు పై బడే కొద్దీ కొన్ని రుగ్మతలు శరీరాన్ని ఇబ్బంది పెడుతూ ఉంటాయని వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తే అవసరమైన వేళ స్వంత వైద్యం చేసుకోకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. ధూమపానం, త్రాగుడు లాంటి వ్యవసనాలకు దూరంగా ఉండి నిరంతర వ్యాయామం, మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ గౌడ్తో పాటూ పలువురు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మరియు ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ కు చెందిన డా. సమీర, జనరల్ ఫిజిషియన్ తో పాటూ నర్సింగ్ సిబ్బంది దుర్గ, సైదాబీ, సునీత, సోనీలతో పాటూ ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ క్యాంపు కో ఆర్డినేటర్ పెంచల్ రెడ్డి పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో శాస్త్ర సాంకేతిక రంగాలను విస్మరిస్తున్నారు





- సమాజంలో పెరుగుతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం
- మరోవైపు గ్రామాలను పట్టిపీడిస్తున్న మూఢనమ్మకాలు
- జన విజ్ఞాన వేదిక 18వ మహాసభలో వక్తలు

నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రభుత్వాలు ప్రవేశపెట్టి బడ్జెట్ కేటాయింపుల్లో శాస్త్ర సాంకేతిక రంగాలను విస్మరిస్తున్నాయి. సమాజంలోశాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న. మరో వైపు గ్రామాలను మూఢనమ్మకాలు పట్టిపీడిస్తున్నాయి అని పలువురు వక్తలు తెలిపారు.జన విజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర 18వ మహాసభలు ఆదివారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా బిట్స్ పిలాని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ భీమేశ్వర్, సీసీఎంబీ రీసెర్చ్ స్కాలర్ ఆదిత్య ఉంద్రు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రాజకీయ పార్టీలు అమలు గాని హామీలను మేనిఫెస్టోలో చేర్చుతున్నాయని అన్నారు. ఉచితల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. మేనిఫెస్టోలో రాజకీయ పార్టీలు ఉచితలంటూ ఊదరగొడుతూ ఓట్లు పొందుతున్నాయని తీరా వారి అవసరాలు తీరిన తర్వాత ప్రజలను పూర్తిస్థాయిలో విస్మరిస్తూ వారి కనీస అవసరాలను కూడా లెక్క చేయడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను తుంగలో తొక్కి చేసిన హామీలను విస్మరిస్తూ ప్రజలకు శతగోపం పెడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టి బడ్జెట్ కేటాయింపుల్లో శాస్త్ర సాంకేతిక రంగాలను విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశోధనలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. విశ్వవిద్యాలయాల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం లేదని చెప్పారు. అశాస్త్రీయ భావాలను సిలబస్ లో చేర్చుతున్నారని అన్నారు.బీహార్ మహారాష్ట్ర తరహాలో మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తీసుకురావాలని సమాజంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న. మరోవైపు గ్రామాలను మూఢనమ్మకాలు పట్టిపీడిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి మూఢనమ్మకాలపై ప్రత్యేకంగా పోరాడాలని శాస్త్రీయ దృక్పథంతో సమాజంలో మూఢనమ్మకాలను పారదోలుతూ చైతన్యం వైపు తీసుకురావాలన్నారు. పాలకులు మూఢనమ్మకాల పేరుతో ప్రజలను బానిసలుగా చేస్తున్నారని మూఢనమ్మకాలు నిర్మూలం అయితే ప్రజల్లో చైతన్యవంతం అయితారని వారిలో ప్రశ్నించే తత్వం పెంపొందుతుందని మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్నారని తెలిపారు. సమాజంలో జరిగే మంచి చెడు లపై విద్యార్థులు ప్రత్యేక అవగాహన పెంచుకొని సమాజ హితం కోసం తమ వంతుగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ ఏ రామచంద్రయ్య, అనంద్ కుమార్, రాజా, మోహన్, జగన్మోహ్మనావు, మమత, విజయ లక్ష్మి రజిని, నగర నాయకులు లింగస్వామి, భీమేశ్వర్, చంద్రశేఖర రావు, అల్తాఫ్, సాయి, విద్యాసాగర్, సరిత తదితరులు పాల్గొన్నారు.అనంతరం మహాసభ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది నూతన అధ్యక్షులుగా డాక్టర్ భరత్ ప్రధాన కార్యదర్శిగా ఎం రవీంద్ర బాబు ఎన్నికయ్యారు 11 మంది ఆఫీస్ బేరర్లుగా మరో 12 మంది కమిటీ సభ్యులుగా మహాసభ మొత్తం 23 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఆది వారం బంజారాహిల్స్‌లోని పోలీస్ కమిషనరేట్ కార్యాల యంలో పోలీస్ కమిషనర్ కొత్త కోట శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్, ఎన్నికల అబ్జర్వర్లు పాల్గొన్నారు. ఎన్నికలు తీసుకుం టారు భద్రతపై పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రత, చర్చించారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో



బీఆర్‌ఎస్‌తోనే జవహర్‌నగర్ అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-జవహర్ నగర్

బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోనే జవహర్ నగర్ అభివృద్ధి చెందిందని మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కొరకు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 11, 23 డివిజన్‌లలో కార్పొరేటర్లు మునిగాల సతీష్ కుమార్, జిట్టా శ్రీవాణిలతో కలిసి ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డి ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు శోభా రెడ్డి, సీనియర్ నాయకులు జిట్ట శ్రీనివాస్ రెడ్డి, శ్రీరాములు, మహిళా నాయకురాలు మమత, మరియు ఉద్యమకారులు నరేష్, రమేష్ చారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని న్యూ రాంనగర్, అన్నపూర్ణ కాలనీ, సాయి రామ్ నగర్ కాలనీ, ధర్మపురి కాలనీలో కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నల గీత ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కారు గుర్తుపై ఓటు వేసి కేసీఆర్‌ని బలపరచాలని డివిజన్ అధ్యక్షు కార్యదర్శులతో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటికి కరపత్రం ఇస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రచారంలో భాగంగా కెసిఆర్ పాలనలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాల తోటి ఆనందంగా ఉండేవారని, అబద్ధపు వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, ఉద్యమ కారులు, మహిళ నాయకురాలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను సమాధి చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-సిటీబ్యూరో/అల్వాల్

దేశాన్ని దోచుకున్న బీజేపీ, రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్‌ను మే 13న జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో సమాధి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం రక్షణ కోసం 'ఇండియా' కూటమిని గెలిపించాలని అయన కోరారు. ఆల్వాల్ లోతుకుంట లోని శుభశ్రీ గార్డెన్స్‌లో ఆదివారం సీపీఐ మేడ్చల్-మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి డి.జి.సాయిలుగౌడ్ ఆహ్వానం పలుకగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజలమధ్య విద్వేషాలు సృష్టిస్తూ బీజేపీ తన సమాదిని తానే తవ్వుకుంటుందన్నారు. ఎన్నికలను హిందూ-ముస్లిం యుద్ధంగా మార్చాలని ప్రధాని మోడీ భావించి, విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగం, అధిక ధరలు, రైతుల కష్టాలపై ప్రధాని స్పందించడం లేదన్నారు. బీజేపీ మరోసారి అధికారం చేజిక్కించుకోవడానికి కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేయడం, ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టడం, దేశ ప్రజల మధ్య చిచ్చు పెట్టడం చేస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎన్నికల పోరులో ఒకరిపై ఒకరు పోరాడుతున్నారనీ, వాస్తవానికి వారు కలిసి పనిచేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మతం పేరుతో ఓట్లు అడిగే బీజేపీని, అవినీతి బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ఓడించి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. 'ఇండియా కూటమి' బలపర్చిన కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి విజయానికి సీపీఐ శ్రేణులు గట్టిగా కృషి చేయాలని కోరారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ హామీలకు జవాబుదారీతనం లేదన్నారు. దేశ ప్రజలు బీజేపీని విశ్వశించడం లేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి..? రైతుల ఆదాయం రెట్టింపు ఏమైంది..? 50శాతం లాభంతో రైతులకు కనీస మద్దతు ధర ఏమైంది..? ప్రతి పౌరుని ఖాతాలో రూ.15 లక్షలు ఏమాయే..? 2022 నాటికి 100 స్మార్ట్ సిటీలు, బుల్లెట్ రైళ్లు, గంగానది ప్రక్షాళన, ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఏమైయ్యాయని ప్రశ్నించారు. దేశంలో మైనార్టీలు, మహిళలు, దళితులు, ఆదివాసీలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. మొత్తం దేశ సమాజం బీజేపీ పాలనలో సురక్షితంగా లేదన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే మోడీ పూర్తి స్థాయి నియంతలా మరి ప్రజల స్వేచ్ఛ, హక్కులను కాలరాస్తారనీ, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఉండనీ, కేవలం నియంతత్వ పాలన మాత్రమే కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వాన్ని కాపాడుకోవాల్సిన తక్షణ అవసరం ఉందన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను చిత్తుగా ఓడించి, రాజ్యాంగాన్ని రక్షిస్తామని హామీ ఇస్తున్న 'ఇండియా కూటమి' అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పట్నం సునీతా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం స్పష్టమైన రోడ్ మ్యాప్‌తో పాటు రైతులు, కార్మికులు, మహిళలు, యువత జీవితాలను మెరుగుపరిచేందుకు 25-పాయింట్‌ల కాంక్రీట్ ప్రోగ్రామ్‌తో కాంగ్రెస్ స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు. తనను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్.బాలమల్లేష్ మాట్లాడుతూ పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి సీపీఐ నుంచి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో దాదాపు లక్ష మంది సీపీఐ ఓటు బ్యాంకు ఉందనీ, తమ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే ఇంటింటి ప్రచారం ప్రారంభించారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రవీంద్ర చారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శులు జి.దామోదర్ రెడ్డి, ఈ. ఉమామహేష్, తదితరులు పాల్గొన్నారు.

గల్లిగల్లీలో హోరెత్తిన గులాబీ ప్రచారం



నవతెలంగాణ-కాప్రా

మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా డా.ఏ.ఎస్ రావు నగర్ డివిజన్ లోని జై జవాన్ కాలనీలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ కసాం మహిపాల్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, రహీం, శిరీష, మనేమ్మ పద్మ, శ్రావణ్, రాములు, యాదగిరి, రమా తులసి, మురళి పంతులు, శోబా రాణి, గోలి శ్రీను, చిన్నారావు, కుమార స్వామి బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-కాప్రా

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా గెలుపే లక్ష్యంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలో డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అధ్వర్యంలో బ్యాంక్ కాలనీ, చండియా నగర్, వెంకటరమణ కాలనీలల్లో ప్రచారాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ స్థానిక డివిజన్ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకురాళ్లతో కలిసి ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని స్థానిక ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరంతరం వైద్య సేవలు అభినందనీయం



- నాగారం మున్సిపాలిటీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-కాప్రా

నిరంతరం వైద్య సేవలు అభినందనీయమని నాగారం మున్సిపల్ కౌన్సిలర్ మాది రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక కాప్రా, మల్కాజ్గిరి, కీసర మండల కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో 101వ మెడికల్ క్యాంపును నాగారం మున్సిపల్ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం చక్రిపురం చౌరస్తాలోని శ్రీ చక్రి విద్యానికేతన్ హైస్కూల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీపీ, షుగర్ పేషెంట్స్ కోసం నిరంతరం జేవీవీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దాదాపు 200 మందికి డాక్టర్ల సూచనల మేరకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విద్యాసాగర్ (హెల్త్ అడ్డా)ఎం.జయరాజ్, మనోహర్, మెడికల్ క్యాంపు ఆర్గనైజర్ జీకే రెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు పి. నాగరాజు, ఎం. శ్రీనివాస్, శేషు, వెంకటరమణ, వెంకట రామయ్య, నాగేశ్వరరావు, శివ శంకర్ రెడ్డి, నాగేశ్వరరావు, శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా పూడూరు రొండా మల్లారెడ్డి నియామకం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన సీనియర్ కాం గ్రెస్ నాయకుడు డాక్టర్ రొండా మల్లారెడ్డిని మెదక్ పార్లమెంట్ నర్సాపూర్ నియోజకవర్గ లోక్‌సభ ఎన్నికల సమన్వయకర్త (కోఆర్డినేటర్)గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ శనివారం ఉత్తర్వులు వెలువరించారు. ఈ సందర్భంగా ఆదివారం మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రొండా మల్లారెడ్డి మాట్లాడుతూ తన పై నమ్మకంతో నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా నియమించిన టీపీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడుగుతామని పేర్కొన్నారు.

ఘనంగా మార్కండేయ కళ్యాణం



నవతెలంగాణ-ఘట్కేసర్

మండలంలోని ఔషాపూర్ గ్రామంలో ఆదివారం సి మార్కండేయ స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా మచ్చ సదానంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కళ్యాణానికి భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అంగరంగ వైభవంగా మంగళ వాయిద్యాలతో ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణానికి భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు శ్రీనివాస్, సురేష్, బాలకృష్ణ, సైలాబ్ రెడ్డి, మచ్చ సురేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ నగర్ ఫేస్ 1 నూతన అధ్యక్షుడిగా శామల బిక్షపతి

నవతెలంగాణ-కాప్రా

సోనియాగాంధీ నగర్ ఫేస్1 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం కాలనీలో ఎన్నికల అధికారి ఎమ్మెస్ చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడు ప్యానలు పోటీ పడగా శమల బిక్షపతి ప్యానల్ అత్యధిక మెజారిటీతో గెలుపొందింది. అధ్యక్షుడిగా శ్యామల బిక్షపతి, ఉపాధ్యక్షులు పారుపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుల గోపాల్, కోశాధికారి చింతల వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌లు గెలుపొందారని ఎన్నికల ఇన్‌చార్జీ తెలియజేశారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలి

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పీర్జాదిగూడ కార్పొరేషన్ 14వ డివిజన్ కార్పొరేటర్ పాశం శశిరేఖ బుచ్చియాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి వందలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా డివిజన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ డివిజన్‌లో పార్కులలో అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించడానికి సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, సీనియర్ నాయకులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి పన్నాల శ్రీనివాసరెడ్డి, మహిళా అధ్యక్షురాలు శ్రీలత బద్రి నాయక్ , పాశం రాజు యాదవ్, లక్ష్మణ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లోనే ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ సర్కారు

- మల్కాజిగిరి పార్లమెంటులో గులాబీ జెండా ఎగరడం ఖాయం
- బోడుప్పల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కారు నాలుగు నెలల్లోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందని మాజీ మంత్రి, చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అహర్నిశలు చేసిన కృషి కారణంగానే తెలంగాణ సుభిక్షంగా ఉందని కానీ అమలుకు నోచుకోని అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేవలం నాలుగు నెలల్లోనే భ్రమలు తొలగిపోయాయని మల్లారెడ్డి అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు తెలంగాణ రాష్ట్రానికి పూర్తి స్థాయిలో అన్యాయం చేసిందని తెలంగాణకు రావాల్సిన నిధుల విషయంలో కూడా పూర్తి స్థాయిలో అన్యాయం చేసి నేడు అదే తెలంగాణ ప్రజలను ఏం ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. మల్కాజిగిరి పార్లమెంటుపై గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, 11వ డివిజన్ కార్పొరేటర్ కొత్త శ్రీవిద్య, నగర ప్రదాన కార్యదర్శి మీసాల కృష్ణ, సీనియర్ నాయకులు కొత్త చక్రపాణిగౌడ్,డివిజన్ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, నాయకులు ఎండీ అలీం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు యోగ సాధన చేయాలి

- యోగ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ పొందిన శంకరాచారి



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రోజు యోగా సాధన చేయాలని యోగ గురువు శంకరాచారి అన్నారు. జవహర్ నగర్ కు చెందిన జర్నలిస్ట్ శంకరాచారి ఉత్తరాఖండ్ రాష్ట్రంలో యోగ నగరిగా పిలువబడే రిశికేశ్ లోని అప్పర్ తపోవన్ లో నెల రోజులపాటు ప్రముఖ యోగ ఆశ్రమమైన రుద్రయోగ్ పీట్‌లో ప్రసిద్ధి చెందిన యోగ గురువు గగన్ జైన్ వద్ద హఠ యోగవిద్యను, అనుజ్ ఆచార్య వద్ద అష్టాంగ యోగవిద్య, అజయ్ ఆచార్య వద్దనుండి పతంజలి యోగను విజయవంతంగా పూర్తి చేసుకుని అంతర్జాతీయ యోగ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్‌ను పొందారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నేను నేర్చుకున్నది అణువంత నేర్చుకోవాల్సింది కొండంత ఉందని, నిత్య విద్యార్థిగా ఉంటూ నేను నేర్చిన యోగ విద్యను పదిమందికి నేర్పుతూ వారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని పంచే ప్రయత్నం చేస్తానన్నారు. ప్రతి ఒక్కరూ అను నిత్యం సోమరితనం లేకుండా యోగసాధన చేయడం వలన సంపూర్ణ శారీరక మానసిక ఆరోగ్యంతోపాటు ఆనందాన్ని, ప్రశాంతతను పొందవచ్చునన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ విస్తృత ప్రచారం



నవతెలంగాణ-జవహర్‌నగర్

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపిస్తామని జవహర్ నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం జవహర్ నగర్ లోని పలు డివిజన్లలో గడపగడపకు తిరిగి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారానికి వెళ్లితే బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో..

మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలుపే ధ్యేయంగా పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్ లలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ గడచిన పది సంవత్సరాలలో మోడీ ప్రభుత్వం దేశానికి ఒరగబెట్టింది ఏం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కార్పొరేటర్ పల్లపు రవి, పార్టీ ఉపాధ్యక్షులు మాట్ల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ బొబ్బిలి మంజుల, నాయకులు మెట్టు వెంకన్న, గజ్వేల్ శంకర్, యాక చారి, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మల్కాగిరిలో ఈటల ముమ్మర ప్రచారం

- బీజేపీ మేడ్చల్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గ ప్రజల గుండె చప్పుడును దేశ అత్యున్నత చట్టసభలో వినిపించబోతున్న ఈటల రాజేందర్ గెలుపును ఎవరు ఆపలేరని మేడ్చల్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లోని 89,90బూత్‌ల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, విష్ణుమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్ కార్యక్రమంలో పాల్గొని మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కు మద్దతుగా మున్సిపల్ అధ్యక్షుడు అంజనేయులుతో కలిసి గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభంజనం కొనసాగుతుందని ఈసారి 400 లోక్ సభ స్థానాలు బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు హేమలత రెడ్డి,ప్రధాన కార్యదర్శి జకట ప్రేమ్ దాస్,లవంగ శ్రీకాంత్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, అంజిరెడ్డి, రవీందర్ రెడ్డి, సత్యనారాయణ చారి, శ్రీనివాస్ రెడ్డి, ఛీర్ల సత్యనారాయణ,హన్మంత్ రెడ్డి,అనిల్ రెడ్డి,బిక్షపతి గౌడ్,వంగేటీ మల్లారెడ్డి, బాబు గౌడ్,ముక్కెర మురళీ,మైసరి రాజు,శ్రీనివాస్ గౌడ్, బాలకృష్ణ,రాజు ముదిరాజ్ యువ నాయకులు రాఘవ రెడ్డి,రాగం అర్జున్,వంశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై అధ్యయనం అవసరం

- ప్రొఫెసర్ డాక్టర్ రుక్మిణి



నవతెలంగాణ-కాప్రా

వాతావరణ మార్పుల అధ్యయనం పై జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీ మేధా విద్యా మందిర్ హైస్కూల్ ఈసీఐఎల్‌లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో నాల్గవ రోజు ఉస్మానియా యూనివర్సిటీ ఆస్ట్రోనామీ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రుక్మిణి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ఖగోళ శాస్త్రంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టెలిస్కోప్ ఉపయోగించి సూర్యుడిని గురించి, సూర్యుడిలో కనిపిస్తున్న బ్లాక్ హెూల్స్ గురించి, సూర్యుడిలో జరిగే అనేక రకాల రసాయన చర్యల గురించి తద్వారా సూర్యుడి నుంచి కాంతి ఏ విధంగా ఉత్పన్నమవుతుందో, సూర్యునిలో జరిగే విస్ఫోటనాల వల్ల కొన్నిసార్లు ఖగోళంలో అనేక మార్పులు సంభవిస్తాయని, ఈ సంవత్సరం ఫిబ్రవరిలో జరిగిన విస్ఫోటలాల వల్ల దాదాపు 20 సాటిలైట్స్ వరకు నాశనం అయ్యాయని, ఇలాంటి నష్ట నివారణ చర్యల కోసమై సూర్యుని గురించి అధ్యయనం అవసరమని విద్యార్థులకు సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్ష కోశాధికారులు టీ. శ్రీనివాస్ , జెన్ని మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న పెను మార్పులు, ఇంధన వాడకం, కాలుష్యం మన జీవితాలపై తీవ్ర ప్రభావం చూపెడుతున్నాయన్నారు. ఈ భూగోళంపై భవిష్యత్తు తరాల జీవనం కష్టతరంగా కానున్నదని అయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే స్వీడన్ కు చెందిన ఒక చిన్న బాలిక గ్రేటా తన్ బర్గ్ వాతావరణంలో మార్పుల మీద విస్తృతంగా కృషి చేస్తున్న విషయం మీకు ఇప్పటికే తెలుసు. ఇంధన రంగంలో విప్లవం రావాలని (శిలాజ ఇంధనాల స్థానంలో పునరుత్పాదక ఇందనాల వాడకం పెంచాలని), ఇంధన వనరులు ప్రపంచ ప్రజలందరికీ సమానంగా పంచాలని, సోషల్ జస్టిస్‌లా క్లైమేట్ జస్టిస్ కావాలని కృషి చేస్తున్నది మనమందరం కలిసికట్టుగా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొని వచ్చి ఈ వాతావరణం మార్పులను అరికట్టే విధంగా చట్టాలు తీసుకొచ్చే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని వారన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో జన విజ్ఞాన వేదిక నాయకులు పిట్టల నాగరాజు, శివకుమార్, పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు



నవతెలంగాణ-కీసర

బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు రామారావు అన్నారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని రాజీవ్ గృహ కల్పన కాలనీలో కాంగ్రెస్ పార్టీ మహిళ ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేతారాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో దమ్మాయిగూడ మాజీ సర్పంచ్ గండి యాదగిరి గౌడ్ దమ్మైగూడ మున్సిపల్ జనరల్ సెక్రెటరీ సంజీవరెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోవింద్ సింగ్ సమ్మిరెడ్డి దిలీప్ ,బాల్ రాజ్ , రమేష్ తాతారావు శ్రీనివాస్ సత్యనారాయణ హైమద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేద్దాం

- పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాల యంలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు బండారి రవీందర్ ఆధ్వర్యంలో నూతన సమన్వయ కమిటీల ఏర్పాటులో భాగంగా నిర్వహించిన సమావేశంలో 1వ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాలొన్ని సమగ్రంగా చర్చించి 1డివిజన్ నూతన అధ్యక్షుడిగా కె. ఆంజనేయులును ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నూతన కమిటీ సభ్యులను మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలియజేసి బీఆర్ఎస్ పార్టీ బలోపేతం చేయడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. జనరల్ సెక్రెటరీ జి.గోపాల్ రెడ్డి, యూత్ అధ్యక్షులు అక్షిత్ యాదవ్, జనరల్ సెక్రెటరీ రమేష్, ఎస్సి సెల్ అధ్యక్షులు రామకృష్ణ, ఎస్టీ సెల్ అధ్యక్షులు రామ్ నాయక్ సలహాదారు చిరంజీవులు, రమణ రెడ్డిలను ఎన్ను కున్నారు. తమ పై నమ్మకంతో ఈ అవకాశానికి కల్పించి నందుకు మేయర్, పార్టీ అధ్యక్షులు, కార్పొ రేటర్లు, డివిజన్ నాయకులకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగు మనోరం జన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షులు నిర్మల, పన్నాభాయ్, శ్యామల సాయిలు, నరసింహ, ప్రశాంత్, కైసర్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
సోమవారం | ఏప్రిల్ 29, 2024 | www.navatelangana.com



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో ఎల్.జి అపార్ట్‌మెంట్స్, వాసవి స్క్వేర్, బి.హెచ్.ఈ.ఎల్ ఆర్.డి అపార్ట్‌మెంట్స్ వాసులతో కలిసి బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్‌ను గెలిపించాలని ఎన్నికల ప్రచారంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో వెంకటేశ్వర రెడ్డి , వెంకట్ రెడ్డి , మహేష్, మూర్తి, శివ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బీఆర్ఎస్ శ్రేణుల ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు ఆదేశాల మేరకు మూసాపేట్ డివిజన్ అంబేద్కర్ నగర్, బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సప్పిడి శ్రీనివాస్, తుకారాం, విష్ణు, రాజు, ఈశ్వర్ ,రాము, అరుణ్, వెంకట్ స్వామి, పవన్,రవీందర్, కృష్ణ, రమేష్,వీరాచారి, దస్తగిరి,సతీష్, అర్జున్ ,సత్తయ్య, కోటి ,రమేష్, శ్యామల, హరిత,శాంత తదితరులు పాల్గొన్నారు.

రాగిడి గెలుపు 'మల్కాజిగిరి' అభివృద్ధికి మలుపు



- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజా సంక్షేమానికి పాటుపడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని.. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు మల్కాజిగిరి పార్లమెంట్ అభివద్ధికి మలుపు అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, అడ్వకేట్ ఎస్.కమలాకర్ అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడికి మద్దతుగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆదేశాల మేరకు ఆదివారం గాజులరామారం డివిజన్ లెనిన్ నగర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ కరపత్రాలను పంచారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా బస్తీలలో మౌలిక వసతులు కల్పిస్తూ అభివద్ధి చేసి నియోజకవర్గంలోని ప్రతీ ప్రాంతాన్ని ఆదర్శవంతంగా అభివద్ధి చేసిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు.కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. ఆరు గ్యారెంటీ ల పేరుతో రాష్ట్రాన్ని,ప్రజలను మోసం చేస్తున్నారని అటువంటి వారికి మనం ఓటు వేయడం అవసరమా అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ ఉపాధ్యక్షులు ఇబ్రహీం ఖాన్, స్థానిక కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తారా సింగ్,మహేష్,రామ్ రెడ్డి,శివ, బీఆర్ఎస్ నాయకులు మూసాఖాన్, చిన్న చౌదరి,రామ్ రెడ్డి, కూరపాటి కరుణాకర్ రాజు, పి. సమ్మయ్య యాదవ్, రాములు గౌడ్,ప్రవీణ్,శివ నాయక్,సూర్య నాయక్,చందు గౌడ్,సుంకరి సాయి చందు,ప్రసాద్,జునైద్,మహిళా నాయకురాలు కల్పన, సంధ్య రెడ్డి, రాజా బాయ్, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

- రెండు పార్టీలు ఒక్కటై ప్రజలను వంచిస్తున్నారు
- కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి
- కూకట్‌పల్లిలో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం





నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల సమయంలో తెరవెనుక లోపాయికారి ఒప్పందం చేసుకొని, ప్రజలను వంచిస్తున్నాయని కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కూకట్పల్లి డివిజన్ లో భారీ రోడ్డుషో నిర్వహించి అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని తెలిసి, బీజేపీ అభ్యర్థి ఈటల, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఒక్కటై కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ప్రతీ ఎన్నికల సమయంలో బయటకు తిట్టుకుంటూ లోపల మాత్రం కలిసి ఉంటారన్నారు. ఈ రెండు పార్టీలకు ఎన్నికల్లో మల్కాజిగిరి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. తనను గెలిపిస్తే రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారెంటీలతో పాటు, ఇండియా కూటమితో ఏర్పడే కేంద్ర ప్రభుత్వం నుంచి, పాంచ్ న్యాయ్ పథకాలను ప్రజలకు అందిస్తామని అన్నారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి మల్కాజిగిరిని అభివద్ధి చేస్తానని మాటిచ్చారు. ఇందుకోసం కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని కోరారు.

కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జీ బండి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ ఒకే పార్టీ ఉండడం ద్వారా అభివద్ధికి అధిక నిరుద్యోగులు కేటాయింప చేసుకోవచ్చన్నారు పార్లమెంట్ ఎన్నికల అనంతరం అన్ని స్థానిక సమస్యలను పరిష్కరిస్తామన్నారు. యువజన కాంగ్రెస్ కుకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సునీతా మహేందర్ రెడ్డి అత్యధిక భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని తెలిపారు. అనంతరం మియాపూర్‌లోని కల్వరి టెంపుల్ లో మూసాపేట్ లోని మరో చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకు ముందు రెయిన్ బో విస్టాలో ఓటర్లతో బ్రేక్ ఫాస్ట్ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డి, వినయ్ రెడ్డి, గొట్టిముక్కుల దేశాలు, భీమ్ రావు, తూ ము వేణు, నాగిరెడ్డి, గొట్టిముక్కుల వెంకట్, మేకల రమేష్, సత్యం శ్రీరంగం, గోవింద్ గౌడ్, వినయ్ రెడ్డి, శేరి సతీష్ రెడ్డి, కృష్ణవేణి వెంకటరావు, పుష్ప రెడ్డి, మైఖేల్, కృష్ణంరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శేరీ సతీష్ రెడ్డి,కర్క పెంటయ్య,సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

కాలనీ వాసుల సమస్యలపై చర్చించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ డివిజన్ పరిధిలోని శంశిగుడా, ఆదర్శ్ నగర్ కాలనీ పెద్ద మనుషులతో ఆదివారం సమావేశమై కాలనీ సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆదర్శ్ నగర్ కాలనీలో డ్రయినేజీ లైన్స్, తాగు నీరు సమస్య లను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నివాసాలు పెరిగి డ్రయి నేజీ లైన్ చిన్నగా ఉండడంతో, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అతి త్వరలో డ్రయినేజీ లైన్ సెక్షన్ చేయించి పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే తాగునీటి సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి ని, అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు మనందరం కషి చేయాలని కాలనీ వాసులను కోరారు. కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీకు మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, భాస్కర్, యాదగిరి, మోజెస్, పి.శ్రీను, సుందర్, ఉప్పలయ్య, బసప్ప, కాలనీ వాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మరో బిగ్ షాక్

- బీజేపీ తీర్థం పుచ్చుకోనున్న గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి..

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరో బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకులు,గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి బీఆర్ఎస్ పార్టీని వీడనున్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకులు, హెచ్.ఏ.ఎల్ బోర్డు మాజీ సభ్యులు డాక్టర్. సింగిరెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా సమక్షంలో తన అనుచరగనంతో బీజేపీ తీర్థం పుచ్చుకొనున్నారు. నియోజకవర్గంలోని గాజులరామారంలో తనదైన ముద్ర వేసుకున్న రావుల శేషగిరి ఒకసారి కౌన్సిలర్‌గా, మూడుసార్లు గ్రేటర్ కార్పొరేటర్ గా తిరుగులేని విజయం సాధించి నిత్యం ప్రజల మధ్య సేవకుడిగా పేరు తెచ్చుకున్నారు .ఒక్కసారిగా పార్టీని వీడుతున్నారని తెలుసుకొని డివిజన్ బీఆర్ఎస్ శ్రేణులు ఖంగుతిన్నారు.రానున్న రోజుల్లో బీజేపీలో కీలక వ్యక్తిగా రావుల శేషగిరి వ్యవహరించనున్నట్లు సమాచారం.భవిష్యత్తులో నియోజకవర్గ ఇన్చార్జిగా వ్యవహరించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

నిజాంపేట కామాక్షి బ్రాహ్మణ సంఘం విజయోత్సవ సభ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట రోడ్డులోని కామాక్షి బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో నిజాంపేట కామాక్షి బ్రాహ్మణ సంఘం విజయోత్సవ సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా రంగాల ప్రముఖులు సుబ్బరాయ శర్మ, చక్రవర్తి, వంశీకష్ణ, సుబ్రమణ్య కుమార్, గందూరి అరవింద్, జీఆర్‌కే మూర్తి, ఘంటసాల వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ పూదూరి శ్రీనివాస్, నర్సింహారావులు హాజరై మాట్లాడారు. సంస్కతీ సంప్రదా యాల పరిరక్షణ వేద ధార్మిక కార్యక్రమాల ద్వారా సంఘం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సంఘ అభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రామవరపు సుధాకర్, ఎస్.శంకర్, నర్సింహారావు, రామారావు, మహిళా విభాగం ప్రతినిధులు భువనేశ్వరి, కల్యాణి, రమణి, జయశ్రీ, అనిత, రమాదేవి, గాయత్రీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పీఆర్‌కే మూర్తి, సోమయాజులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కారు గుర్తుపై ఓటు వేద్దాం.. కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపిద్దాం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు.. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, గొట్టిముక్కుల పెద్ద భాస్కర్ రావు స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి వివేకానంద నగర్ డివిజన్, వెంకటేశ్వర్ నగర్ కాలనీలో గడపగడపకు వెళ్లి కరపత్రం అందజేసి, కారు గుర్తుపై ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్ ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరినాథ్, శ్రావణి రెడ్డి,లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ నాయకులు, కార్య కర్తలు, బస్తీ కమిటీ మెంబర్లు, ఉద్యమ కారులు,బీఆర్ఎస్ అనుబంధ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేయోభిలాషులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మేజార్టీతో గెలిపించాలి...

కేపీహెచ్‌బీ : బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ రాం నగర్ కాలనీలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటి కి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో పూర్తి స్థాయి మద్దతు కాసాని జ్ఞానేశ్వర్ కు ఉండాలన్నారు. అన్ని విధాలుగా అండగా ఉండి అఖండ మెజారిటీతో గెలిపించుకొని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని ముక్త కంఠంతో పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, శ్రేయభిలాషులు ,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



అతిపెద్ద డబుల్ డెక్కర్ అక్వాటన్నెల్ ఎక్స్‌పో షో



- చిన్నారులతో కలిసి కుటుంబమంతా సరదాగా గడిపే ఏకైక ఎగ్జిబిషన్
- నిర్వాహకులు..రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

దేశంలోనే అతిపెద్ద డబుల్ డెక్కర్ ఆక్వాటన్నల్ ఎక్స్ పో ను కూకట్ పల్లి వై జంక్షన్ హుడా ట్రాక్ పార్క్ లో ఏర్పాటు చేశామని నిర్వాహకులు రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శన జంట నగర ప్రజలను ప్రత్యేకంగా ఆకట్టుకుం టుందని, మరీ ముఖ్యంగా చిన్నా పిల్లలను అహ్లాదపరిచేందుకు, సముద్ర జలాల్లో చేసే స్క్యూబా డైవ్ ప్రదర్శనను ఇక్కడ ఏర్పాటు చేశామని, నిపుణులైన 15 మంది డైవర్ల ను టనల్స్ ద్వారా పిల్లకు చూపించడం జరుగుతుందన్నారు.భారతదేశంలోనే మొట్టమొదటి అతిపెద్ద ఎక్వా టన్నల్ ఇదేనని, సింగపూర్, మలేషియా, దుబాయ్ నగరాల్లో ఉన్నటువంటి టనల్స్‌ను రూ. 8 కోట్ల ఖర్చుతో ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎగ్జిబిషన్ లో దాదాపు 800 స్టాల్స్ తో వివిధ రాష్ట్రాలకు చెందిన హ్యాండీక్రాఫ్ట్, ఫర్నిచర్, ఇమిటేషన్ జ్యువలరీ, రాజస్థాన్ క్రాఫ్ట్, ఫుడ్ కోర్ట్ వంటి స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, వేసవిని దష్టిలో పెట్టుకొని పూర్తి ఏసీతో 60 రోజులపాటు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసా గుతుందని, వేసవి సెలవుల నేపథ్యంలో హైదరాబాద్ జంట నగర ప్రజలు ప్రతి ఒక్కరూ తమ ఎగ్జిబిషన్ ప్రదర్శనను చూసి ఆనందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



- కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, బీఆర్ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ బాలాజీనగర్ డివిజన్ లోని హ్యాబీబ్ నగర్, ఆంజనేయ నగర్‌లలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, కార్యదర్శి వెంకటేష్ చౌదరి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనితా శ్రీపాద, డివిజన్ మహిళా అధ్యక్షురాలు అరుణా శెట్టి, సీనియర్

3 నెలల్లో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం



- ఆడబిడ్డలకు ఫ్రీ బస్సు ఇచ్చాం
- రోడ్డు షో కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-అల్వాల్

మూడు నెలల్లో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగుల కుటుంబాల అందరి కండ్లల్లో ఆనందం చూసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్వీనగర్, కౌకుర్ బస్‌స్టాప్ వద్ద సీఎం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆడబిడ్డలకు ఫ్రీ బసు, పేదవాళ్లకు 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ మల్కాజిగిరి అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని గెలిపిస్తే మీ సమస్యలను పరిష్కరించేందు కృషి చేస్తారన్నారు. ఈటల రాజేందర్ ఏనాడైనా మీ సమస్యలను అడిగేందుకు ఇక్కడికి వచ్చారా అని అడిగారు. ఇక కేసీఆర్ కారు తూకానికి వెళ్లిందని.. అది తిరిగి రాదన్నారు. ఉద్యోగం ఊడిందనే కేసీఆర్ బస్సు యాత్ర పేరుతో కొంగ జపం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే పరోక్షంగా బీజేపీకి ఓటు వేసినట్టేనని తెలిపారు.

జోరుగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

129 సురారం డివిజన్ శ్రీరామ్ నగర్ ఈస్ట్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీ వెల్ఫేర్ సభ్యులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా కాలనీ సమస్యలపై అనుక్షణం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఎమ్మెల్యే కెపి వివేకానంద తమ వెంట ఉండి మౌలిక వసతులు అంచలంచెలుగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజా సంక్షేమం కోసం పాటుపడే బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.వెల్ఫేర్ అధ్యక్షులు సుధాకర్, అప్పారావు, రసూల్, నాగేశ్వర్ రావు, మహిళా అధ్యక్షురాలు హేమలత రెడ్డి, మాజీ వార్డుసభ్యులు అరుణ పాల్గొన్నారు.



గౌరీ సంఘం వారి ఆధ్వర్యంలో ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని సాయి నగర్ వెస్ట్ లోని శ్రీశ్రీశ్రీ ఎర్ర పోచమ్మ ఆలయం నుంఎతీ చిత్తారమ్మ ఆలయం వరకు నిర్వహిస్తున్నల నూకాంబిక అమ్మవారి బోనాల ఉత్సవానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, శివరాజ్ గౌడ్, జి.ప్రభాకర్, భాస్కర్, యాదగిరి, మోజెస్,శ్రీధర్, సంతోష్ బిరాదర్, ఉమేష్, కె.కిషోర్, శ్రీనివాసరావు, గణేష్, ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ - కూకట్ పల్లి

ఓల్డ్ బోయినపల్లిలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రచారం

నవతెలంగాణ-కంటోన్మెంట్



బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయం కోసం ఓల్డ్ బోయినపల్లి డివిజన్ కార్పొరేటర్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హెచ్ ఎల్‌పార్క్ ఆర్ఆర్‌నగర్ లక్ష్మీ నరసింహ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు కర్రె జంగయ్య మన్య ఉదయ్ యాదవ్ మల్లేష్ యాదవ్ హరినాథ్ సయ్యద్ ఇజాజ్ ఇర్ఫాన్ బాయ్ లలిత అనురాధ రోజా రాజేశ్వరి, సీనియర్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థి విజయం కోసం ప్రచారం చేశారు. నరసింహ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు అభ్యర్థి విజయం కోసం ఇంటింటి ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థి గణ విజయం సాధిస్తారని ఆయన పేర్కొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న నివేదిత

నవతెలంగాణ-కంటోన్మెంట్



నవ తెలంగాణ కంటోన్మెంట్ కంటోన్మెంట్అ బీఆర్ఎస్ సెంట్లీ అభ్యర్థి నివేదిత ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆదివారం సాయంత్రం రెండోవార్డ్ లోని కట్టమైసమ్మ కృష్ణానగర్ బస్తీలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పాద యాత్ర చేస్తే ఓటర్లను కలిశారా ఓటర్లు స్వాగతం పలుకుతున్నారు మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలను భారీ సంఖ్యలో మహిళా కార్యకర్తలు నాయకులు మహిళలు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఓయూ విద్యార్థి నేత నరసింహ

నవ తెలంగాణ-ఓయూ



సీఎం ఎనుముల రేవంత్ రెడ్డిని వారి నివాసంలో తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ స్టేట్ ప్రెసిడెంట్, ఓయూ పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ ఆదివారం ఆయన నివాసంలో కలిశారు.ఈ సందర్భంగా వలిగొండ నరసింహ మాట్లాడుతూ సంక్లిష్ట సమయంలో యూనివర్సిటీల విద్యార్థులుగా,స్కాలర్స్‌గా,కేంద్ర ప్రభుత్వ ఫెలోషిప్లు ఇవ్వకుండా, కేంద్రం లో ఉండే రైల్వే వంటి సంస్థల్లో ఉద్యోగ నియామకాలు జరపక నిరుద్యోగులుగా మిగిలిపోయిన యువత అందరం కేంద్ర నియంతృత్వ బీజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన బాధ్యత మనపైన ఎంతో ఉంది ,కాబట్టి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విద్యార్థి ,నిరుద్యోగ యువత అందరం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం ,క్రియాశీలకంగా పనిచేసి ప్రజలను చైతన్యవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

యువతి విషయంలో గొడవ..బీర్ సీసాలలో దాడులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

యువతీ విషయంలో గొడవ బీర్ సీసాలలో దాడులు ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు నాగరంలోనే ఓ చర్చ గోష్టిగా మారింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారందీంతో పబ్ యాజమాన్యం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.నిందితుల్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.ఫిలింనగర్లోని మూన్‌షైన్ పబ్ లో అర్ధరాత్రి మందుబాబుల మధ్య గొడవ జరిగింది.పబ్‌కు వచ్చిన యువతితో కలిసి మందుబాబు మద్యం తాగుతుండగా..మరో యువకుడు ఆ యువతితో కలిసి డ్యాన్స్ చేయసాగాడు. తన గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి డ్యాన్స్ చేస్తుండంతో మందుబాబు అతన్ని నెట్టివేసి ఇలా చేయడం సరికాదని తాను మద్యం తాగించిన యువతితో నువ్వు ఏలా డ్యాన్స్ చేస్తున్నావంటూ మందుబాబును అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన మందుబాబును మందలించడంతో రెచ్చిపోయిన ప్రత్యర్థి వర్గం మూకుమ్మడిగా కలిసి దాడికి పాల్పడ్డారు. తుపాకితో బెదిరించి బీరుబాటిళ్లతో కొట్టి గాయపర్చారంటూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆకతాయిల దాడిలో ముగ్గురు యువకులు గాయపడటంతో వారిని స్థానిక పోలీసులు ఆసుపత్రికి తరలించారు.నిందితుల్ని అదుపులోకి తీసుకున్నపోలీసులు,వీరంతాబడాబాబుల పిల్లలువారు ఎవరన్నది త్వరలోనే వెల్లడిస్తామనీ సమాచారం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం

నవతెలంగాణ-ఓయూ



ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతీయ భారతీయ జనతా పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ భారీ మెజారిటీతో గెలిపించాలని హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు కక్కిరేణి హరిష్,కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి డివిజన్ లోని వెంకట్ రెడ్డి నగర్ లో ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రతి ఇంటికి వెళుతూ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఈటెల రాజేందర్ కమలం గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని సూచించారు. ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ ఈసారి మా ఓటు బీజెపికి కమలం పువ్వు గుర్తుపై వేస్తామని రాజేందర్ నరేంద్ర మోడీ ని గెలిపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, న్యాలకొండ సుమన్ రావు, గడ్డం సాయికిరణ్ ,డివిజన్ ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, రాగి వెంకటరెడ్డి ,జిల్లా శ్రీనివాస్, దారం వెంకటేష్ గుప్తా, పూల కృష్ణ, పూజారి సోమయ్య గౌడ్,బానోత్ రమేష్ నాయక్, హేమంత్ మూలే,పి వెంకన్న , లక్ష్మణ్, మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలు రాగిలతారెడ్డి, ముసిగంపల శివ గౌడ్ బూత్ అధ్యక్షులు ,నేతలు , కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ మాదిగ హక్కుల దండోరా పూర్తి మద్దతు

నవతెలంగాణ - జూబ్లీహిల్స్



తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నాయకులు జూబ్లీ హిల్స్‌లోని కార్యాల యంలో, సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌కు పూర్తి మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా దండోరా నాయకులు మాట్లాడుతూ, సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుటకు తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఫౌండర్ జన్ను కనకరాజు మాదిగ, హైదరాబాద్ సిటీ జిల్లా ప్రెసిడెంట్ కొమ్ము కృష్ణ బాబు మాదిగ, తదితరులు పాల్గొని తీర్మానం చేశారు.

హిందీకి పత్రిక నెలకొల్పిన వినయ వీర్ మృతి

నవతెలంగాణ-బంజారాహిల్స్



దక్షిణ భారతంలో హిందీ పత్రికకు ఓ ప్రాధాన్యతను కల్పించిన ప్రముఖ హిందీ పత్రిక హిందీ మిలాప్ ఎడిటర్,జర్నలిస్ట్ వినయ్ వీర్ (72) శనివారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొన్నాళ్లుగా మంచానికే పరిమిత మయ్యారు. దక్షిణ భారతదేశంలో హిందీ జర్నలిజాన్ని కొత్త శిఖరాలకు చేర్చిన జర్నలిస్ట్ వినయ్ వీర్. హిందీ సాహిత్యం,జర్నలిజం అభివృద్ధితో పాటు జర్నలిజంలో డిగ్రీ,ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని కట్టెలమండీలో స్థిరపడిన వినయ్ వీర్ కుటుంబం 1962లో హిందీ మిలాప్‌ను నెలకొల్పారు.వినయ్ వీర్ తన వీర్ తన తండ్రి మరణానంతరం 1991లో డైలీ హిందీ మిలాప్ సంపాదకునిగా బాధ్యతలు స్వీకరించి, జర్నలిజంలో కొత్త ఒరవడికలు సృష్టించారు.ఆదివారం ఆయన అంత్యక్రియలు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మంచినీటి కోసం రాస్తారోకో

- లేడీస్ హాస్టల్‌లో తీవ్రమైన నీటి ఎద్దడి..ఎండిపోయిన బోర్లు..పడని కొత్త బోర్లు
- మే 1నుండి జూన్ 1 వరకు సెలవులు ?



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రధాన లేడీస్ హాస్టల్ లో పలు బ్లాక్స్ నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శనివారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు ఓయూలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు మాట్లాడుతూ. గత కొన్ని రోజులుగా తీవ్రమైన నీటి సమస్య ఎదుర్కొంటున్నము అని ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకు పోయిన ఫలితం లేకపో పోవడంతో ఇలా రాస్తారోకో చేస్తున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించాలని తక్షణమే పరిష్కరించలని కోరారు.గత కొన్ని రోజులుగా తీవ్రమైన నీటి ఎద్దడి సమస్య ఎదుర్కొంటున్నారు. అధికారులు కనీసం నీటి సౌకర్యం కల్పించలేరా ? అంటు ఆవేదన వ్యక్తం చేశారు.

నీళ్ళు పోయని బోర్లు..పడని కొత్త బోర్లు

ఇక్కడ ఉన్న మూడు బోర్స్ నుండి నీళ్లు అంతంతమాత్రంగానే రావడం తో అధికారులు ప్రత్యామ్నాయంగా నూతనంగా బోర్స్ వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నా నీళ్లు పడ టం లేదని అధికారులు వాపోతున్నారు. ఇక గత్యంతరం లేక ప్రస్తుతం రోజు 2 వాటర్ ట్యాంకర్స్ తెప్పిస్తోన్న 3,500 మంది అమ్మాయిలకు వాటర్ సరిపోవడం లేదు. ఈ4బ్లాక్స్ ఏ కాకుండా సెంటినరి వసతిగృహంలో కూడా నీటి ఎద్దడి ఉండటముతో అధికారులు అయోమయంలో ఉన్నారు. ఇక అధికారులు ఎవరు రాకపోవడంతో అమ్మాయిలు ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు రాస్తారోకో ముగించారు.ఇక ఓయూలో నీటి ఎద్దడి తో అధికారులు మే నెల 1 నుండి జూన్1వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం లో అన్ని వసతి గృహాలకు,మెస్‌లకుసెలవులు ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

నీళ్లు లేవు ..డైరెక్టర్

వసతిగృహంలో ఉన్న బోర్లు ఎండిపోయిన్నట్లు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు పోయి నీటి ఎద్దడి ని ఆలోచించి గర్ల్స్ కొంత పొదుపుగా నీటిని వినియోగించుకోవాలని సూచించారు. నూతన బోర్లు వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న భూగర్భ జలాలు అడుగంటి పోయిన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో ఘోరంగా విఫలమైందని, ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ వైఫ ల్యాలను ప్రజలకు వివరించాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో డివిజన్ల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సనత్ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డిని పార్టీ శ్రేణులకు తలసాని శ్రీనివాస్ యాదవ్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ కు రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతుందని తెలిపారు. ఎక్కడకు వెళ్ళినా ప్రచారంలో ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని పేర్కొన్నారు. పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించు కునేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి బస్తీ, ప్రతి కాలనీ లో పాదయాత్ర ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని చెప్పారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో కూడా వివరించాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతో ఆగ్రహంతో ఉన్నారని, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన బీఆర్ఎస్‌కి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని అన్నారు.



నవతెలంగాణ-బంజారాహిల్స్

జ్యోతిష్యం జీవిత రహస్యాలను అన్‌లాక్ చేయడంలో స్వంత విజయ నిధిని కనుగొనడానికి అవసరమైన విశ్వ జ్ఞానాన్ని కనుగొనడంలో సహాయపడుతుందని ప్రముఖ జ్యోతిష్య నిపుణులు డాక్టర్ కనిమొళి సంతోష్ పేర్కొన్నారన్నారు. ఆదివారం బంజారా హిల్స్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ జ్యోతిష్యం వేద శాస్త్రం చాలా కాలంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఆశ్చర్యపరిచాయన్నారు. పురాతన జ్ఞానంలో వారి లోతైన మూలాలు వారి అభివృద్ధి చెందుతున్న ఆధునిక వివరణలతో దాని ఆధ్యాత్మిక ఆకర్షణకు మించి, జ్యోతిష్యం తనను తాను అర్థం చేసుకోవడానికి జీవితాన్ని ఉద్దేశ్యంతో నావిగేట్ చేయడానికి ఆచరణాత్మక మార్గదర్శిని అందిస్తుందని అన్నారు.జ్యోతిషశాస్త్రం అనేది వ్యక్తిత్వ లక్షణాలు, సామర్థ్యాలు జీవిత మార్గాలపై అంతర్దృష్టులను పొందడానికి వ్యక్తి పుట్టిన సమయంలో ఖగోళ వస్తువులను వివరించడం అని అన్నారు. జ్యోతిష్యంపై ఆమె ఆసక్తి కళాశాల సమయంలోనే ప్రారంభమైంది, అంచనాలు వేయడంలో ఆమె సహజ ప్రతిభను కనుగొందని జ్యోతిష్యం అనేది "కాస్మిక్ బ్లూప్రింట్", ఇది ఒక వ్యక్తి యొక్క ఏకైక జ్యోతిషశాస్త్ర జన్మ చార్ట్ యొక్క సంకేత ప్రాతినిధ్యాన్ని అందిస్తుందనీ తెలిపారు.

నోటి క్యాన్సర్ చికిత్సపై వినూత్న ఆవిష్కరణల పట్ల అవగాహన సదస్సు



నవతెలంగాణ-బంజారాహిల్స్

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్ లోని హెడ్ అండ్ నెక్ విభాగం వారు నోటి క్యాన్సర్ పై "ఒరెదల్ క్యాన్సర్ సీఎంఎఫ్-2024 అడ్వాన్స్ నాలెడ్జ్ ప్రాక్టీప్" పేరుతో ఒక రోజు కాన్ఫరెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ ఆదివారం బంజారా హిల్స్ లోనీ హాస్పిటల్ ఆడిటోరియంలో కాన్ఫరెన్స్ లో హెడ్ అండ్ నెక్ ఆంకాలజీ కి చెందిన పలువురు వైద్య నిపుణులు, రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన వైద్యులు, వైద్య విద్యార్థులు హాజరైయ్యారు.ఈ సందర్భంగా నోటి క్యాన్సర్ కు సంబంధించిన పలు కీలకాంశాలు, చికిత్సలో అందుబాటులోనికి వచ్చిన ఆధునిక వైద్య సదుపాయాలు,చికిత్సా విధానాలు వంటి వాటిపై చర్చ జరపడంతో పాటూ నానాటికీ పెరుగుతున్న నోటి క్యాన్సర్ ను అరికట్టడానికి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై కూడా చర్చించడం జరిగింది. డా. టి యస్ రావు, మెడికల్ డైరెక్టర్, డా.యల్‌యం చంద్రశేఖరరావు, హెడ్ అండ్ నెక్ ఆంకాలజీ విభాగం,డా.హేమంత్ నెమాడె, కన్సల్టెంట్, హెడ్ అండ్ నెక్ ఆంకాలజీ విభాగం, నేతృత్వంలో జరిగిన ఈ ఒక రోజు కాన్ఫరెన్స్ రెండు తెలుగు రాష్ట్రాలలో నానాటీ కీ ఎక్కువ అవుతున్న నోటి క్యాన్సర్ పై పోరు సల్పడంలో ముందడుగు వేయడంలో కీలక పాత్ర పోషించనుంది. డా. పట్టతెయిల్ అరుణ్, డైరెక్టర్, టాటా మెడికల్ సెంటర్, కలకత్తా మరియు డా. విశాల్ రావు, హెచ్ సి జి క్యాన్సర్ సెంటర్, బెంగళూరు తో పాటూ పలువురు ప్రఖ్యాత నోటి క్యాన్సర్ నిపుణులు, క్యాన్సర్ వైద్య నిపుణులు పలు అంశాలపై ప్రసంగించారు. అనంతరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం డి డా. టి యస్ రావు, మాట్లాడుతూ ఆంకాలజీలో శరీర అవయవాల అధారంగా సబ్ స్పెషాలటీను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తద్వారా ఆయా శరీర అవయవాలకు వచ్చినక్యాన్సర్‌కి మెరుగైన చికిత్స అందించవచ్చుని ఈ దిశగానే బసవతారకంలో హెడ్ నెక్ ఆంకాలజీ విభాగాన్ని నెలకొల్పామని వివరించారు. ఈ కార్యక్రమాలలో అసోసియేట్ డైరెక్టర్,యాడ్ లైఫ్ అకడమిక్స్, డా.కల్పనా రఘునాద్, సీనియర్ కన్సల్టెంట్, హెడ్ అండ్ నెక్ ఆంకాలజీ విభాగం, డా.హేమంత్ నెమాడె తో పాటూ హెడ్ అండ్‌నెక్ ఆంకాలజీ విభాగానికి చెందిన వైద్యులు డా. జొనాథన్, డా. శ్రవణ్ కుమార్, డా.అనిల్ కుమార్, డా.అభినవ్ తాదూరి లతో మరియు రండు తెలుగు రాష్ట్రాల వైద్యులు, వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాదిగ జాతిని మోసం చేసిన కాంగ్రెస్

మాదిగ జాతిని మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలి

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ

నవతెలంగాణ-ఓయూ



బీజేపీ గెలుపు మాదిగల గెలుపు అని మాదిగలను మేసం చేసిన కాంగ్రెస్, బీఆర్ ఎస్‌లను ఓడించాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించడంలో మాదిగ విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని ,మాదిగ జాతి లక్ష్యాన్ని అందించబోతున్న నరేంద్ర మోదీకి తెలంగాణలోని మాదిగ ఉప కులాల విద్యార్థులు అండగా నిలవాలి మందకృష్ణ మాదిగ కోరారు. తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల మాదిగ విద్యార్థులు మరియు,రీసెర్చ్ స్కాలర్స్ సదస్సు ఓయూ ఈసీఈ ఆడిటోరియంలో ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ద్వారానే మాదిగ ఉప కులాల విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలు వస్తాయనీ , వర్గీకరణ లేని యెడల జాతికి అంధకారమేననీ, మాదిగ జాతి మూడు దశాబ్దాలుగా ఉద్యమం కొనసాగిస్తుందన్నారు. విశ్వరూప మహాసభ ద్వారా మాదిగల శక్తి ప్రదర్శనగా నిర్వహించిన సభకు నరేంద్ర మోడీ వచ్చిన తరువాత సుప్రీంకోర్టు ప్రక్రియ,మరియు ప్రత్యేక కమిటీ ఏర్పాటు ద్వారా వర్గీకరణను బీజెపి పూర్తి చేయబోతున్న విషయం కండ్ల ముందు కనిపిస్తుందన్నారు. ఓయూలో ఉన్న విద్యార్థులందరూ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కిషన్ రెడ్డి గెలుపుకు అహర్నిశలు శ్రమించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ,జాతీయ ఉపాధ్యక్షులు తొకల చిరంజీవి మాదిగ,జాతీయ కార్యదర్శి పల్లేర్ల సుధాకర్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శిలు భైరపోగు శివ కుమార్ మాదిగ,ముక్కెర ముఖేష్ మాదిగ,కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు శ్రీనాథ్ మాదిగ, తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు దినేష్ మాదిగ, పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షులు మీసాల గణేష్ మాదిగ, మహాత్మాగాంధి యూనివర్సిటీ అధ్యక్షులు చిట్టిబాబు మాదిగ, పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నాయకులు ప్రశాంత్ మాదిగ వివిధ యూనివర్సిటీల మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ నియోజకవర్గంలో స్థానిక డివిజన్ ముఖ్యనాయ కులతో సమావేశమైన ఖైరతాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ, సీనియర్ నాయకులు మన్నే గోవర్ధన్ రెడ్డి, నియోజక వర్గ ఎన్నికల ఇంచార్జ్ ఎంఎస్, శ్రీనివాస్‌రావు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేసి అత్యధిక మెజాలటీతో గెలిపించి అత్యధిక మెజార్టీ ఖైరతాబాద్ నుంచి ఇవ్వాలని కోరారు. గజ్జల ఆనంద్, కన్నా యాదవ్, శ్రీనివాస్, తేజ చౌదరి, రాహుల్ సింగ్, పాశం వెంకటేష్, మేఘన,నాయకులు బూత్ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
సోమవారం | ఏప్రిల్ 29, 2024 | www.navatelangana.com



పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఆదివారం బంజారాహిల్స్‌లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్, ఎన్నికల అబ్జర్వర్లు పాల్గొన్నారు. ఎన్నికలు తీసుకుంటారు భద్రతపై పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రత, చర్చించారు.

నవతెలంగాణ-సీటీబ్యూరో

మతోన్మాద బీజేపీని ఓడించాలి

- వామపక్ష, లౌకిక శక్తులను బలపర్చాలి..
- సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ కే ఈశ్వరరావు

నవతెలంగాణ-ధూల్‌పేట్-సంతోష్‌నగర్

మతోన్మాద బీజేపీని ఓడించాలని, వామపక్ష, లౌకిక శక్తులను బలపర్చాలని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ కే ఈశ్వరరావు అన్నారు. ఏప్రిల్ 28న సంతోష్ నగరలో సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఎం.మీనా అధ్యక్షతన "పార్లమెంటు ఎన్నికలు - కార్మిక వర్గ కర్తవ్యం" అనే అంశంపై సీఐటీయు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన సీఐటీయు రాష్ట్ర నాయకులు ఎండీ అబ్బాస్, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కిషన్ లతో కలిసి మాట్లాడుతూ.. కార్మిక వర్గంపై బీజేపీ 10 ఏళ్లుగా యుద్ధం చేస్తున్నారన్నారు. కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించాలని, వామపక్ష, లౌకిక శక్తులను బలపర్చాలని, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కనీస వేతన కమిటీ తీర్మానం ప్రకారం రూ.26వేలు చెల్లిస్తే తప్ప సగటు కార్మికుడు బ్రతకలేడని ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్న వేతనాలు పెంచలేదన్నారు. ఫ్లోర్ లెవెల్ మినిమం వేజ్ రోజుకు రూ.172లుగా బీజేపీ నిర్వహించడం దారుణమన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి, నాలుగు లేబర్ కోడ్ లుగా తెచ్చిందన్నారు. ఈ కోడ్ ల వల్ల కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు కోల్పోతారన్నారు. సమ్మె హక్కులు కాల రాయబడిందనీ, 8 గంటల పని దినం 12 గంటలకు మార్చారన్నారు. కోట్లాదిమంది అసంఘటితరంగా కార్మికులకు వర్తించే ఈపీఎఫ్ పెన్షన్ నెలకు పదివేలు పెంచాలని బీజేపీకి మనసొప్పడం లేదనీ ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించడానికి అంగీకరించడం లేదన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదనీ, 2022 విద్యుత్ సవరణ చట్టాన్ని తెచ్చి ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు వేల కోట్ల లాభాలు కట్టబెట్టేందుకు తెగబడిందనీ మండి పడ్డారు. 100 రోజుల్లో ధరలు తగ్గిస్తానని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యవసర వస్తువుల చార్జీలు విపరీతంగా పెంచారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లధనాన్ని వెనక్కి తెచ్చి పేదల బ్యాంక్ అకౌంట్లో 15 లక్షలు డిపాజిట్ చేస్తానన్న వాగ్దానం మర్చిపోయిందన్నారు. బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని, వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా



కార్యదర్శి ఎం శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. బీజేపీకి ఓట్లు పెరిగిన, సీట్లు పెరిగిన ప్రమాదమే అన్నారు. బీజేపీ గెలవడం అంటే రాబోయే కాలంలో కార్మికులకు సంఘాలు ఉండవు, సమ్మె హక్కు, పోరాడే హక్కు, కనీస వేతనాలు ఉండవన్నారు. గతంలో ఉన్న జీతాలు తగ్గిస్తారు, కానీ ధరలు పెంచుతారన్నారు. పెట్టుబడిదారులకు లాభాలు, కార్మికులకు, రైతు, కూలీలకు బారాలు పెంచుతారన్నారు. ఇలాంటి బీజేపీకి ఓటు వేసే వాళ్లను ఆపాలన్నారు. ఇండియా కూటమికి వామపక్ష శక్తులకు ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, మురళి, సత్తయ్య, బాబా, నాగేశ్వరరావు, సోమన, సిద్దు నారి, యాకుబ్, బాబార్ ఖాన్, రమేష్,మహేష్ దుర్గి, నరసింహ,కూర్మయ్య,తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గదెద్దించాల్సిన అవసరముంది



- హైకోర్టు సీనియర్ అడ్వకేట్ మహ్మద్ ఖుద్దుస్ గౌరీ

నవతెలంగాణ-ధూల్‌పేట్

బీజేపీ ప్రభుత్వాన్ని గదెద్దించాల్సిన అవసరముందనీ హైకోర్టు సీనియర్ అడ్వకేట్ మహ్మద్ ఖుద్దుస్ గౌరీ అన్నారు. ఆవాజ్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈద్-ఎ-మిలాద్ ను ఆలం ఖుంద్ మిరి భవన్ లో నగర కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కిందన్నారు. హైదరాబాద్‌లో కూడా అన్ని రాజకీయ పార్టీలు పోటాపోటీగా నడుస్తున్నాయన్నారు. బీజేపి ప్రభుత్వం ప్రమాదకరంగ మారిందన్నారు. అన్ని వర్గాల ప్రజలను పీడిస్తు భావోద్రేకాలను రెచ్చకొడుతున్నారన్నారు. ప్రశ్నిస్తున్న వారిని జైల్‌లో వేస్తున్నదన్నారు. సీబీఐ, ఈడీలను జేబు సంస్థలుగా వాడుకుంటున్నదనీ, లౌకిక ప్రజాస్వామ్య పునాదుల్ని బలహీనపరుస్తున్నదన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గదెద్దించాల్సిన అవసరం అన్ని వర్గాల లౌకికవాదుల, తక్షణ కర్తవ్యమన్నారు. ఈ రాష్ట్రంలో ఒక్క బీజేపి సీటు కూడా రానివ్వకుండా నిరోధించడం అవసరమన్నారు. ఆవాజ్ కమిటీని బలోపేతం చేసేందుకు మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి యం.శారవస్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. ఆవాజ్ నాయకులను కార్యకర్తలను శుభాకాంక్షలు తెలిపారు. బాలు నాయక్ ఆహ్వానించగా, కార్యదర్శి అబ్దుల్ సత్తార్ కర్తవ్యాలను గుర్తు చేస్తూ కార్యకర్తలు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నగర్ అధ్యక్షులు అబ్దుల్ లతీఫ్, సీనియర్ సామాజిక కార్యకర్తలు సనావుల్లా ఖాన్, మౌలానా ఖైరుద్దీన్‌తో పాటు ఆవాజ్ నాయకులు బాబర్ ఖాన్, గులాం నసీర్, షేక్ యాకూబ్, అయూబాన్, మహబూబ్ అలీ తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకుందాం

- పోలింగ్ డే ను హాలిడేగా భావించొద్దు
- జమాఅతె ఇస్లామీహింద్ సిటీప్రెసిడెంట్ డాక్టర్ ముబష్షిర్ అహ్మద్

నవతెలంగాణ-ధూల్ పేట్



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 100శాతం పోలింగ్ నమోదవ్వాలని జమాతే ఇస్లామీ హింద్ హైదరాబాద్ సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ముహమ్మద్ ముబషిర్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. జమాఅతె ఇస్లామీహింద్ ఆధ్వర్యంలో ఓటు హక్కు అవగాహన ఉద్యమంలో భాగంగా ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఓటు హక్కు అవగాహన రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకో వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నేటి పరిస్థితుల్లో దేశంలో రాజకీయ మార్పు చాలా అవసరమని, ఫాసిస్టు శక్తులను గద్దెదించడానికి ఇదే చివరి అవకాశమన్నారు. కాబట్టి ముస్లిములు తమ నిర్లక్ష్యాన్ని వీడి పోలింగ్ రోజు ఓటు వేయాలన్నారు. ఓటు వేయడం సామాజిక, నైతిక బాధ్యతగా భావించాలన్నారు. ఓటు వేయకుండా నిర్లక్ష్యం చేసి మీ ఓటును వృథా చేసుకోవద్దని అన్నారు. ఓటు వేయడానికి అవసరమైన పోలింగ్ స్లిప్, గుర్తింపు కార్డు తదితర పత్రా లను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఓటింగ్ ప్రక్రియ, పోలింగ్ బూత్ స్థానాన్ని ముందుగానే తెలుసుకోవాలన్నారు. మీ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు ఓటు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. దేశంలో ఫాసిస్టు శక్తులు పథకం ప్రకారం ముస్లింలను టార్గెట్ చేస్తున్నాయని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లింలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలింగ్ డేను హాలిడేగా చూడొద్దన్నారు. పోలింగ్ రోజును సెలవు దినంగా పరిగణించవద్దని, ఉదయాన్నే ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. నిరంకుశ, అణచివేత శక్తులను అడ్డుకునేందుకు ఓటును ఆయుధంగా వాడుకోవాలన్నారు.

ఘనంగా దుర్గమ్మ విగ్రహ పునర్ ప్రతిష్టాపన ఉత్సవాలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కుమ్మరి బస్తిలో శ్రీ దుర్గమ్మ విగ్రహ పునర్ ప్రతిష్టాపన ఉత్సవాలు ఆదివారం ఘనంగా కొనసాగాయి. కాగా మొదటి రోజు ఆదివారం ఉదయం గణపతి పూజ, పుణ్యవచనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్టస్థాపిత దేవత పూజహవనం, జలాధివాసం మంత్రపుష్పం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కాగా ఈ ఉత్సవాలను మూడు రోజులపాటు నిర్వహిస్తూ భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

నవతెలంగాణ-కీసర

గోధుమ గుంట గ్రామంలోని నల్ల పోచమ్మ గుడి విగ్రహ ప్రతిష్టాపనలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ అకిటి మహేందర్ రెడ్డి, గ్రామ కమిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు చీర కృష్ణ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

- 11 వార్డు బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఈటల రాజేందర్



నవతెలంగాణ కీసర

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ మున్సిపల్ 11వార్డులో కౌన్సిలర్ డాక్టర్ గురువెళ్లి వెంకటరమణ రావు ఆధ్వర్యంలో అయ్యప్ప కాలనిలో నూతనంగా ఏర్పాటు చేసిన 11వ వార్డు బీజేపీ పార్టీ కార్యాలయాన్ని మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి శనివారం ప్రారంభించారు. అనంతరం కౌన్సిలర్ డాక్టర్ గురువెళ్లి వెంకటరమణరావు ఆధ్వర్యంలో వార్డులోని వివిధ కాలనీలకు చెందిన సుమారు 200 మంది ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కాలనీ వాసులకు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ అభిమానంతో పెద్ద ఎత్తున బీజేపీ పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. అంతకుముందు దమ్మాయిగూడ లో జరిగిన రోడ్ షోలో కౌన్సిలర్ వెంకటరమణ తో కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ-సంతోష్ నగర్

యువతి అదృశ్యమైన సంఘటన ఆదివారం సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంతోష్ నగర్ డివిజన్ మోయిన్బాగ్ పండిత్ నగర్ బ్యాక్ సైడ్ ఖాన్ ఖాన్ హోటల్ ఆవరణకు చెందిన ఆస్మాజాబీన్ (22) ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో వేతికించారు. అలాగే తెలిసిన వారిని ఫోన్‌లో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

'హస్తం గుర్తుకు ఓటు.. అభివద్ధికి బాటలు..'



నవతెలంగాణ - మీర్ పేట్

హస్తం గుర్తుకు ఓటు వేసి అభివద్ధికి బాటలు వేయాలని కార్పొరేటర్ పోరెడ్డి పద్మా భాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లెలగూడలో హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గం మరింత అభివద్ధి చెందాలంటే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల శ్రేయస్సును కోరుకునే గడ్డం రంజిత్ రెడ్డిని గెలిపించాలన్నారు. అత్యధిక మెజార్టీతో గడ్డం రంజిత్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నన్ను గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా,



- కాంగ్రెస్ అభ్యర్థి సునితా మహేందర్‌రెడ్డి
- సీఎం కార్నర్ మీటింగ్‌కు భారీగా హాజరైన ప్రజలు

నవతెలంగాణ-అల్వాల్

తనను గెలిపించండి, అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి సునితా మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి కాంగ్రెస్ మల్కాజిగిరి ఇన్‌చార్జ్ మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో కౌకురులో జరిగిన సీఎం కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి జరిగింది తప్ప అభివృద్ధి లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 4 నెలలలోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చిన గొప్ప నాయకుడు మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి, మల్కాజిగిరి నుండి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లీడర్షిప్ అనేది కుంటుపడే విధంగా తయారు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే చెల్లుతుందని అన్నారు. నాయకులు అవసరం లేదు... ప్రజలకు డబ్బులు ఇస్తే ఓట్లు పడతాయన్న భ్రమలో ఉండేవారని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇగో డబుల్ బెడ్రూమ్ అంటూ మోసం చేశారని, డబ్బులు ఇచ్చిన వారికే డబుల్ బెడ్‌రూంలు ఇచ్చారని, దళిత బంధు అంటూ మోసం చేశారని మాల్కాజిగిరి మొత్తంలో కూడా 100 మందికి రాలేదని అన్నారు.దురదృష్టం ఏంటంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాని ఎమ్మెల్యేలందరూ ఇతర పార్టీ వారున్నారని.. కావున ఇక్కడ సునీత అక్కను భారీ మెజారిటీతో గెలిపించినట్లైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండతో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. హరీశ్‌రావు నోరు అదుపులో ఉంచుకుంటే బాగుంటుందని, ఇంకోసారి ముఖ్యమ మంత్రి పైన ఏమైన మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే 5 గ్యారంటీలను అమలు చేసి, 30 వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తు చేశారు. మేడ్చల్ జిల్లా పార్టీ ఆధ్యకులు హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి మహిళను ఇక్కడ అభ్యర్థిగా నిలబెట్టిన ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ సమస్యలు తెలిసిన పట్నం సునీత మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మైనంపల్లి హన్మంతరావు పిలుపుతో సీఎం కార్నర్ మీటింగ్ కి జనం భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, బొబ్బిలి, సురేందర్రెడ్డి, అశోక్‌రెడ్డి, కొండల్ రెడ్డి, లక్ష్మీకుమార్రెడ్డి, భవిత, శశికళ తదితరులు పాల్గొన్నారు.



ఆ ఆరుగురి దారెటు..?

- మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ కార్యక్రమాల్లో కనిపించని ఆ పార్టీ ఆరుగురు కార్పొరేటర్లు
- బీఆర్ఎస్‌లో ఉన్నట్టా.. లేనట్టా..?
- వారు కాంగ్రెస్ వైపా.. బీజేపీ వైపా..?
- ఎంపీ ఎన్నికల వేళా ఆ కార్పొరేటర్ల మద్దతు ఎవరికి..?

నవతెలంగాణ - మీర్ పేట్

పార్లమెంట్ ఎన్నికల సమయంలో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగులబోతున్నట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆ పార్టీ కార్పొరేటర్లే చెబుతున్నారు. గత నెలలో కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు బీఆర్ఎస్ అసమ్మతి కార్పొరేటర్లతో కలిసి మేయర్‌పై అవిశ్వాసం పెట్టిన విషయం తెలిసిందే. సొంత పార్టీ మేయర్ పైనే అవిశ్వాసం పెట్టడాన్ని బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం వ్యతిరేకించింది. అయినా పార్టీకి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్, బీజేపీల కార్పొరేటర్లకు మద్దతిస్తూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఏడుగురు కార్పొరేటర్లు మేయర్ కు వ్యతిరేకంగా ఓటు వేశారు. దాంతో బీఆర్ఎస్ పార్టీ సదరు(ఆరుగురు) కార్పొరేటర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పక్కన పెట్టినట్టు తెలుస్తోంది.

బీఆర్ఎస్ కార్యక్రమాల్లో కనిపించని ఆ ఆరుగురు కార్పొరేటర్లు..?

ప్రస్తుతం మరో రెండు వారాల్లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఉండడంతో ప్రచార కార్యక్రమాలు బహిరంగ సభలు జోరుగా సాగుతున్నాయి. కానీ సదరు ఆరుగురు కార్పొరేటర్లు ఆ కార్యక్రమాల్లో కనిపించడం లేదు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సైతం పాల్గొనకుండా ప్రజలను సైతం సమీకరణ చేయకుండా మౌనంగా ఉండిపోయినట్టు తెలిసింది. ఏంటని సదరు కార్పొరేటర్లతో మాట్లాడితే బీఆర్ఎస్ పార్టీ అధిష్టానమే తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని చెప్పినట్టు తెలిసింది. తాము బీఆర్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనటం లేదని, బీఆర్ఎస్ పార్టీ నాయకులే తమను వద్దనుకొని వదిలేసుకున్నప్పుడు బలవంతంగా తాము ఎందుకు అందులో ఉంటాం తమకు, తమ మాటలకు, అభిప్రాయాలకు గౌరవం ఇచ్చే వాళ్లతో ఉంటాం అని బహిరంగంగానే వారి అభిప్రాయాలను తెలియజేస్తున్నారు కొందరు అసమ్మతి కార్పొరేటర్లు.

ఆ ఆరుగురి దారెటు..? కాంగ్రెస్ వైపా.. బీజేపీ వైపా..?

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆ ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఏ పార్టీకి మద్దతు తెలుపుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే కార్పొరేషన్ పరిధిలో ఏ ఎన్నికల్లో అయినా ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదు అయ్యే ప్రాంతాలు కావడం గమనార్హం. ఆ ఆరుగురు కార్పొరేటర్ల పరిధిలో ఆరుగురు కార్పొరేటర్లు ఏరియాలో దాదాపు 90శాతం ప్రజలు ఓటింగ్ లో పాల్గొంటారు. అందుకే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆ ఆరుగురు కార్పొరేటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే తమ తమ పార్టీలో చేరాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు రెండు మూడు దఫాలుగా చర్చలు జరిపినట్టు సంబంధించిన పార్టీ నాయకులు అంటున్నారు.

కాంగ్రెస్ వైపు మొగ్గు.. నేడో రేపో చేరిక...?

ఆ ఆరుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరెందుకు సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలో చేరితే కొంత ఉపయోగం ఉంటుందని, చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి గెలిచే ఎక్కువగా ఉన్నాయని అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్దమైనట్టు చెప్తున్నారు. మీర్ పేట్ కార్పొరేషన్ పరిధిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఆ సందర్భంగా కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు దానికి సంబంధించిన ఏర్పాట్లు సైతం పూర్తయ్యాయని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. చూడాలి మరి ఆ ఆరుగురు కార్పొరేటర్లు ఏ పార్టీలో చేరుతారో...



సినిమా మాధ్యమానికి మాతృక రంగస్థలం

- ప్రముఖ నటుడు మురళీ మోహన్

నవతెలంగాణ-కల్చరల్

సినీ లేదా టీ.వీ మాధ్యమానికి మాతృక రంగస్థలమేనని ప్రముఖ సినీ నటుడు మురళీ మోహన్ అన్నారు. ముప్పై నాలుగేండ్లుగా పరుచూరి బ్రదర్స్ వారు ఎదిగివచ్చిన రంగస్థలంను మరువక మృతి చెందిన తమ కుమారుడు రఘు బాబు పేరిట నాటిక నాటక పోటీలు నిర్వహిస్తూ కళా కారులకు వేదిక కల్పిస్తున్నారని కొనియాడారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై రెండు రోజులు గా పరచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ నిర్వహణలో జరుగుతున్న రఘుబాబు స్మారక 34 వ జాతీయ స్థాయి నాటక నాటిక పోటీలు ముగింపు సభ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం కళా కారులు హర్ష ధ్వనాలు మధ్య జరిగాయి. ముఖ్య అతిథిగా మురళి మోహన్ నిర్మాత దర్శకుడు బి గోపాల్ తో పాల్గొని పరుచూరి విజయ లక్ష్మి స్మారక రంగస్థల పురస్కారం వైజాగ్ విజయ లక్ష్మికి రూ. పాతిక వేల నగదు జ్ఞాపిక తో బహుకరించారు. నాటక నాటిక పోటీల విజేత లకు నగదుతో పాటు వెండి పళ్లెం వెండి గ్లాసులు బహుకరించారు. పరుచూరి వెంకటేశ్వర రావు, పరుచూరి గోపాలకృష్ణ, నటుడు నారాయణ మూర్తిలు పాల్గొన్న సభలో నాటిక పోటీలకు కోట శంకర రావు, అమరేంద్ర,సమ్మెట వెంకట రమణ నాటక పోటీలకు యండమూరి వీరేంద్రనాథ్ డాక్టర్ డి ఎస్ ఎన్ మూర్తి బుర్ర సాయి మాధవ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. నాటక విభాగంలో: ఉత్తమ ప్రదర్శన దర్శకత్వం రచన, ఆహార్యం ప్రతి నాయకుడు లకు వరుసగా గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి భూత కాలం, గోవాడ వెంకట్, దివాకర్ బాబు, మల్లాది భాస్కర్,సురభి నిఖిలేశ్ కాగా ఉత్తమ కథానాయకుడు గా నాన్న నేనే గెలిచే లో నటించిన సీరం శ్రీనివాస్ రావు, నటిగా జై వాన్ జై కిసాన్ లో నటించిన అమృత వర్షిణి ఎంపికయ్యారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శన సిరి మువ్వ కల్చరల్ హైదరాబాద్ వారి జేబు చెప్పిన వూసులు ఎంపికైంది. నాటిక విభాగం లో ఉత్తమ ప్రదర్శన,దర్శకత్వం న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్స్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజయవాడ వారి కపిరాజు డాక్టర్ ఎం.ఎస్.చౌదరి, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన నటుడు గా వరుసగా తెలుగు కళా సమితి వైజాగ్ వారి నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత , పీ.వర ప్రసాద్ రచన కంచెర్ల సూర్య ప్రకాశ రావు రచించిన రైతే రాజు, నటిగా అమృత హస్తంలో నటించిన సరిత ఎంపికయ్యారు.



ప్రమోటెడ్ చైర్ అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ అడ్డగుట్టకు చెందిన భాను చరణ్ మొత్తం బెడ్ రెస్ట్‌లో ఉన్నాడు. నడవలేక ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న సెవెన్ రేస్ ఫౌండర్ సారా.. భాను చరణ్ ఇంటిని సందర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి బయటికి, వాష్ రూంకి తీసుకెళ్లడానికి చాలా కష్టపడుతున్నట్టు తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన సారా.. అబ్బాయిని కూర్చోబెట్టడానికి ప్రమోటెడ్ చైర్ అందజేశారు. ఇది ఆ అబ్బాయికి చాలా ఉపయోగపడుతుందని సారా తెలియజేశారు.

నమ్మక ద్రోహులను తరిమికొట్టి బీసీ నాయకున్ని గెలిపించండి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - మీర్‌పేట్

స్వలాభం కోసం బీఆర్ఎస్ వీడిన నమ్మక ద్రోహులను తరిమికొట్టి అభివృద్ధి కోసం పాటుపడే బీసీ నాయకున్ని గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా ఆదివారం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్ట పై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థులు ఇద్దరూ గతంలో బీఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేసి పదవి కాలం అయిపోయిన తర్వాత అధికారంలో ఉన్న పార్టీల్లోకి మారి పార్టీకి నమ్మకద్రోహం చేశారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు ఆకర్షణ పథకాల పేర్లు పెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. అలాగే కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయకుండా మతం పేరుతో రామునికి గుడి కట్టామని చెప్పుకుంటూ ఓట్లు అడుగుతున్నారు తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అభివద్ధి సాధ్యమవుతుందని అందుకు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు విజయ లక్ష్మి, మాజీ ఎంపిపి కార్పొరేటర్ సిద్దాల లావణ్య బీరప్ప, మహిళ అధ్యక్షురాలు సునీతా బాల్ రాజ్, యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజు, కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి..



- మాజీ కౌన్సిలర్ చెరుకూరి రేణుక జగన్
- ఎమ్మెల్యే సమక్షంలో భారీగా చేరిన వివిధ పార్టీల కార్యకర్తలు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు మాజీ కౌన్సిలర్ చెరుకూరి రేణుక జగన్ అన్నారు. పెద్ద అంబర్ పేట మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు మాజీ కౌన్సిలర్ చెరుకూరి రేణుక జగన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వారిని కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తూ శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ చెరుకూరి రేణుక జగన్ మాట్లాడుతూ అనతి కాలంలోనే కాంగ్రెస్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, ఎన్నికల మ్యానిపెస్టోలో ప్రజలకిచ్చిన హామీలకు ఆకర్షితులై కాంగ్రెస్ లో చేరినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల్లో మంచి స్పందన వస్తోందని తెలిపారు.ఇబ్రహీంపట్నం అభివృద్ధి ప్రదాత, పేదల ప్రజల సంక్షేమ సారథి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సారథ్యంలో ప్రజా సంక్షేమ అభివృద్ధిని వేగవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి కి ఆకర్షితులై ఐదో వార్డుకు చెందిన అంబేద్కర్ నగర్ , మైత్రి శ్రీపురం, భువనేశ్వర్ నగర్, సత్యనగర్ హరితహారం కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారని చెప్పారు. కార్యకర్తలతో మమేకమై కాంగ్రెస్ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తానని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, కౌన్సిలర్స్ పసుల రాజేందర్, పండుగుల జయ శ్రీ రాజు, సిద్ధంకి కృష్ణా రెడ్డి, కో- ఆప్షన్ సభ్యులు ఎం.ఏ ఖలీమ్, కాంగ్రెస్ పార్టీ పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు యంజాల పరమేశ్వరి సంజీవ, ప్రధాన కార్యదర్శి యంజాల గిరి, సీనియర్ నాయకులు కంచర్ల సత్యనారాయణరెడ్డి, దండెం రాజశేఖర్ రెడ్డి, అయ్యపు రెడ్డి, దాసరి నర్సింగ్ రావు,గంటా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



మూడు నెలల్లో భూస్థాపితమైన బీఆర్ఎస్

- కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-తుర్కయంజాల్

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ కేవలం మూడు నెలల్లో భూస్థాపితం అయిపోయిందని కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధి మన్నెగూడలోని ప్రముఖ్ టౌన్ షిప్ లో స్థానిక 8వ వార్డు కౌన్సిలర్ మర్రి మాధవి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చేసిన ఆరు గ్యారంటీల హామీలు రేవంత్ సర్కార్ తిరుగులేకుండా అమలు చేస్తోందన్నారు. దేశంలోనూ ఇవే గ్యారంటీలతో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేద వారికి న్యాయం జరుగుతుందన్నారు. కేసీఆర్ చెప్పే కల్లబొల్లి కథలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కేసీఆర్ ఆగం చేశారన్నారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గులాబీ పార్టీని ఇంటికి పంపారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని ప్రజలు నమ్మి పట్టం కట్టారన్నారు. మతాన్ని, కులాన్ని అడ్డం పెట్టుకొని కొందరు ఓట్లు అడగడానికి వస్తున్నారని, అలాంటి వారిని నమ్మొద్దన్నారు. పార్లమెంట్‌లో ప్రజా గొంతుకనై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మెన్ మల్ రెడ్డి రాంరెడ్డి, డీసీసీబీ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపాలిటీ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, కౌన్సిలర్లు కుంట ఉదయశ్రీ గోపాల్ రెడ్డి, కాకుమాను సునీల్, మేతరి అనురాధ దర్శన్, రేవల్లె హరిత యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామ భీంరెడ్డి, పుల్లగుర్రం విజయానంద్ రెడ్డి, నారని శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విస్తృత స్థాయి ప్రచారం



నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కే పురం డివిజన్ పరిధిలోని ద్వారక నగర్, వాసవి కాలనీ లో చేవెళ్ల ప్రచార పర్వం లో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి కి మద్దతుగా పార్టీ డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డిలు ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేసే ప్రభుత్వమని, బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు పని చేసే ప్రభుత్వమన్నారు. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన మ్యానిఫెస్టోని ను ప్రజలకు వివరిస్తూ , ప్రచారాన్ని కొనసాగిస్తూ, హస్తం గుర్తు పై ఓటు వేసి భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తలాటి రమేష్ నేత, యాదవ రెడ్డి, లింగ స్వామి గౌడ్, పెద్దవూర సైదులు, భూపాల్ రెడ్డి, ఎల్లయ్య, శ్రీకాంత్ రెడ్డి, పగడాల శ్రీశైలం, గోపాల్ రెడ్డి, పాండు, సుజాత, రాజా కుమారి, సాయి కుమార్, నగేష్, విప్లవ్, గోవింద్ మురళీ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ పురం డివిజన్‌లో

రామకృష్ణ పురం డివిజన్‌లో టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి గడప గడపకు పాదయాత్ర చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలక ఉపేందర్ రెడ్డి , కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు పున్నా గణేష్ నేత, రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





నాగోల్ డివిజన్‌లో బీఆర్ఎస్‌కు చెందిన శ్యామ్ కుమార్‌తో పాటు పలువురు ఆదివారం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో పార్టీలో చేరారు . ఈటల రాజేందర్ , రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ నాథ్ యాదవ్ లు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పోలింగ్ బూత్ నెంబర్ 92 లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. బి.ఎస్.రెడ్డి నగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్ , సీనియర్ నాయకులు కుంట్లూర్ వెంకటేష్ గౌడ్ , డివిజన్ ప్రెసిడెంట్ బద్దం బాల కృష్ణ గౌడ్ ,దప్పు రాజు, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి దశరథ్ సాగర్, మైనం రాజేశ్వర్, సూర్వి ప్రభాకర్ గౌడ్ ,మహిళా మోర్చా కలంశెట్టి లయ , రాధికా,ప్రీతి పటేల్, కన్న యాదవ్, మనోజ్ ,రాము గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నాగోల్



మందకృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ ను గెలిపించాలని ఎమ్మార్పీఎస్ ఎల్బీ నగర్ ఇన్‌చార్జి సుధాకర్ మాదిగ కోరారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ రోషన్ దౌల బస్తీలో ఇంటింటికి ప్రచారంలో భాగంగా దోర్ స్టిక్కర్ వేసి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలతో కమలం పువ్వు పై ఓటు వేసి అధిక మెజార్టీతో బీజేపీ గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ బస్తీ అధ్యక్షుడు మౌలాలి మాదిగ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ మాదిగ, అచ్చంపేట డివిజన్ ఇంచార్జి రాజు మాదిగ, సుమన్ మాదిగ, అడివైయ్య మాదిగ, సునీల్ మాదిగ ,రంగయ్య మాదిగ ,వెంకటేష్ మాదిగ పాల్గొన్నారు.

నవతెలంగాణ -ఎల్బీనగర్

ఇట్ల చేద్దాం

దోసెల పిండిలో ఒక కప్పు సగ్గుబియ్యం కూడా వేసి రుబ్బితే, దోసెలు పల్చగా వస్తాయి.



ఈ మినరల్ లోపిస్తే..

ఈ రోజుల్లో చాలా మంది మెగ్నీషియం లోపంతో బాధపడుతున్నారు. మెగ్నీషియం లోపం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశముంది. శరీరంలో మెగ్నీషియం తక్కువగా ఉంటే ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. కిడ్నీలపై చెడు ప్రభావం పడుతుంది. మెగ్నీషియం లోపిస్తే, కండరాల నొప్పులు, పట్టేయడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. మెగ్నీషియం లోపం అధికంగా ఉంటే.. హైపర్‌టెన్షన్, డయాబెటిస్, కరోనరీ ఆర్టరీ వ్యాధి, బోలు ఎముకల వ్యాధి ముప్పు పెరుగుతుంది.

ఇది మన శరీరంలో 300 కంటే ఎక్కువ ఎంజైమాటిక్



ప్రతిచర్యలలో పాల్గొంటుంది. చిన్న ప్రేగుల్లో ఆహార పోషకాలను గ్రహించడంలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. కార్బోహైడ్రేట్స్, కొవ్వు, ప్రోటీన్స్ నుంచి మనకు శక్తి వచ్చేలా మెగ్నీషియం సహాయపడుతుంది. రక్తంలో చక్కెరలను, హార్మోన్లను క్రమబద్ధీకరిస్తుంది. మెగ్నీషియం శక్తితోపాటు, ప్రశాంతంగా నిద్రపట్టేలా తోడ్పడుతుంది. ఇది శరీరంలోని నరాలు, కండరాల పనితీరును నియంత్రిస్తుంది. హార్ట్‌బీట్ సమంగా ఉంచుతుంది. ఎముకలు బలంగా ఉండాలంటే క్యాల్షియంను శరీరం శోషించుకోవాలి. ఇందుకు మెగ్నీషియం తోడ్పడుతుంది.

లక్షణాలు..

మెగ్నీషియం లోపం ఉంటే ఆకలి వేయదు, వికారంగా ఉంటుంది, వాంతులు వస్తున్నట్లు అనిపిస్తుంది, నీరసంగా, నిస్సత్తువగా ఉంటుంది, హార్ట్ బీట్‌రేట్‌లో హెచ్చుతగ్గులు వస్తాయి, కళ్ళు మసక బారినట్లు ఉంటుంది, కండరాలలో నొప్పి వస్తుంది, ఒత్తిడి పెరుగుతుంది, నిద్రలేమి వంటి లక్షణాలు కనిస్తాయి.

మన డైట్ క్రమం తప్పకుండా కొన్ని ఆహార పదార్థాలు చేర్చుకుంటే మెగ్నీషియం లోపం నుంచి బయటపడవచ్చు. ఆకుకూరలలోనూ, అవకాడో, అరటి పండ్లు, రాస్ బెర్రీస్, ఫిగ్స్ వంటి పండ్లలోనూ మెగ్నీషియం ఉంటుంది. అలాగే బ్రకోలీ, క్యాబేజి, పచ్చి బఠానీలు, మొలకలు వంటి వాటిలో కూడా మెగ్నీషియం ఎక్కువగా దొరుకుతుంది. బ్రౌన్ రైస్, ఓట్స్, సీఫుడ్స్‌లో కూడా మెగ్నీషియం లభిస్తుంది. ■

శ్రీదేవి బాయి... తన పిల్లలకు మెరుగైన జీవితం, నాణ్యమైన విద్య అందించడం ఆమె కల. కానీ ఆర్థిక ఇబ్బందులు దానికి అడ్డంకిగా మారాయి. భర్త నెల జీతంతో కుటుంబం గడవడమే కష్టంగా మారింది. ఏం చేయాలో తోచని ఆమెకు ఆలోచిస్తే అవకాశాలు బోలెడున్నాయనిపించింది. తనకొచ్చిన ఎంబ్రాయిడరీనే ఆదాయ వనరుగా మార్చుకోవాలనకుంది. అయితే మార్కెట్ ఆమెకు సహకరించలేదు. అటువంటి సమయంలోనే తన స్మార్ట్ ఫోన్ ఆమె జీవితాన్నే మార్చివేసింది. సాంకేతికత లో శిక్షణ తీసుకుని తన ఉత్పత్తులను విక్రయిస్తూ వ్యాపారాన్ని విస్తరింప చేసుకుంటుంది. అదెలాగో మనమూ తెలుసుకుందాం...

స్మార్ట్‌ఫోన్ ఆమె జీవితాన్నే మార్చేసింది



ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో జన్మించిన శ్రీదేవి వివాహానంతరం కర్ణాటకలోని రాయచూర్‌లో స్థిరపడింది. భర్త ప్రైవేట్ ఉద్యోగి. తన పిల్లలకు విలువైన విద్యను అందించాలనేది ఆమె కల. భర్త ఉద్యోగం చేసి ప్రతినెలా జీతం తెస్తున్నా ఆ ఆదాయం వారి కుటుంబానికి సరిపోయేది కాదు. దాంతో ఆ దంపతులు ఆర్థికంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల నుండి బయట పడేందుకు తను కూడా ఏదైనా చేసి కుటుంబానికి అండగా నిలవాలనుకుంది శ్రీదేవి. దానికి ఓ మార్గాన్ని కనుగొన్నది.

పరిస్థితులు అనుకూలించక

ప్రతిభావంతులైన శ్రీదేవికి ఎంబ్రాయిడరీలో మంచి ప్రావీణ్యం ఉంది. దాన్నే తన ఆదాయ మార్గంగా మలుచుకోవాలనుకుంది. వెంటనే అందుబాటులో ఉన్న అందమైన గుడ్డ ముక్కలపై ఎంబ్రాయిడరీ చేసి స్థానిక మార్కెట్‌లో తన ఉత్పత్తులను విక్రయించడం మొదలుపెట్టింది. అయితే పరిస్థితులు అనుకూలించక మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు విక్రయించాల్సి వచ్చేది. ఎంత శ్రమించినా ఆదాయం పెరగక పోవడంతో కొంత నిరాశకు గురయ్యింది. తన సంపాదనతో పిల్లల స్కూలు ఫీజు కూడా కట్టలేకపోయేది. ఎంత శ్రమించి అయినా పిల్లలకు మెరుగైన జీవితం, సరైన విద్యను అందించాలని నిశ్చయించుకున్న ఆమె తన ఖాళీ సమయంలో పిల్లలకు ట్యూషన్లు చెప్పేది. అయితే ఇది కొంత కాలం వరకు మాత్రమే చేసింది.

బీయింగ్ ది చేంజ్

తన మొదటి స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసిన తర్వాత ఆమె జీవితం మంచి మలుపు తీసుకోవడం ప్రారంభించింది. L&T టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి నాస్కామ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నడుస్తున్న డిజిటల్ అప్‌స్కిల్లింగ్ ఆఫ్ రూరల్ ఉమెన్ ఆర్టిసన్స్ ప్రోగ్రామ్ ఆమెకు సాంకేతికత విద్యను అందించి జీవితంలో కొత్త తలుపు తెరిచింది. సాంకేతికత, డిజిటల్ నైపుణ్యాల శిక్షణ ద్వారా గ్రామీణ మహిళా హస్తకళాకారులకు సాధికారత కల్పించే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ ప్రారంభించబడింది. మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారడానికి వారు సాంకేతికతను ఉపయోగించుకునేలా చేయడం దీని ప్రధాన ఉద్దేశం. నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉజ్వల భవిష్యత్తును పెంపొందించుకుంటూ సంప్రదాయ కళలను కాపాడుకోవడంపై ఇది దృష్టి సారిస్తోంది.

మహిళల కోసమే...

కొత్త అవకాశాలను అన్వేషించడం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం, మెరుగుపరచుకోవడం పట్ల నిత్యం ఆసక్తిగా ఉండే శ్రీదేవి తన కూతురి స్నేహితురాలి ద్వారా దాని గురించి విన్నది. వెంటనే ప్రోగ్రామ్ కోసం సైన్ అప్ చేసింది. శ్రీదేవి ఏమి నేర్చుకుంటుంది, ఎలా నేర్చుకుంటుంది అనే ఆసక్తితో పాటు, ఈ కార్యక్రమం ప్రత్యేకంగా మహిళల కోసం ఉద్దేశించబడింది. దాంతో ఆమె దరఖాస్తు చేసుకోవడానికి మరింత ఆసక్తి చూపించింది. ఆ ప్రోగ్రామ్ ఆమెకు సురక్షితంగా, సౌకర్యవంతంగా అనిపించింది.



కనీవినీ ఎరుగని ప్రభావం

'శిక్షణలో భాగంగా ఈ ప్రోగ్రామ్ ఆన్‌లైన్ కమ్యూనికేషన్, మార్కెటింగ్ ప్రపంచానికి నన్ను పరిచయం చేసింది. అంతేకాకుండా ఆన్‌లైన్ సమావేశాలను నిర్వహించడానికి, పాల్గొనడానికి నాకు కొత్త అవకాశాలను తెరిచింది. భౌగోళిక అడ్డంకులను అధిగమించడానికి, క్లయింట్‌లు, సహకారులతో ఎక్కడి నుండైనా కనెక్ట్ అవ్వడంలో నాకు సహాయపడింది' అంటూ ఆమె ఆనందం వ్యక్తం చేస్తోంది. సోషల్ మీడియా వినియోగం ఆమెపై కనీవినీ ఎరుగని ప్రభావం పడింది. దీని ఫలితంగా తన పనిని తనకు చాలా దూరంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రదర్శించగలుగుతుంది. 'ఈ జ్ఞానం నా వ్యాపార మార్గాన్ని పెంచడానికి, ఆన్‌లైన్‌లో కస్టమర్‌లతో సన్నిహితంగా ఉండటానికి, మరింత ఆదాయాన్ని సంపాదించడానికి నాకు శక్తినిచ్చింది' అంటూ జత చేస్తోంది.

ఒక బలమైన పునాది

నాస్కామ్ ఫౌండేషన్ వారి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగమైన శ్రీదేవి టెక్నాలజీకి సంబంధించిన ఎన్నో విషయాలను నేర్చుకుంది. తన ఆన్‌లైన్ వ్యాపారాన్ని ప్రారంభించడంలో కీలకమైన సాంకేతికత, దానిని ఎలా ఉపయోగించాలో తెలుసుకుంటూ క్రమంగా ఒక బలమైన పునాదిని నిర్మించింది. భవిష్యత్తులో ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో విక్రేతగా చేరాలని నిర్ణయించుకున్న ఆమె కొత్త సేల్స్ ఛానెల్‌లను అన్వేషించడానికి సైతం సిద్ధంగా ఉంది. అలాగే డిజిటల్ చెల్లింపు యాప్‌ల ద్వారా లావాదేవీలతో సహా బ్యాంకింగ్ కార్యకలాపాలలో నైపుణ్యాన్ని సంపాదించింది. మొత్తంమీద ఈ ప్రోగ్రామ్ డిజిటల్ రంగాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు, తన వ్యాపార కార్యకలాపాలను మెరుగుపరచడానికి అవసరమైన సాధనాలు, జ్ఞానాన్ని ఆమెకు అందించింది.

ముందున్న మార్గం

దేనికీ అధైర్యపడకుండా ముందుకు సాగితే ఆకాశమే తన హద్దు అని శ్రీదేవి ఇప్పుడు తెలుసుకుంది. ఆమె ఇప్పుడు తన వ్యాపార కార్యకలాపాలను క్రమబద్ధీకరించాలని చూస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని రుణాలను పొంది తన వ్యాపారాన్ని మరింత విస్తరింప చేసుకునేందుకు ప్రణాళికను రూపొందించుకుంటోంది. తనకు ఇంత మంచి వేదికను అందించిన ప్రోగ్రామ్‌కు ఆమె ధన్యవాదాలు తెలియచేస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఇప్పటికీ కొనసాగుతున్నప్పటికీ శ్రీదేవి కొంత వరకు ఆదా చేసుకోగలిగింది. 'నా అంతిమ లక్ష్యం నా పిల్లలకు మెరుగైన జీవితాన్ని, సరైన విద్యను అందించడం. ఆర్థిక ఇబ్బందులతో వచ్చే ప్రతికూలతలను అధిగమించగలనని నేను నమ్ముతున్నాను' అంటూ ఆమె తన కోసం మరో ప్రత్యేకమైన భాగాన్ని రూపొందించడానికి సిద్ధంగా ఉంది.

- సలీమ

గోదావరిని తరలిస్తున్న మోడీ

(మొదటిపేజీ తరువాయి)

నెరవేరాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. యువత ఆవేశంతో కాకుండా.. ఆలోచనతో ఓటు వేయాలని కోరారు. బీజేపీ అత్యంత ప్రమాదకరమైన పార్టీ అని, ఆ పార్టీకి ఉద్రేకం తప్పా వారి ఎజెండాలో ప్రజల కష్ట, సుఖాలు లేవని తెలిపారు. బేటీ బచావో, బేటీ పడావోతో ఎవరికన్న డబ్బులు పడ్డాయా అని ప్రశ్నించారు. కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరైతే దాన్ని మోడీ గుజరాత్‌కు తరలించారని తెలిపారు. గిరిజన విశ్వవిద్యాలయం కోసం పదేండ్లు కొట్లాడితే ఎన్నికలకు ముందు ఇచ్చిండని, పదేండ్లు పడతదా అని ఎద్దేవా చేశారు. ఇంతకుముందే కృష్ణానదిని కేంద్రం కేఆర్ఎంబీకి అప్పచెప్పిందన్నారు. బీజేపీని వ్యతిరేకించినందుకు తన బిడ్డను జైల్లో పెట్టారని, జైళ్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. గీ జైళ్లకు భయపడితే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. చేతకాని సీఎం..

కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని కేసీఆర్ అన్నారు. రైతు బంధు డబ్బులు రాలేదని, పైగా కరెంటు కోతలతో పంటలు ఎండిపోతున్నయని తెలిపారు. సాగు, తాగునీరు రాక ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అయినా ప్రభుత్వం ఏమీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సీఎం చిత్ర విచిత్రంగా మాట్లాడుతున్నాడని అన్నారు. వరంగల్‌కు కాళేశ్వరం నీళ్ల రాలేదంటున్నారని, రామప్ప, పాకాలకు నీళ్ల ఎక్కడి నుండి వచ్చాయని ప్రశ్నించారు. ఈ ముఖ్యమంత్రికి తెలంగాణ చరిత్ర, భూగోళం తెల్వదన్నారు. మన పాలనలో ఇలాంటి పరిస్థితి ఉండేనా.. ఇవన్నీ పోవాలంటే ఎవరు పోరాటం చేయాలే.. తానే చేయాలా.. అని, పోయిన ఎన్నికల్లో తనను కిందపడేసి మళ్లీ తానే కొట్లాడాలని చెబుతున్నరా.. అని ప్రజలనుద్దేశించి అన్నారు. హైదరాబాద్‌లో బిల్డర్లకు పర్మిషన్లు ఇవ్వడం లేదని, పర్మిషన్ ఇవ్వాలంటే కాంగ్రెస్ పార్టీకి లంచం ఇవ్వాలంటున్నారని ఆరోపించారు. తమ పాలనలో భూముల ధరలు పెరిగాయని, కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు తగ్గాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. మహిళలకు రూ.2,500, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదన్నారు. తెలంగాణ ఉద్యమం ఇంకా ముగియలేదని, తెలంగాణ పునరుజ్జీవం పూర్తి చేయాల్సి ఉందన్నారు.

ఓరుగల్లు పోరుగల్లు అయితేనే తెలంగాణ వచ్చిందన్నారు. కాళోజీ, జయశంకర్‌ను తలుచుకుంటేనే ఉద్రేకమొస్తదని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో వరంగల్‌లో 24 అంతస్తుల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, హెల్త్ యూనివర్సిటీతో పాటు ఉమ్మడి వరంగల్‌లో 5 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో కాకతీయ మెగాటెక్స్‌టైల్స్ పార్క్‌ను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. మైనార్టీ సంక్షేమానికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. మైనార్టీ గురుకులాలు పెట్టి మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యనిందించామని చెప్పారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

'కడియం' శాశ్వత రాజకీయ సమాధి

కడియం శ్రీహరి చేసిన మోసానికి శాశ్వతంగా రాజకీయ సమాధి అవుతాడని కేసీఆర్ అన్నారు. ఇక్కడ ఆయనకు పార్టీ టికెట్ ఇవ్వడమే కాకుండా ఉపముఖ్యమంత్రిని చేశామని, అయినా ద్రోహం చేశారని తెలిపారు. సుప్రీంకోర్టుకు పోయేదైన ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయిస్తామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో మూడు నెలల్లో ఉప ఎన్నిక రాబోతున్నదని, ఈ ఉప ఎన్నికలో డాక్టర్ టి. రాజయ్య ఎమ్మెల్యే కాబోతున్నారని తెలిపారు. ద్రోహులకు ఇదే గుణపాఠమన్నారు. ఈ రోడ్డు షోలో వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్, శాసనమండలి వైస్ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూధనాచారి, బస్వరాజ్ సారయ్య, మాజీ ఛీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణలో బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

ఎప్పుడూ భావించలేదు' అని తెలిపారు. ఈ నెల 23న మహారాష్ట్రలోని అకోలాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా రిజర్వేషన్లపై పెదవి విప్పాల్సి వచ్చింది. 'బీజేపీ అధికారంలో ఉంటే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు కావు' అని నమ్మబలికారు.

రిజర్వేషన్లను రద్దు చేయడం కోసం రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ ఆలోచనలపై పెద్ద ఎత్తున రాజకీయ దుమారం రేగడంతో ఆ పార్టీ నాయకులు వరుసగా వివరణలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఎందుకంటే కేవలం అగ్రవర్ణాల ఓట్లతోనే బీజేపీకి గెలుపు సాధ్యం కాదు. 2009 నుండి బీజేపీ తన బలాన్ని పెంచుకోవడానికి ఓబీసీ ఓట్లే కారణం.

వీరు కూడా...

కాంగ్రెస్ నుంచి ఇటీవలే బీజేపీలోకి ఫిరాయించిన జ్యోతి మీర్ధా ఈ నెల 2వ తేదీన ఓ బహిరంగ సభలో తేనెతుట్టెను మరోసారి కదిల్చారు. రాజ్యాంగంలో మార్పులు చేయాలంటే తమ పార్టీకి భారీ మెజారిటీ అవసరమని ఆమె చెప్పారు. మీర్ధాపై కాంగ్రెస్ విమర్శలు సంధించడంతో ఆమె మౌనం వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ నియోజకవర్గం నుండి రెండుసార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన లల్లూ సింగ్ కూడా నూతన రాజ్యాంగంపై మాట్లాడారు. ఆయన అయోధ్య శాసనసభ నియోజకవర్గానికి సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేశారు. రాజ్యాంగాన్ని మార్చాలన్నా లేదా నూతన రాజ్యాంగాన్ని రూపొందించాలన్నా మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమని లల్లూ సింగ్ అన్నారు. మిల్కీపూర్ శాసనసభ నియోజకవర్గంలో జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. గత రెండు నెలల కాలంలో రాజ్యాంగంపై మాట్లాడిన నాయకుల్లో ఆయన మూడో వారు.

రాజ్యాంగంలో ఇప్పటికే అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, వాటిలో ఎలాంటి ప్రమాదము లేదని మీరట్ నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న అరుణ్ గోవిల్ ఈ నెల 15న చేసిన వ్యాఖ్యకు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. మార్పు అనేది అభివృద్ధికి సూచిక అని, అది తప్పేమీ కాదని కూడా ఆయన చెప్పారు.

ఆది నుంచీ అదే వైఖరి

రాజ్యాంగం పైన, రిజర్వేషన్ల పైన బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల ట్రాక్ రికార్డును ఓసారి పరిశీలించాల్సిన అవసరం కూడా ఉంది. రిజర్వేషన్లను సమీక్షించాల్సిన అవసరం ఉన్నదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ 2015లో 'పాంచజన్య' పత్రికలో స్పష్టం చేశారు.ఇప్పుడేమో మేం రిజర్వేషన్‌లకు వ్యతిరేకం కాదు అంటున్నారు. రాజ్యాంగాన్ని మార్చబోం అంటున్నారు. ఇదంతా కేవలం ఎన్నికల కోసమే. రాజ్యాంగంలో భారతీయత లేదని ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక పాంచజన్య 1949లోనే ఆగ్రహం వ్యక్తం చేసింది.

గుజరాత్‌లో రూ.600 కోట్ల డ్రగ్స్ పట్టివేత

న్యూఢిల్లీ : దేశంలో మరో అతిపెద్ద డ్రగ్స్ రాకెట్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసీజీ), నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సంయుక్తంగా పట్టుకున్నాయి. ఏటీఎస్, ఐసీజీ నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.600 కోట్ల విలువైన 86 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నాయి. 14 మంది పాకిస్థానీలను అరెస్టు చేశాయి. తమిళనాడులోని కొందరు గుర్తుతెలియని వ్యక్తులకు ఈ సరుకును అప్పగించి, అక్కడి నుంచి శ్రీలంకకు తరలించేందుకు నిందితులు ప్రణాళిక రూపొందించినట్టు ఏటీఎస్ అధికారులు తెలిపారు. తదుపరి విచారణ కోసం కేసును నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)కి అప్పగించినట్టు డీజీపీ వికాస్ సహాయ్ మీడియాకు తెలిపారు.

తమిళనాడుకు చెందిన గుర్తుతెలియని వ్యక్తులకు పాకిస్తాన్ ఫిషింగ్ బోట్ మాదక ద్రవ్యాలను అందజేస్తుందని ఏటీఎస్ నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో, ఏటీఎస్, ఐసీజీ, ఎన్‌సీబీ సంయుక్తంగా శుక్రవారం ఫోర్‌బందర్‌కు 180 నాటికల్ మైళ్ల దూరంలో అనుమానిత పడవను అడ్డగించాయి. ఆ పడవలోని వారు హెరాయిన్ ప్యాకెట్లను సముద్రంలోకి విసిరేయడం ప్రారంభించారు. అనంతరం కాల్పులు జరపడంతో, ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పడవ కెప్టెన్ నజీర్ హుస్సేన్ కుడిచేతికి బుల్లెట్ గాయమైంది. బలూచిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న డ్రగ్ మాఫియా హాజీ అస్లాం అలియాస్ బాబు బలోచ్ ఈ డ్రగ్స్‌ను పంపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు ఏటీఎస్ తెలిపింది. గత మూడేండ్లలో వివిధ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన 11వ ఆపరేషన్‌గా పేర్కొంది.

ఇటీవల గుజరాత్, రాజస్థాన్‌లో రహస్యంగా డ్రగ్ ల్యాబ్‌లు నడుపుతున్నట్టు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో గుర్తించి, దాడులు నిర్వహించింది. ఈ ప్రాంతంలోని మూడు తయారీ కేంద్రాల నుంచి సుమారు రూ.300 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే గుజరాత్ తీరంలో పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడటం గమనార్హం. అయితే ఎన్నికలపుడు ఇంత భారీ స్థాయిలో సరఫరా వెనుక అధికారపార్టీ పెద్దల హస్తం ఉన్నట్టు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

విందు.. పసందు..

(మొదటిపేజీ తరువాయి)

ఐటీ ఎంప్లాయీస్ లాంటి వారితో మమేకమవుతూ.. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి సమస్యలు, డిమాండ్లను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్యలను పరిష్కరిస్తామని, డిమాండ్లను నెరవేరుస్తామని హామీలు సైతం ఇచ్చేస్తున్నారు.

కళకళలాడుతున్న మద్యం షాపులు

పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మద్యం దుకాణాలు పగలు, రాత్రి తేడా లేకుండా కళకళలాడుతున్నాయి. నేతలు తమ ప్రచారంలో పాల్గొన్న వారికి మద్యం, బిర్యానీ పొట్లాలు అందించి ఖుషీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకూ మద్యం సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వైన్స్ షాపుల యజమానులు ఆబ్కారీ అధికారులతోపాటు పోలీసులకు చిక్కకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సమాచారం. మద్యం షాపుల యజమానులతో ముందే మాట్లాడుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగినట్టు తెలుస్తోంది. నేతలు, నాయకులు, కార్యకర్తల అవసరాలు తీరేలా డబ్బులు కూడా సమకూరుస్తున్నట్టు జిల్లాలో జోరుగా చర్చ నడుస్తోంది. ఖర్చు ఎంతైనా వెనుకాడకుండా ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

37 లక్షల ఓటర్లు.. 3,228 పోలింగ్ కేంద్రాలు..

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 37,28,417 మంది ఓటర్లు ఉన్నారు. కంటోన్మెంట్ మినహా మిగతా ఆరు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గంలో 5 లక్షల కంటే అధికంగా ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 3,228 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న ఓటర్లను ఏ అభ్యర్థీ కలవడం అంత సులభం కాదు. దాంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు గంపగుత్త ఓట్లపై దృష్టి సారించారు. ఓటర్లు తమ చేతిలో నుంచి జారిపోకుండా ప్రతి రోజూ సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ప్రత్యేకంగా మద్యం, మాంసంతోపాటు ఇతర ఖరీదైన ఆహార పదార్థాలను సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. బర్త్ డే, పెండ్లీళ్లు, ఇతర ఫంక్షన్లకు సైతం హాజరవుతున్నారు.

తెలంగాణలో మోడీకి ఓట్లడిగే హక్కు లేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్టు తెలిపారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో రైలు విస్తరింపచేస్తామన్నారు. మూసీ నదిని ఆధునీకరిస్తామని చెప్పారు. గతంలో మల్కాజిగిరి నుంచి తాను ఎంపీగా పోటీ చేసినప్పుడు ఎల్బీనగర్ ప్రజలు 29 వేల మెజార్టీని అందించారని గుర్తు చేశారు. సునీతా మహేందర్ రెడ్డికి 30 వేల మెజార్టీని ఇవ్వాలని కోరారు. గతంలో ఎల్బీనగర్‌లో బీజేపీ కార్పొరేటర్లను గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. మల్కాజిగిరికి ఈటల రాజేందర్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండి హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది ఏమీ లేదన్నారు. అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సభల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పార్టీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కి గౌడ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

విధానంలో దేశం పనిచేస్తోందో తెలుస్తుందని అన్నారు.

" ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ని కటకటాల వెనక్కి నెట్టారు. వారు (బీజేపీ) నియంతృత్వ మార్గంలో నడుస్తూ.. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు. మన దేశాన్ని రక్షించుకోవడానికి మనం వారిని ఓడించాలి" అని దుయ్యబట్టారు. ఎన్‌సీపీ (ఎస్‌పీ) సిట్టింగ్ ఎంపీ, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలెను బారామతి అభ్యర్థిగా ప్రకటించారు. ఆమె మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్‌తో పోటీ పడుతున్నారు. సుప్రియా సూలేకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడతామని అన్నారు.

చిరుత ఉన్నది..జాగ్రత్త

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం తెల్లవారుజామున ప్రవేశించింది. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి వద్ద పులి ఎయిర్‌పోర్టు బౌండరీ దాటి లోనికి వచ్చింది. ప్రహరీ దూకుతుండగా ఫెన్సింగ్ వైర్లకు చిరుత తగలడంతో ఎయిర్‌పోర్టు కంట్రోల్ రూంలో అలారం మోగింది. దాంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సిబ్బంది సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో పులి సంచారాన్ని గుర్తించారు. వెంటనే ఫారెస్టు అధికారులకు విషయాన్ని తెలియజేశారు. వారు పులి జాడ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. అక్కడక్కడ బోన్లు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, ప్రత్యేక వాహనాలతో నిఘా పెట్టారు. పులి జాడ కోసం సీనియర్ అటవీ అధికారులతో పాటు వన్య మృగ ముఖ్య అధికారి కూడా పర్యవేక్షిస్తున్నారు. పరిసర గ్రామాల ప్రాంత ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

నవాబులు..సుల్తానుల అరాచకాలపై మౌనమా..!

(మొదటిపేజీ తరువాయి)

ఉంచుకుని దేశ చరిత్ర, స్వాతంత్ర్య పోరాటాలకు సంబంధించిన పుస్తకాలను కాంగ్రెస్ రాయించిందని అన్నారు. ఇండియా బ్లాక్ గెలిస్తే, ప్రధానిగా ఒక్కొక్కరూ ఒక ఏడాది చొప్పున పరిపాలించే ఫార్ములాను రూపొందించిందని మరోసారి ఆరోపణలు గుప్పించారు. అటువంటి వ్యవస్థతో దేశానికి మంచిని ఆశించలేమన్నారు.

నామినేషన్ల ఉపసంహరణకు నేడే చివరి రోజు

(మొదటిపేజీ తరువాయి)

41 మంది బరిలో ఉన్నారు. ఈ స్థానాల నుంచి ఎక్కువ మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆయా స్థానాల్లోని ఇండిపెండెంట్లు పోటీనుంచి తప్పుకునేలా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఉపసంహరణల అనంతరం సోమవారం రాత్రి వరకు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా వెల్లడి కానుంది.

కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించండి



సిద్దిపేట సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు 2024 - కార్మికవర్గ కర్తవ్యం అంశంపై సెమినార్‌లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక, కార్పొరేట్, మతోన్మాద బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సీఐటీయూ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎం. పద్మ అధ్యక్షతన "పార్లమెంట్ ఎన్నికలు 2024 - కార్మికవర్గ కర్తవ్యం" అంశంపై ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్మిక వర్గాన్ని, దేశ ప్రజానీకాన్ని పదేండ్లపాటు బీజేపీ మోసగించిందన్నారు. ఇప్పుడు మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకుందుకు జిమ్మిక్కులు చేస్తున్నదన్నారు. కనీస వేతనం రూ.26,000 చెల్లిస్తే తప్ప సగటు కార్మికుడు బతకలేని పరిస్థితి ఉందని, కానీ బీజేపీ మాత్రం రోజుకు రూ.178 ఇవ్వాలని నిర్ణయం చేసిందని తెలిపారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, దాంతో కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు కోల్పోయారని ఆరోపించారు. సమ్మె హక్కు కాల రాయబడిందని, 8 గంటల పని విధానం రద్దుచేసి 12 గంటలకు నిర్ణయించిందన్నారు. కోట్లాది అసంఘటిత రంగ కార్మికులకు వర్తించే ఈపీఎస్, పెన్షన్ నెలకు పదివేలు పెంచడానికి బీజేపీకి మనసొప్పడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించడానికీ అంగీకరించడం లేదన్నారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంవీయాక్ట్ 2019 చట్ట సవరణతో దేశంలోని సుమారు 16 కోట్ల మంది రవాణా రంగ కార్మికుల ఉపాధిని దెబ్బతీసిందన్నారు. వివిధ ప్రమాదాలకు రవాణా రంగ కార్మికులను బాధ్యులుగా చేసి పది లక్షల పెనాల్టీ, రెండేండ్ల జైలు శిక్షలకు గురిచేసేలా హిట్ అండ్ రన్ చట్టాన్ని తెచ్చిందని తెలిపారు. పదేండ్లలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయం ద్వారా సుమారు రూ.4.90 లక్షల కోట్ల ఆదాయాన్ని సమకూర్చే పేరుతో ప్రభుత్వ రంగాన్ని బలహీనపరిచిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులు బ్యాంకులకు చెల్లించాల్సిన రూ.2.14 లక్షల కోట్ల బకాయిలను మాఫీ చేసిందన్నారు. జాతీయ బీమా సంస్థ ఎల్ఐసీ వాటాలను ఐపీఓల పేరుతో అమ్మేందుకు తెగబడిందని తెలిపారు. నిరుద్యోగం 50 ఏండ్ల గరిష్ట స్థాయికి చేరిందని, శ్రామికుల నిజ వేతనాలు 20శాతం తగ్గిపోయిందని అన్నారు. నోట్ల రద్దు ద్వారా 15 కోట్ల మంది రోజువారి కూలీలు ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుండి 2022 మధ్య 1,00,474 మంది రైతులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇలా కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక బీజేపీని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సీఐటీయూ శ్రేణులు అభిమానులు ఓడించాలని పిలుపునిచ్చారు. సెమినార్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాములు గోపాలస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు కాట మధు, జిల్లా కోశాధికారి జి.భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా నాయకులు ఎల్లయ్య లక్ష్మి పాల్గొన్నారు.

డబ్బు, మందు పంచకుండా నాతో

పోటీకి సిద్ధమా ?

నా దగ్గర, మా పార్టీ దగ్గర పైసల్లేవు, పోరాడేశక్తి ఉంది

- ఓడినా..గెలిచినా..ప్రజా సమస్యలపై పోరాడుతూ జనం వెంటే ఉంటా
- నేను ప్రజలను నమ్ముకున్నా..వారు డబ్బును నమ్ముకున్నారు..
- సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్



నవతెలంగాణ-రామన్నపేట

'నేను పేద కుటుంబం నుంచి వచ్చాను, పేద ప్రజల సమస్యలపై 35 ఏండ్లుగా పోరాటం చేస్తున్నా.. నా దగ్గర, పార్టీ దగ్గర డబ్బుల్లేవు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే సత్తువ ఉంది. డబ్బులు, మందు పంపిణీ లేకుండా నాతో పోటీకి సిద్ధమా' అంటూ సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని నీర్నెంల, లక్ష్మాపురం, శోభనాద్రిపురం, నిదాన్‌పల్లి, తుమ్మలగూడెం, సిరిపురం, జనంపల్లి, ఇస్కిల్ల, కక్కిరేణి, ఎన్నారం, పల్లివాడ, మునిపంపుల, దుబ్బాక గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఎండీ జహంగీర్‌కు మంగళహారతులు ఇచ్చి, డప్పు వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి ఎన్నికలు అత్యంత కీలకమైనవని, బాగా ఆలోచన చేసి భవిష్యత్ తరాల క్షేమం కోసం ఓటు వేయాలని కోరారు.



పార్లమెంటులో పేదల పక్షాన మాట్లాడేవారు ఎవరూ లేరని, మొత్తం 545 పార్లమెంట్ సభ్యుల్లో 370 మంది కోటీశ్వరులని, 306 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, 194 మంది ఎంపీల మీద హత్య, లైంగికదాడుల కేసులు ఉన్నాయని తెలిపారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అన్ని పార్టీల వారు డబ్బు సంచులతో వస్తున్నారని, పోటీ చేసిన వారందరూ డబ్బులు ఉన్నవారేనని పేదవారు డబ్బులు ఉన్నోడికి, డబ్బులు ఉన్నవారు డబ్బులు ఉన్నోడికి ఓటు వేస్తే పేదలకు ఎవరు ఓటువేయాలని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఎస్ఎల్బీసీ, ఉదయ సముద్రం, ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి, లక్ష్మాపురం ఏటి కాల్వల కోసం నిరంతరం పోరాటం చేశామని, పాదయాత్రలు చేశామని మా పోరాటాల ఫలితంగానే ఈ కాలువలు ప్రారంభమయ్యాయని తెలిపారు. మూసీనది ప్రక్షాళన కోసం పోరాటం చేసామని, దాంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 కోట్లు ప్రకటించిందన్నారు. ప్రజలు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటేస్తే వారు ఎంజాయ్ చేస్తారని, ఆస్తులు కూడా పెంచుకుంటారని విమర్శించారు. బీజేపీ గెలిస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగంను రద్దుచేసి వెట్టిచాకిరి, బానిసత్వం, నియంతృత్వ రాచరిక వ్యవస్థను తీసుకొస్తారని తెలిపారు. కాలువలోకి గోదావరి నీళ్లు తేవడానికి పోరాటం అవసరమన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేక అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. జహంగీర్ విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు చేసి మచ్చలేని నాయకుడిగా ఎదిగారని తెలిపారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాటం చేసేవారు కమ్యూనిస్టులేనని, నియోజకవర్గ సమస్యలపై ఇప్పుడు పోటీలో ఉన్న ఇతర పార్టీల ఎంపీ అభ్యర్థులు తమ జహంగీర్‌తో చర్చకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. ప్రచారంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేశం, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల నాయకులు వనం ఉపేందర్, బోయిని ఆనంద్, మామిడి వెంకట్‌రెడ్డి, కూరేళ్ళ నర్సింహాచారి, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, మీర్ ఖాజాఅలీ, పీఏసీఎస్ వైస్‌చైర్మెన్ అంబటి ఉపేంద్ర రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడింది రూ.104 కోట్లకు పైనే..

రాష్ట్రంలో నగదు, మద్యం, బంగారం, డ్రగ్స్ స్వాధీనం
కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పోలీసు సోదాల్లో..

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆదివారం(28నాటికి) వరకు పోలీసులు జరిపిన దాడులలో భారీ మొత్తంలో నగదు, మద్యం, డ్రగ్స్, బంగారం, వెండి స్వాధీనం చేసుకోవటం జరిగిందని రాష్ట్ర డీజీపీ రవి గుప్తా ఆదివారం తెలిపారు. స్వాధీనపర్చుకున్న ప్రైవేటి విలువ రూ.104 కోట్లకు పైగా ఉన్నదని ఆయన చెప్పారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదేశాల మేరకు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఏ పార్టీ వ్యవహరించినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ స్క్వాడ్‌లను రూపొందించి ఎన్నికల కోడ్ అమలు అయిన నాటి నుంచి అనుమానిత ప్రాంతాలపై దాడులను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అంతేగాక, ఇతర రాష్ట్రాలు ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్నాటక సరిహద్దుల్లో 89 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి సోదాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే, జాతీయ, రాష్ట్ర రహదారులు, ప్రధాన పట్టణాలు, నగరాల్లో సైతం తమకు అందిన సమాచారం మేరకు డబ్బులను అక్రమంగా రవాణా చేస్తున్నవారితో పాటు మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకోవటం జరిగిందని డీజీపీ తెలిపారు. ఈ సోదాలలో రూ.63.41 కోట్లకు పైగా నగదు, రూ.5.38 కోట్లకు పైగా విలువైన మద్యం, రూ.7.12 కోట్లకు పైగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

రిజర్వేషన్ల రద్దుపై కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం

అవి సమర్థవంతంగా అమలు కావాలని మోహన్ భగవతే చెప్పారు : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు సమర్థవంతంగా అమలు కావాలంటూ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మైనార్టీలకు రిజర్వేషన్ల పేరుతో బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేవంత్ ఆరోపణలకు సంబంధించి ఒక్క సాక్ష్యాన్ని అయినా చూపించగలరా? అని సవాల్ విసిరారు. బీసీ రిజర్వేషన్లను నీరుగార్చిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు.. మతపరమైన రిజర్వేషన్లను అమలు చేస్తూ బీసీలకు విద్య, వైద్యాన్ని అందకుండా అది చోద్యం చూస్తున్నదని విమర్శించారు. బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వస్తుందనే భయంతోనే ఆపార్టీ కల్లిబొల్లి మాటలు చెబుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో అమిత్ షా చేసిన ఉపన్యాసాన్ని కాంగ్రెస్ మార్ఫింగ్ చేసిందని ఆరోపించారు. అన్ని కులాలకు రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ ఎజెండా అని సీఎం అంటున్నారనీ, కానీ రాష్ట్రంలో బీసీలకు మాత్రం అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. వారి రిజర్వేషన్లు వారికే దక్కాలంటే బీజేపీను గెలిపించాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ, లేదంటే గద్దె దిగిపోవాలనీ, తప్పయిపోయిందని లెంపలేసుకోవాలని రేవంత్‌కు సూచించారు.

నవచిత్రం


మెప్పించే రోటీ కపడా రొమాన్స్



బెక్కం వేణుగోపాల్

నిర్మాత బెక్కం వేణు గోపాల్ పుట్టినరోజు వేడుకను 'రోటీ కపడా రొమాన్స్' చిత్ర బృందం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత సృజన కుమార్ బోజ్జం మాట్లాడుతూ,'ఈ సినిమాతో నిర్మాతగా నా జర్నీ మొదలుపెట్టాను. బెక్కం వేణు గోపాల్ నాకు చాలా సపోర్ట్ చేశారు' అని తెలిపారు. 'నేను నా లక్కీ మీడియా సంస్థని స్థాపించి 18 ఏండ్లు కావడం ఆనందంగా ఉంది. నేను ఈరోజు ఇక్కడ ఇలా ఉండడానికి ముఖ్య కారణం నా ఫ్యామిలీ, అలాగే నా ఫ్రెండ్స్, నా ఫ్రెండ్స్ లేకపోతే నేను ఈ రంగంలో ఉండేవాడినే కాదు. ఇప్పుడు వచ్చే 'రోటి కాపడా రొమాన్స్' కూడా మంచి హిట్ అవుతుంది. చాలా మంచి సినిమా తీసామనే సంతృప్తి ఉంది' అని బెక్కం వేణు గోపాల్ చెప్పారు.

లంకల రత్న విశ్వరూపం



విశ్వక్‌సేన్

విశ్వక్ సేన్ నటిస్తున్న చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఏఎంబీ మాల్‌లో జరిగిన కార్యక్రమంలో టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా తరువాత.. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరికి ముందు, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరికి తరువాత అనేలా నా కెరీర్ ఉంటుంది. మే 17న థియేటర్లలో కలుద్దాం' అని తెలిపారు. 'విశ్వక్ నటించిన పక్కా మాస్ సినిమా. ఈ మూవీ ఏ రేంజ్ కి వెళ్తుంది అనేది మొదటి షోకి తెలిసిపోతుంది. టిల్లు స్క్వేర్ స్థాయిలో బ్లాక్ బస్టర్ అవుతుందని ఆశిస్తున్నాం' అని నిర్మాత సూర్యదేవర నాగ వంశీ చెప్పారు. దర్శకుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, 'లంకల రత్న'గా విశ్వక్ విశ్వరూపం చూస్తారు' అని అన్నారు.

యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్



సుహాస్ హీరోగా రూపొందిన యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్' ప్రసన్న వదనం'. సుకుమార్ వద్ద అసోసియేట్‌గా పని చేసిన అర్జున్ వై కె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జెఎస్ మణికంఠ, టి ఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. పాయల్ రాధాకృష్ణ, రాశి సింగ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. మే3న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ట్రైలర్ లాంచ్, ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. డైరెక్టర్ సుకుమార్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. దర్శకులు బుచ్చిబాబు, కార్తిక్ దండు, శ్రీనివాస్ అవసరాల, రైటర్ ప్రసన్న ఈ వేడుకలో పాల్గొన్నారు. డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ,'సుహాస్‌ని మట్టి నటుడు అనాలేమో. అంత ఆర్గానిక్‌గా ఉంది. తన నటన చూస్తున్నాను. ఆయా పాత్రల్లో ఇమిడిపోతాడు. మా అర్జున్ మంచి లాజిక్‌తో ప్రసన్న వదనం తీసాడు. ఈ సినిమా చూశాను. చాలా బావుంది. అంత చక్కగా తీశాడు' అని తెలిపారు.

దిగ్విజయంగా 50 రోజులు పూర్తి



శ్రీ బండి సదానంద్ అండ్ మెమరీ మేకర్స్ సోమిసెట్టి హరికృష్ణ సమర్పించు, తుమ్మూరు కోట ఫిలిం సర్క్యూట్ బ్యానర్ పై నిర్మించిన చిత్రం 'బుల్లెట్'. ఎవ్వడికైనా దిగుద్ది ట్యాగ్ లైన్‌తో దర్శకుడు చౌడప్ప రూపొందించారు. హీరో రవి వర్మ, సంజనా సింగ్ జంటగా నటించిన ఈ సినిమా మార్చి 8న విడుదలై 50 రోజులు పూర్తి చేసుకొని సక్సెస్ ఫుల్‌గా ఇంకా థియేటర్లో కొనసాగుతున్న సందర్భంగా ప్రసాద్ ల్యాబ్స్‌లో ఈ చిత్ర 50 రోజుల వేడుకను నిర్వహించారు. నిర్మాత గోపాల్ మాట్లాడుతూ, 'సినిమా విజయం పై మేం పెట్టుకున్న నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు' అని అన్నారు.



300కి పైగా థియేటర్లలో రీ రిలీజ్

కె.టి. కుంజుమోన్ నిర్మాతగా ఎస్.శంకర్ దర్శకత్వంలో ప్రభుదేవా, నగ్మ నటించిన నటించిన చిత్రం 'ప్రేమికుడు'. ఈ సినిమా రీ-రిలీజ్ కానుంది. ప్రస్తుతం ఈ సినిమా రిలీజ్ నిర్మాతలుగా రమణ, మురళీధర్ వ్యవహరిస్తున్నారు. ఘనంగా జరిగిన ఈ చిత్ర రీ రిలీజ్ వేడుకకు నిర్మాత లగడపాటి శ్రీనివాస్, శోభారాణి హాజరయ్యారు. '30 సంవత్సరాల క్రితం వచ్చిన ప్రేమికుడు సినిమాను మళ్లీ మే 1న 300కు పైగా థియేటర్లలో ఘనంగా రీ రిలీజ్ చేస్తున్నాం. బుకింగ్స్ ఓపెన్ అయి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. సహకరిస్తున్న మా డిస్ట్రిబ్యూటర్లకు, నిర్మాత కుంజుమోన్‌కి ధన్యవాదాలు' అని చెప్పారు.

ఆటలు

ఐపీఎల్‌లో నేడు
కోల్‌కత X ఢిల్లీ
వేదిక : కోల్‌కత , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..



బ్రేకుల్లేని జాక్స్

- ఛేదనలో విల్ జాక్స్ అజేయ సెంచరీ
- విరాట్ కోహ్లి అర్థ శతక జోరు
- గుజరాత్‌పై బెంగళూర్ ఘన విజయం

గుజరాత్ 200/3, బెంగళూర్ 206/1

ఐపీఎల్ 17వ సీజన్లో సిక్సర్ల తుఫాన్ కొనసాగుతుంది. విల్ జాక్స్ (100 నాటౌట్) శతక విధ్వంసంతో ఆదివారం మొతెరా మైదానం మోత మోగింది. 201 పరుగుల ఛేదనలో జాక్స్ 41 బంతుల్లోనే సెంచరీ సాధించగా.. విరాట్ కోహ్లి (70 నాటౌట్) అజేయ అర్థ సెంచరీతో కదం తొక్కాడు. కోహ్లి, జాక్స్ మెరుపులతో 201 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ 16 ఓవర్లలోనే ఊదేసింది. ఈ సీజన్లో బెంగళూర్‌కు ఇది వరుసగా రెండో విజయం కావటం విశేషం.





నవతెలంగాణ-అహ్మదాబాద్

విల్ జాక్స్ (100 నాటౌట్, 41 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్స్‌లు) అజేయ శతక సునామీలో గుజరాత్ టైటాన్స్ కొట్టుకుపోయింది. వరుస ఓవర్లలో తుఫాన్ సృష్టించిన విల్ జాక్స్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. విరాట్ కోహ్లి (70 నాటౌట్, 44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) సైతం రాణించటంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 16 ఓవర్లలో వికెట్ నష్టానికి 206 పరుగులు చేసింది. 9 వికెట్ల తేడాతో మరో 24 బంతులు ఉండగానే ఘన విజయం సాధించింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 200 పరుగులు నమోదు చేసింది. సాయి సుదర్శన్ (84, 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), షారుక్ ఖాన్ (58, 30 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్థ సెంచరీలు సాధించారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ బ్యాటర్ విల్ జాక్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. గుజరాత్ టైటాన్స్‌కు పది మ్యాచుల్లో ఇది ఆరో ఓటమి కాగా.. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు పది మ్యాచుల్లో ఇది మూడో పరాజయం.

జాక్స్ తుఫాన్ : 201 పరుగుల ఛేదనలో 14 ఓవర్లలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 148/1తో నిలిచింది. విరాట్ కోహ్లి 69 పరుగుల వద్ద ఉండగా.. విల్ జాక్స్ 44 పరుగుల వ్యక్తిగత స్కోరుతో క్రీజులో నిలిచారు. ఈ దశలో అందరూ విరాట్ కోహ్లి సెంచరీ కోసమే ఎదురుచూశారు. కానీ విల్ జాక్స్ ఝూలు విదిల్చాడు. వరుస ఓవర్లలో మోహిత్ శర్మ, రషీద్ ఖాన్‌లను ఊచకోత కోశాడు. 4, 6, 6, 2, 6, 4తో మోహిత్ శర్మను జాక్స్ ఉతికారేశాడు. ఆ తర్వాత రషీద్ ఖాన్‌ను సైతం జాక్స్ దంచికొట్టాడు. 6, 6, 4, 6, 6తో విశ్వరూపం చూపించాడు. ఈ రెండు ఓవర్లలో 29 పరుగుల చొప్పున పిండుకున్న విల్ జాక్స్ 41 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. విల్ జాక్స్ ఊచకోత ఇన్నింగ్స్‌తో మరో 24 బంతులు మిగిలి ఉండగానే రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 201 పరుగుల లక్ష్యాన్ని ఊదేసింది. విరాట్ కోహ్లి (70 నాటౌట్), డుప్లెసిస్ (24) తొలి వికెట్‌కు 40 పరుగులు జోడించి శుభారంభం అందించగా.. ఆ తర్వాత కోహ్లితో కలిసి విల్ జాక్స్ బెంగళూర్ ఇన్నింగ్స్‌కు రాకెట్ స్పీడ్ జోడించాడు.

సాయి, షారుక్ రాణించగా.. : తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 200 పరుగులు చేసింది. వృద్ధిమాన్ సాహా (5), శుభ్‌మన్ గిల్ (16) విఫలమయ్యారు. సాయి సుదర్శన్ (84), షారుక్ ఖాన్ (58) అర్థ సెంచరీలతో టైటాన్స్ ఇన్నింగ్స్‌ను నడిపించారు. మిడిల్ ఓవర్లలో టైటాన్స్ స్కోరు వేగం కాస్త నెమ్మదించటంతో ఆ జట్టు ఆశించిన స్కోరు సాధించలేదు. డెవిడ్ మిల్లర్ (26 నాటౌట్) డెత్ ఓవర్లలో తనదైన విధ్వంసక ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. చేతిలో 7 వికెట్లు ఉన్నప్పటికీ గుజరాత్ టైటాన్స్ 200 పరుగులతోనే సరిపెట్టుకుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ బౌలర్లలో స్వప్నిల్ సింగ్, మహ్మద్ సిరాజ్, గ్లెన్ మాక్స్‌వెల్ తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.



సన్‌రైజర్స్ చిత్తు

213 పరుగుల ఛేదనలో చతికిల
సూపర్ కింగ్స్ ఖాతాలో ఐదో విజయం
చెన్నై 212/3, హైదరాబాద్ 134/10

నవతెలంగాణ-చెన్నై

విధ్వంసక బ్యాటింగ్‌తో ఐపీఎల్ 17 సీజన్‌ను వేడెక్కించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండు మ్యాచుల్లో భారీ స్కోర్ల ఛేదనలో చతికిల పడింది. చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్‌కింగ్స్ చేతిలో 78 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ట్రావిశ్ హెడ్ (13), అభిషేక్ శర్మ (15), అన్మోల్ ప్రీత్ (0), నితీశ్ కుమార్ (15), హెన్రిచ్ క్లాసెన్ (20), అబ్దుల్ సమద్ (18) అంచనాలకు తగినట్టు ఆడటంలో విఫలమయ్యారు. 18.5 ఓవర్లలో 134 పరుగులకు కుప్పకూలిన సన్‌రైజర్స్ సీజన్లో నాల్గో ఓటమి మూటగట్టుకుంది. అంతకుముందు, రుతురాజ్ గైక్వాడ్ (98, 54 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. డార్లీ మిచెల్ (52, 32 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) సైతం అర్థ సెంచరీతో రాణించటంతో చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 212 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.

ఓపెనర్ అజింక్య రహానె (9) విఫలమైనా.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (98), డార్లీ మిచెల్ (52) రెండో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 27 బంతుల్లోనే గైక్వాడ్ అర్థ సెంచరీ సాధించగా.. డార్లీ మిచెల్ సైతం ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 29 బంతుల్లో ఫిఫ్టీ అందుకున్నాడు. శివం దూబె నాలుగు సిక్సర్లతో అలరించగా.. ఆఖర్లో ఎం.ఎస్ ధోని ఓ బౌండరీతో చెపాక్‌కు ఉర్రూతలూగించాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.